
ఆంధ్రపత్రిక
సచిత్ర వార పత్రిక
4 అణాలు
12-1-55
సంక్రాంతి సంచిక



పండుగ పిలుపు

—గోలి శేషయ్య.



భోగిమంట

చిత్రకారుడు: [illegible] రామ వేంకటేశ్వరరావు

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 48
సంచిక 20
12-1-55

జయ పుష్య బహుళ చతుర్దశి బుధవారం

విషయానుక్రమణిక

సంక్రాంతిసంచిక

కథానికల పోటీఫలితాలు

మొదటి బహుమతి: రు. 75

'సుభద్ర' కథానిక రచించిన

శ్రీ అవసరాల రామకృష్ణారావు

రెండవ బహుమతి: రు. 50

'కోడలు' కథానిక రచించిన

శ్రీ కందుకూరి లింగరాజుగారికి

ఈ సంవత్సరం సంక్రాంతి సంచిక కథానికల పోటీని స్త్రీల మనస్తత్వము, వారి జీవితము, సమస్యలకు పరిమితం చేసినప్పటికీ మూడువందలమందికి పైగా పరిమితిని గ్రహించి కథానికలను పంపగలిగినారని తెలపడానికి ఆనందిస్తున్నాము. వీరిలో నూరుగురు వరకూ స్త్రీలే (స్త్రీలపేర్లుపెట్టి మగవారు పంపిన రచనలు మినహా) కథానికలు పంపడం ప్రత్యేకం గమనించదగిన విషయం. మహిళలు అత్యంతోత్సాహంతో మా పోటీలో పాల్గొన్నందుకు వారికి మా కృతజ్ఞత ప్రకటిస్తున్నాము. అయితే రెండింటిలో ఒక్క బహుమతికూడా మహిళా రచయితలు గెలువలేక పోవడం కొంత నిరుత్సాహానికి కారణమయింది. కాని మున్ముందు స్త్రీలు తప్పక ఉత్తమ రచనలు చేయగలరనే మా దృఢవిశ్వాసం.

—సంపాదకుడు.

బారిష్టరు గారి బాత్రాఖాని

మొక్కపాటి నరసింహశాస్త్రి

నేను క్లబ్బుకు రావడానికి మామూలు కంటె ఒక్కగంట సుమారు, ఆలస్య మయింది. నేను వచ్చేసరికి క్లబ్బులో జనం ఫ్రూటుగా, తేనెపట్టులో పురుగుల్లాగ కలకల లాడుతున్నారు. జుమ్మని సనాయి శ్రుతిలాగ క్లబ్బునాదం వీధులోకే వినపడుతోంది.

వేపచెట్టుకింద మా మురారావాళ్ళంతా యథాస్థానాల్లో సుఖాసీనులయ్యారు. పూర్వం ఋష్యాశ్రమాల్లో హోమధూమంలా వారి సిగరెట్ల ధూమం చిన్నచిన్న మేఘాలుగా పైకి తేలిపోతోంది. వాళ్ళేదో మహా విషయాన్ని గురించి తీవ్రంగా చర్చిస్తున్నారు. నా రాకకూడా ఎవ్వళ్లూ గమనించనట్లుగానే సంభాషణ సాగిస్తున్నారు.

ఏదో వాక్యం మధ్యలో: 'అరే గురువుగారొచ్చారోయి - నమస్కారమండి' అన్నాడు రామం. 'అదేమిటి గురుదేవ్ చడీ చప్పుడు, కాకుండా వచ్చారు' అన్నాడు భద్రం. 'ఈ అలవాటులేని ఆలస్యానికి హేతుభూతంబైన కారణం బెద్దియో ఎరుంగింపుమా మిత్రసత్తమా' అన్నాడు శర్మ. 'ఏం మహానుభావా మమ్మల్ని ఇలా ఏడిపించారినాళ్ళ. స్వాతివానకోసం ఎదురుచూచే ముత్యపుచిప్పల్లాగ మీకోసం మేమిలా నిరీక్షిస్తూ కూచున్నాము' అన్నాడు శాస్త్రి.

'అందుకనే కాబోలు, అంతా మాటామంతీ లేకుండా నా రాకకూడా చూడకుండా దీర్ఘవిచారంలో మునిగిఉన్నారు,' అన్నాను. 'అంటే, దానికో కారణముందిలెండి ఈనాటి సాధారణ సమావేశంలో ఒక అసాధారణ విషయం చర్చకొచ్చిందిలెండి' అన్నాడు శాస్త్రి. 'ఓహో! అలాగా! బాగుంది. మరి కానివ్వండి. ఊరుకున్నారేం, అదేదో నేనూ విని ఆనందిస్తాను,' అన్నాను. 'మరేం లేదండి విషయం ఒకటేకాని, దానివల్ల కలిగే బాధమాత్రం అందరికీ తలో రకంగానూ తేలుతోంది' అన్నాడు శర్మ. 'అంటే నాకేం అంతుపట్టటం లేద'న్నాను.

'అంతుపట్టడానికి పట్టుకపోవడానికి ఏముందండి. తెల్లవారితే భోగిపండుగ కాదండి మరి - తెల్లవారకుండానే వాళ్లావిడ తలంటి పోసుకోమంటుందట. అదెలా తప్పించుకోడమా అని టప్పయ్య బెంగెట్టుకున్నాడు. వాళ్లావిడకు ఎలాంటి చీరకొంటే బాగుంటుందో తేలక రామం కొట్టుకుంటున్నాడు. ఎల్లుండి పెద్దపండుగనాడు బ్రాహ్మడిని పెట్టుకుని పితృతర్పణం చెయ్యాలి అప్పటిదాకా కాఫీ సిగరెట్టు లేకుండా బ్రతకడమెలాగా అని శాస్త్రిగారు బాధపడుతున్నారు. పండుగకు ఏయే పిండివంటలు ఫరమాయిస్తే బాగుంటుంది మన దేశానికొస్తే ఎక్కువరకాలు పిండివంటలు కనుపించ వెందుకోగాని. దానికి మల్లంపల్లివారేమైనా సమాధానం చెప్పగలరా అని శర్మగారు ఆలోచిస్తున్నారు. ఇలా అంతా తలో చిక్కులోనూ పడి కొట్టుకుంటున్నాం. అసలింకా ఈ రోజుల్లో ఈ పండుగలూ న్యూసెన్సు ఏమిటండీ. ఏదో కావలిస్తే స్కూళ్ళకూ ఆఫీసులకూ శెలవు లివ్వడానికి మరో పేరెట్టుకోవచ్చుకాని పండుగ పేరెంతో సైతం ప్రాణంమీదికొస్తోందండీ ఎప్పటికప్పుడు - ఏమంటారు గురుదేవ్. నే నన్నదాంట్లో తేడా ఏమైనా ఉన్నదంటారా' అన్నాడు భద్రం ఏకదమ్ములో.

'అబ్బే! నువ్వన్నదాంట్లో తేడా ఏముంది. ఏమాటకు నాకూ ఇలాగే చాలాసార్లు అనిపించింది. ఈ కాలం, ఈ పద్ధతులూ చాలా చిత్రంగా ఉంటాయి. అసలు మనం మనమేనా అని కూడా అనిపిస్తుంది ఒక్కొక్కప్పుడు. పండుగ అనేమాటలోనే ఎంతో ఉత్సాహం ఆనందం ఇమిడి ఉన్నాయి. అలాంటి పండుగంటే ఈ రోజుల్లో ఎవ్వళ్లకూ ఏవిధమైన సంతోషం కనుపించదు. పండుగలన్నా పర్వాలన్నా మాచిన్నతనం,అంతకుముందు రోజుల్లోనూ వచ్చిన పండగలే పండుగలు. అప్పటి ఉత్సాహం వేరు. అప్పటి ఆనందం వేరు. ఇంతటి విజ్ఞానం, ఇంతటి అభ్యుదయం అప్పుడు ఎక్కడున్నవంటారేమో, కావచ్చు, కాకపోనూ వచ్చు. ఈ విజ్ఞానం కంటె ఆ అజ్ఞానమే మెరుగనిపిస్తుంది ఒకొక్కప్పుడు. ఆ అజ్ఞానంలో కంటికి కనపడని కవిత్వం, ఊహకందని సౌందర్యం ఉండేవి. ఇప్పుడు మన విజ్ఞానంతో, నాగరికతతో దాన్ని [illegible] చేశాం. దీపావళి సంగతి ఆలోచించండి. మన చిన్నప్పుడు, నరకుడనే భయంకర రాక్షసుణ్ణి, సత్యభామా సమేతుడైన శ్రీకృష్ణుడు నిర్జించి లోకకల్యాణం చేకూర్చినదే కథ వినో వినకనో టపాకాయలు కాలుస్తుంటే, ముత్యాల మతాబులు కాలుస్తుంటే, వాటిలో ముత్యాలలాగ, బాలబాలికల ముఖాలలోనూ, వాళ్ళ తలిదండ్రుల ముఖాలలోనూ నాట్యమాడే ఆనందరేఖలు మీ కిప్పుడెక్కడేనా కనిపిస్తున్నాయా? ఎందుకు కనిపిస్తాయి! గంధకపు పొగ తగిలి ఇవ్వాకాలంలో ఎక్కువగా ఉండే దోమలు వగైరా పురుగులు చస్తాయనే జ్ఞానం మనకు కలిగింది. వెంటనే అవన్నీ కాల్చి, ఆ పొగ మనంకూడా పీల్చి సగం చచ్చేకంటె [illegible] డి.డి.టి. కొడితే సరిపోదా అనే తర్కం [illegible] బయలుదేరుతోంది. ఇంక బాణసంచాలు కాల్చే ఆనందం, దీపావళులు వెలిగించి ముక్కలించే అబలల ఆనందం ఎక్కడ నిలుస్తుంది ఈ తర్కంముందు

'అలాగే ఈ సంక్రాంతి ఉండనుకోండి. మనదేశంలో ఇంతకంటె సార్వజనీనమైన పండగ మరొకటి లేదని మీకందరికీ తెలుసు కాదూ! ఆ బాలగోపాలం, ఆపండితం ఈ పండుగలో వాళ్లని అమితంగా ఆనం

★ బారిష్టరుగారి బాతాఖానీ ★

ిస్తారు. ఎందుచేతనో మన పండగలన్నీ వాళ్ళు. గోకులాష్టమిలో ప్రారం
దక్షిణాయనంలోనే వజేశారు మన భించి, మహాశివరాత్రితో అంతమవు

తాయి మన పండగలన్నీ, ఒక్క సంవత్సరాది మినహాయించి. కృష్ణాష్టమి, ఉండ్రాళ్ళ తద్ది, వినాయకచవితి, అనంతపద్మనాభ వ్రతం, దేవీనవరాత్రులు, అట్లతద్ది, దీపావళి, నాగులచవితి, కార్తీకపౌర్ణమి, సుబ్రహ్మణ్య షష్ఠి, రథసప్తమి, సంక్రాంతి, ముక్కోటి, మహాశివరాత్రి అబ్బ ఎన్ని పండగలు! వీటి అన్నిటిలోనూ, అందరకూ ఆనందం కలుగచేసేది సంక్రాంతి.

సంక్రాంతి అసలు వ్యవసాయదారుల పండుగ. సమస్తమూ సమృద్ధిగా పండే సుభిక్షమైన ప్రదేశం మన తెనుగుగడ్డ. అందరూ కొద్దో గొప్పో వ్యవసాయదారులే. అందుకనే అందరకూ పండుగ. నిజంగా సంక్రాంతిపండగ రెండు మూడు రోజుల పండగకాదు. నెలా పదిహేను రోజుల పండగ - రవి ధనుస్సులో ప్రవేశించినప్పటినుంచీ, అనగా సంక్రాంతి ముందు నెల పట్టడమంటారే, అది- మార్గశిర బహుళం మొదలు మాఘ శుద్ధ సప్తమిపరకూ, అనగా రథసప్తమివరకూ సంక్రాంతి పండుగరోజులన్నమాటే. మార్గశిర బహుళంలో, అనగా నవంబరు ఆఖరు రోజుల్లో వరికోతలు ప్రారంభిస్తారు. కొంచెం మించు మించుగా అదే ప్రారంభమౌనుకొండి. వరిచేలల్లో పగలంతా కోతకోసి, తలోకట్టా నెత్తిన పెట్టుకొని పగటి కష్టమంతా మరచి, హాయిగా సూర్యాస్తమయం కాబోయేసరికి

అందాలు చందాలు తుమ్మెదా
మందమందహాసాలెల్ల తుమ్మెదా
పచ్చల్లపసిమొక్క తుమ్మెదా
నీటిపట్టు చేరిననాడె తుమ్మెదా
విందులూ వియ్యాలు తుమ్మెదా

—అనో

గొబ్బియళ్ళో చందమామా
చందమామా, చందమామా, ఓచందమామా!
చందమామకీ పిల్లాలెందరు
నీలగిరీ కన్యాలెందరు
చందమామా, చందమామా, ఓచందమామా!
గొబ్బియళ్లో చందమామా
నీలగిరీ కన్యాలకూ
నిత్యమల్లి తోటాలంటా
నిత్యమల్లి తోటాలోనా, మంచినీళ్లాబావు లంటా
మంచినీళ్లా బావులాకూ మల్లెల్లా తాడూలంటా.
మల్లెల్లా తాడూలాకూ గిలకల్లాచెంబూలంటా
గొబ్బియళ్లో చందమామా
చందమామా చందమామా ఓచందమామా
అంటూ మధురగానంచేస్తూ రాత్రిరాబోయే ఆనందాన్ని తలుస్తూ అవ్యక్తానందంతో అడుగులేస్తూ పల్లెపడుచులు గుంపులు గుంపులుగా ఇళ్లకు చేరుకునేవాళ్లు.

పొలంకేసి ఎప్పుడూ వెళ్ళకుండా ఇంట్లో కూర్చున్న వాళ్ళకు కూడా కోకిల కూజితం వసంతాగమనాన్ని సూచించినట్లే, ఈమధుర గానం ధనుర్మాసారంభాన్ని, సంక్రాంతి సామీప్యాన్నీ స్ఫురింపచేసేది.

ధనుస్సులోకి రవి వచ్చాడని ఎలా తెలిసేదో, ఆంధ్రదేశంలో అన్ని వర్ణాలవారికీ ఒక్కసారి తెలిసేది. ఇంటింటా ఆడపిల్లలంతా తెల్లవారకుండానే లేచి, దంతధావనంచేసి, ఇళ్ళముందు శుభ్రంగా తుడిచి కొత్తగా పేడనీళ్లు చల్లి, దానిమీద ఎన్నెన్నో రకాల ముగ్గులు, ఒకరు పెట్టినది ఒకరు పెట్టకుండా అనుకోకుండానే పందెములు వేసుకున్నట్లు పెట్టేవారు. సంక్రాంతి దగ్గరకొచ్చినకొద్దీ ఈ ముగ్గు లెక్కువయ్యేవి. క్రమేణా వీధి వీధంతా ఆక్రమించేవి. ఇక్కడ భేదా గొప్పా లేదు; బ్రాహ్మణా అబ్రాహ్మణా లేదు; అవర్ణ సవర్ణ భేదం లేదు. అన్ని ఇళ్ళముందూ ఈ ముగ్గులు కొన్ని వేల డిజైన్లు కనపడేవి. ముగ్గులు పెట్టి, వాటిపైన గోమయం ఉండలుచేసి ఆ ముగ్గులమీద పెట్టి వాటిపైన గుమ్మడిపువ్వులో బంతిపువ్వులో గుచ్చి, బంతి చేమంతిరేకలతో పసుపు కుంకుమలతో వాటిని పూజించి బెల్లమో పటికి బెల్లమో నివేదన తెచ్చేసరికి తక్కిన చిన్న పిల్లలు కూడా లేచి ముఖాలు కడుక్కొని వచ్చేవాళ్లు. అంతా చేరి

కొలని దోపిడికి గొబ్బిళ్లో
యదుకులస్వామికి గొబ్బిళ్లో
కొండదాపునా గోవులు కాచిన
కొండొక శిశువుకు గొబ్బిళ్లో
యదుకులస్వామికి గొబ్బిళ్లో...

అంటూ చప్పట్లు చరుస్తూ గొబ్బిళ్లు చుట్టూ నృత్యంచేసి, నివేదనచేసి తలో కొస్త బెల్లంముక్క నోట్లో వేసుకుని బ్రహ్మానందపడతారు. ఒక గంట అయిన తరువాత ఈ గొబ్బెమ్మలను తీసి పిడకలుగా చరిచి జాగ్రత్తపెట్టేవాళ్లు. ఇలా నెల రోజులు, కనుమ ప్రొద్దుటవరకూ ఈ లేత హృదయాలు అవ్యక్తానందంతో పొంగిపోతుండేవి - ఈనాటి బాలబాలికల కెంతమందికి అనుభవమున్నదో చెప్పండి!

జనవరి మొదటివారం పూర్తిఅయేసరికి అంతటా కుప్పనూర్పులవుతాయి. ధాన్యం ఇంటికి చేరుతుంది. గాదెలలో భద్రపరచుకుంటాడు రైతు. మళ్లీ ఈరోజువరకూ అతనూ, అతనివాళ్లూ తిండికి తడుముకోనక్కరలేదు. తనూ తన పిల్లలూ సుఖంగా తినడం, పదిమందికి పెట్టడంలోనూ అతనికెంతో ఆనందం. అందుకని ఈ రోజుల్లో పూర్వం బిచ్చగాళ్లు ఎక్కువగా వచ్చేవాళ్లు. ఆ యాచన ఈనాటి యాచనలాంటిది కాదు. ఆయాచన సంవత్సరానికొక్క మాసం రోజులు మాత్రమే. అదేనా డబ్బుకోసం కాదు; తిండికోసం. ప్రతి యాచకుడికీ ధాన్యమే ధర్మంచేసేవారు. వాళ్లలో కూడా ఈ యాచకులు—అనేక రకాలవాళ్లు వచ్చేవాళ్లు. వాళ్లను చూస్తుంటే మన పూర్వమతసంస్థలు జ్ఞాపకం వచ్చేవి. పొద్దున్నే జంగం యాచనకు వచ్చేవాడు. అదో విచిత్ర వేషధారణ. పొడుగాటి అంగరఖా, నెత్తిన తలగుడ్డ, దానిపైన జటాజూటం, గంగ, పార్వతి ఉన్న ఇత్తడి రేకొక చేతులో, ప్రణవం పలుకుతూ చక్కని కంచుగంట, రెండో చేతిలో, మెడలో పెద్ద శంఖం డమరుకం, చంకనిజోలె, అపర శివుడులా వచ్చేవాడు. ప్రతి గుమ్మం దగ్గరా అతను రావడంతోనే కుర్రాళ్లు పరుగెత్తుకొచ్చి డమారా వాయించమనే వాళ్లు ఒకళ్లు, శంఖం ఊదమనే వాళ్లు ఒకళ్లు, కొస్త పెద్ద కుర్రాళ్లు ఆ గంట చుట్టూ ఒక పుల్లముక్క రాస్తుంటే ఓంకారం ఎలా పలుకుతుందా అని ఆశ్చర్యంతో చూస్తూ కూచునేవాళ్లు. వాని వెంటనే సాతానివచ్చేవాడు. నెత్తిన గుమ్మడికాయి రాగిచెంబు, కాళ్ల కుగజ్జలూ, చేతిలో చిరతలు, వొంటినిండా నామాలూ హరిలో హరి అంటూ చిందులు తొక్కుతూ వచ్చేవాడు.

పట్టుబుట్టము చుట్టినట్టి బోడిశిరంబుపైనొప్పున
నక్షయ పాత్రనొకటి
ఇరుకక్షములందొని తిరునామముల పుస్తకమున
తాళవృంతమున రెండు
క్షుద్రకుటీప్రాంత కంకభీతిని కడిపెల
డాల్చిన తిరుకోల నొకటి

మహా పర్వము

'వజ్రపాణి'

అన్వర్థనామధేయంబగు గుమ్మడికాయ చెంబును శిరోగ్రమున నిలిపి,
చేదోయి గీల్కొన్న చిట్టితాళములతో స్వీయలయజ్ఞాన సిద్ధి జూపి,
పాదమ్ములకు గట్టువడినట్టి క్షుద్రఘంటికల శబ్దములతో నృత్యమాడి,
'హరి! రంగ! హరి!' గీతాలాపనములతో మాధురుల్ చిల్క, మైమఱువ జేసి

తెల్లవారకమునుపె మా తెల్గువారి
ప్రతిగృహమ్మున భిక్షలు వడసి, తనిసి,
మందహాసానుండయి మగుడుచున్న
జియ్యరును గంటిరే! పుష్య శిష్టవేళ.

ఈ ప్రత్యూషతుషారవాయువులు తామే మాత్రమున్ నీదు దీ
తా ప్రాచుర్యము తగ్గజేయవటె! రంగద్రంగవల్లుల్ సుశి
ల్ప ప్రావీణ్యము లందుకొన్నవి భవద్ భవ్యాంగుళీ నిర్మితా
లై, ప్రజ్ఞాఖని! యౌవనోల్లసిత భావావేశ వీ వన్నిటన్!

క్రొత్త ధాన్యములతో, కూరగాయలతోడ మాయిల్లునిండె నీమధురవేళ,
క్రొత్తయల్లుండ్రతో అత్తవారిండ్లు క్రొంగ్రొత్త వెల్గుల వెన్నెగుత్తగొనియె,
ఇంతింతలైన చామంతులు, ముద్దబంతులు గంతులాడె మాతోటలందు,
పరికిణీ త్రొక్కాడు పదియేండ్ల బాలిక గొబ్బిళ్లపాటలు కూర్చి తీర్చె,

ఇన్నిమాటలు దేనికోయీ! పవిత్ర
మైన యీ శుభవేళ మా ఆంధ్రరాష్ట్ర
మొక విలక్షణకాంతిలో, నొక్కమధుర
భావ వీచికలో స్వర్గ పరిధి జూచె!

★ బారిష్టరుగారి బాతాఖానీ ★

ఆ చేతి దారు ఖండపుదాళ్ళయుగి రెండు,
స్వప్రతీకంబులు పదియు రెండు,

రమణ నష్టాదశోర్ధ్వ పుండ్రములు దనకు
నమర నత్యర్ధకృష్ణవత్వముఖటిల్ల
జికికమెుత్తంగ సాతాని పిండుదిరుగు
దగ ధనుర్మాస వాసరాంతరముల.

అని ఒక మహాకవి వర్ణనకుకూడా పాత్రుడయ్యాడు. తరువాత కిర్రుగిలక తిప్పుకుంటూ 'మీ పిల్లాలూ జల్లాలూ సల్లంగ ఉండాలె అల్లా ఖానా' అని స్వంత కవిత్వం పాడుకుంటూ తురక యాచకం. 'గంగిరెద్దుకులేవె ఘనతూర్య రావముల్' అన్నట్టు రంగురంగు బట్టలూ బొంతా కప్పి కొమ్ముచివరలకు ఇత్తడి తొడిగి సనాయి వాయిస్తూ గంగిరెద్దు నాడిస్తూ ఇద్దరు ముగ్గురొచ్చేవాళ్ళు. ఊళ్ళో కుర్రాళ్ళంతా వాళ్ళతోటే ఇంటింటికీ తిరుగుతూ.

డూడూడూడూ బసవన్నా
అమ్మగారికీ దండంపెట్టూ
అయ్యగారికీ దండంపెట్టూ

అన్నప్పుడల్లా ఎద్దు మొకరిస్తుంటే ఈనాటి కుర్రవాళ్ళు సర్కసు చూచి సంతోషించినట్టు సంతోషించేవాళ్లు.

వాళ్లవెనకనే చిరిగిపోయిన పట్టుబట్ట మొలకూ నడుముకూ కట్టి, నామాలు తీర్చి పెద్ద దీపపుసెమ్మె దీపంతో తీసుకుని, చిరతలు వాయిస్తూ.


వెంధుకై తే వ్యంచీనావూ బంధిఖానాలో
నీ వంసుకై తే వ్యంచీనావూ హో
రామయ్యో రామయ్యో రామయ్యో హో

అని దీపంచుట్టూ గంతులేస్తూ భక్తిసార వశ్యాన్ని నటించే రామదాసులు కొందరు వచ్చేవాళ్ళు. తరువాత పిన్నల్ని పెద్దల్ని ఆకర్షించే పగటివేషగాండ్ర జట్టు ఒకటి, ఇలా వాళ్లలో జాము జామున్నరవరకూ పిల్లలకు కాలక్షేపం అవుతూఉండేది.

ఎవ్వరినీ ఎవ్వరూ రిక్తహస్తాలతో పంపేవారు కారు. నీకేం తెసులు పనిచేసుకు బ్రతకరాదా అనేమాట ఎక్కడా వినపడేది కాదు. ఇచ్చేవాడికి ఏ కొంచెమో ఇస్తున్నామనే సంతోషం, పుచ్చుకునేవాడికి చెక్కవాడికంటె ముక్కవాడిపనే వాటం; ఈ నెలరోజులూ ఇలా దొరుకుతే చాలా వరకు మన సంసారాలు సాగించుకోవచ్చు ననే సంతోషం ఉండేది.

ఇక కూతుళ్లకు కొత్తగా పెళ్ళిచేసిన ప్రతి గృహస్తూ పండుగ పదిరోజులుండనగా వియ్యాలవారింటికి వెళ్ళి కొత్త అల్లుడిని, వీలయితే వియ్యపరాలనూ కూడా తీసుకువచ్చేవాడు. ఇంట్లో పిల్లలందరకూ బావ వచ్చాడంటే ఎంత సంతోషమో! ఒకటేమిటంటే రోజూ బావతో రకరకాల పిండివంటలూ ఫలహారాలూ దొరుకుతాయి. రెండు! బావతోటి అస్తమానం ఆడుకోవచ్చు. వేళాకోళాలాడొచ్చు. ఇంక అంతకంటె సంతోష మేముంటుంది. అక్కయ్య ఏదో వంకను నాలుగుసార్లు ఇటూ అటూ తిరుగుతుంది. ఈ చాటునుంచీ ఆ చాటునుంచీ తొంగిచూస్తుంది—పరికిణీ విసురూ, గాజుల చప్పుడూ ఏమాత్రం వినపడ్డా బావ ఉలిక్కిపడి ఇటూ అటూ ముఖమంతా కళ్లుచేసుకుని ఎందుకో చూస్తాడు. ఊరికే ఏదో చప్పుడుచేసి అతను నలుదిక్కులా చూడడం చూసి నవ్వుతూ, బావ నేడిపిస్తూ ఉండేవాళ్లు కుర్రాళ్లు.

కాని ఆ వయస్సు, ఆరోజులూ, ఆ పద్ధతులూ చాలా అద్భుతంగా ఉండే వనుకుంటాను. ఈ కాలంలో మనం *Romance*



"గంగిరెద్దుకులేవె
ఘనతూర్య రావముల్"

—ఫోటో: కె. నాగలింగేశ్వరరావు.

(ప్రేమ) అనుకునేది, నిజంగా ఆ రోజుల్లోనే ఉండేదేమో. వధూ వరులు ఒకళ్లనొకళ్లు క్రమేణా, పూర్తిగా తెలుసుకోడం, ఒకరినొకరు అర్థం చేసుకోడం, ఒకరిబంధువులలో ఒకరుకలిసిపోవడం, చిన్నతనంలో ఈ చాటునుంచీ, ఆ చాటునుంచీ తళుక్కుమనే చూపుల మెరుపులు, వరుడు ఒంటరిగా ఉన్నప్పుడు, గదిలో ఎవ్వరూ లేరనుకుని వచ్చినట్లు నటించి పోమాచిన వధువును కౌగిటలాక్కుని, ఇద్దరూ భయంతో, సంతోషంతో ఒకరినొకరు చూడలేక చూచుకొనే మహా యుగక్షణికం, ఇవన్నీ లేత హృదయాల్లో నాటుకుని మొలకలెత్తిన ప్రేమాంకురాలు, పెరిగి తరుణ వృక్షమై క్రమేణా మహావృక్షమై మన జీవితాన్నంతనీ తన చల్లని నీడతో కప్పేది. ఇది *Romance* కాకపోతే ఇంకేమిటి— జన్మాంతరాలలో కూడా తలచుకుంటే పులకలెత్తించే ఈమధురానుభూతులను ఎవరు వర్ణించకలరు—ఈ కాలంవారు అయినప్పుడూ, కానప్పుడూ, ఇంటా, బయటా బీచి వొడ్డున, బస్సులోనూ, కారులోను, సినిమాలోను, పార్కులోను యథేచ్ఛగా నిర్మొగమాటంగా, నిశ్చింతగా అనుభవించే రొమాన్సు కివి సాటి కావేమో చెప్పలేం. అర్ధరాత్రే ఊరంతా భోగిమంటలు. ఇంక తెల్లవారుతే భోగి అనగా తెల్లవారు ఝూమున మూడుగంటలకే అమ్మలేచి, నీళ్ళపొయ్యి ముట్టించి, ముందు పెద్దవాళ్లను, తరువాత చిన్నవాళ్లను వయసువారీగా లేపి తలంటి, పులగం, బెల్లం, వంకాయబజ్జి, పెరుగుతో చల్దులారగింపచేసి తనపని చూసుకునేది. మరునాడు అందరకు కొత్తబట్టలు. అందరికీ ఎంత ఆనందంగా ఉండేది! మగవాళ్లు ఎంత పెద్దవాళ్లూ కూడా ఈ మూడు రోజులూ హాయిగా మధ్యాహ్నం పేకాడడమో, కులాసాగా కబుర్లు చెప్పకోడంతోటో గడిపేవారు పెద్దపండుగనాడు శ్రోత్రియులు బ్రాహ్మడిని పెట్టుకుని తర్పణంవదిలి పితృదేవతలను తృప్తిపరచేవారు. కనుమునాడు అమ్మవారికి నివేదనలు, దాసదాసీ జనానికి, చాకలివగైరాలకు పెట్టుబళ్లు.


ముక్కనుమునాడు వచ్చిన బంధువులను సాగనంపడం. ఈలోపున ఏ చాటునో అమ్మాయి పెళ్లికొడుకుని బొమ్మలనోము వెళ్లేదాకా ఉండమని బ్రతిమాలుతుంది. అల్లుడు మామగారిచేతా, అత్తగారిచేతా బలవంత పెట్టించుకుని ఆగిపోయేవాడు, తల్లిని ప్రయాణంచేసి. పెళ్ళాం అప్పుడే అంత బెల్లమ్ముక్క అయినదట్రా నాయనా అని లేనికోపాన్ని అభినయిస్తూ ఆవిడ వెళ్ళిపోయేది.

ఇక పదిరోజులు బ్రాహ్మణ గృహాల్లో బొమ్మల నోములు- పండగ మూడురోజులూ బొమ్మల కొలువులు. పిల్లలు ఊళ్లోపిల్లల నందరినీ పేరంటానికి పిలవడం తమ బొమ్మల్ని చూపించడం వాళ్లకు వాయనం ఇచ్చి పంపించడం, ముందు ముందు వాళ్ళు ఎప్పుడెప్పుడేమేమిచేస్తే సాంఘిక జీవనం సుఖతరంగా వెడుతుందో అవన్నీ ఇలా పిల్లలకు అలవాటు చేసేవారు మన పెద్దలు. ఆ సంవత్సరమే కార్యమై, గర్భవతియై మాసపూర్తిఅయిన భార్యను చూడడానికొస్తాడు యువకుడు. ఏ బి. ఏ. క్లాసో, ఏదో చదువుతూంటాడు. మళ్లీ కాలేజీకి వెళ్ళాలని బయలుదేరతాడు. భార్య ఉండమని బ్రతిమాలుతుంది. ఎలాగ కాలేజీపోతుంది; పరీక్షలు కాగానే వస్తానంటాడు. ఈ గండంతప్పి బయటపడి మిమ్మల్ని మళ్ళీ... అని పైమాట గొంతులోనే ఆగిపోయి కంట తడిపెట్టుకునే భార్యను నిండు చూలాలిని కౌగిటచేర్చి ముద్దాడి ఏమిచెప్పాలోతోచక, అయితే చదువు మానేస్తాననే భర్తను, తను ధైర్యం తెచ్చుకుని, భర్త కభయమిచ్చి పంపించే నవోఢలు ఇప్పుడున్నారా అనిపిస్తుంది.

ఇలా పిన్నలకు, పెద్దలకు, ఏ తరహా వాళ్లకు ఆ తరహాగా ఆనందం కల్పించే పండుగ మరొకటేదీ? అలాటి పండుగ వస్తున్నదంటే సంతోషించడంపోయి, తలంటి నీళ్లేమిటని ఏడ్చేటప్పయ్యాలు, కొత్తబట్టలు ఏమిపెట్టి కొననని బాధపడే వారు తయారయ్యారు. అవును మరి. పండుగేమిటి నాన్సెన్సు. సూర్యుడు ధనుస్సులోనుంచి మకరంలోకి మారుతాడు. అయితేఏం? ఆయన 12 నెలలూ 12 రాసుల లోకీ మారుతూనే ఉంటాడు. అదో పెద్ద ఇదా? దీని కింత తదంగమా. తెలియనివాళ్లు మనవాళ్ళు ఏంచేసినా తెలిసి మనంకూడా ఇలా ఇదవడం ఏంబాగుంది కాదు. దేవతలకు సంతోష సమయమంటారూ; అయితే మనకేం. పితృదేవతలు యమలోకంలోనుంచి దేవలోకంలోకి వెడతారంటారూ; ఏమో నబ్బా మన నమ్మకల కెక్కడో అవధి ఉండాలె. పిండివంటలూ కొత్తబట్టలూ అంటారూ! అవి ఎప్పుడు ఏరకం కావలిస్తే అవి హోటళ్ళలోనూ షాపుల్లోనూ దొరకనే దొరుకుతాయి. అనే వాళ్లకు పండుగేమిటి పర్వమేమిటి నా మొహం. కాని దానికల్లా ఒక్కటే చిక్కు. మాంచి నడి శీతాకాలంలో వస్తుంది ఈ పండుగ. ఈ కాలంలో ఈ అణ్వస్త్ర ప్రయోగాలవల్లా దానివల్లా, ఋతువులూ, ఋతుధర్మాలూ కొంచెం తారుమారయినా, పూర్వం ఈ రోజుల్లో చలి ఎక్కువగానే ఉండేది. అందుకనే ఆ కవెవరో చలిబాధ పడలేక ఈపద్యాలు వ్రాశాడట.

ఈ హేమంతమురాక చూచి రమణీ
హేలా పరీరంభ స
త్సౌ హాయ్యంబున కాక దీని గెలువన్
శక్యంబు కాదంచు తా
నూహాపోహ విధిన్ ద్రిమూర్తులు సఖీ
యుక్తాంగులైనారుగా
హోహో! వారలదేమి సంతత వధూ
యోగంబు కాగందురే.

అయినా ఇప్పుడు మనకా బెంగేముంది. బోలెడన్ని బనియన్లు, స్వెట్టర్లు, ఫ్లానలు చొక్కాలు, రగ్గులు ఒకటేమిటి చలిని పారద్రోలెత్తించి వేడెక్కించే సాధనాలూ పరికరాలూ ఉన్నప్పుడు మనకేం. లేవండి పోదాం. వాళ్ళు తెల్లవారకట్ల లేవాలి. టప్పయ్యాకి బెంగెట్టుకోకు. నేను వచ్చి నీకు నూనె కొంచెం రాయమని, నలుగు పెట్టొద్దనీ, ఒళ్ళు నెమ్మదిగా తోమమనీ మీ ఆవిడతో చెపుతాలే! ★



తలుపు దఖేలున తీసుకుని లోపలికి వచ్చాడు వరదరాజు. క్రాపు చెరిగి మొహంమీద పడుతోంది. పొడగరి కావటంవల్ల కొంచెం వంగి లోపలికి విసురుగా వచ్చాడు. లోపల వెలుగుతున్న లాంతరు మసకవెల్తుర్లో అతని కళ్లు రెండూ ఎర్రగా మెరుస్తున్నాయి. పొడుగు లాల్చీ తొడిగాడు; పంచె సైకిల్ కట్టు కట్టాడు. ముప్పై ఏళ్లుంటాయి. మనిషి కొంచెం తూలుతున్నాడు. రెండే గదుల ఇల్లు అది. మొదటిగదిలో లాంతరు కప్పుకింద ఇనపతీగెకి వేళ్లాడుతోంది. గోడలన్నీ మసకబారి, పెచ్చులూడి వున్నాయి. ఎడంవేపు గోడకి రాధాకృష్ణుల పటం ఒకటి నలుగురు కూర్చుని తీసుకున్న ఫోటో ఒకటీ దిగులుగా వేళ్లాడుతున్నాయి. నాపరాయి పరిచిన నేలమీద ఎన్నడో వేసిన ముగ్గులకి గుర్తుగా గీతలు కనపడుతున్నాయి. కుడివేపుగోడకి ఓ కుక్కిమంచం ఆనించివుంది.

వరదరాజు జోరుగా లోపలికి వచ్చి "ఏయ్, వసంతం!— అప్పుడే నిద్రా! ఇంకా ఊర పొద్దు కూకలేదు" అంటూ కేక వేశాడు.

లోపలి గదిలో బుడ్డిదీపంవెలుగులో కూర్చునివున్న యువతి చప్పున లేచివచ్చింది. లాంతరు కిందనీడలో నిల్చుని అతిన్ని ఎగాదిగా రెండునిముషాలు చూసింది. "మళ్లీ తాగొచ్చావంట్రా సచ్చినోడా!" అంది చాలా మామూలుగా.

"నోరు మరీ ఎక్కువౌతాంది నీకు! వీపు భద్రం! కూడేమేనా వండావా?"

"దొరగారు దేశంమీద బలాదూరు తిరిగి వేళకి వస్తాడని వంట వార్చినా—తయారుగా" అంది యువతి ఈసడింపుగా, నొసలు చిట్లించి, నోరు బిగదీసి. ఆమెకి పాతికేళ్లుంటాయి. ఎర్రగా, బక్కపల్చగా పొడుగ్గా వుంటుంది. మొహం అందంగా వున్నా, కళగా లేదు. కళ్లు కాంతిగా మెరుస్తూ చిలిపిగా వున్నాయి.

"నోరుముయ్యి! ఆకలయి నేను చస్తావుంటే.. పద—" అంటూ వరదరాజు ఆమెను స్వతంత్రంగా భుజం పట్టుకుని లోపలికి నెట్టుకువెళ్లాడు.

"ఓరి సచ్చినోడా, నెట్టకరా అట్టా. బుజం పడిపోతంది." అంటూ యువతి చరచర లోపలికి వెళ్లింది. అది వాళ్లి ఇద్దరికీ మామూలే.

వసంతం కంచంపెట్టి గ్లాసుతో నీళ్లుపెట్టి, అన్నం వడ్డించి, ఎదురుగా కూచుంది. ఈ గదిలో బుడ్డి దీపపుకాంతి మరీ మందంగా వుంది. గోడలు నల్లగా పొగచూరి వున్నాయి. ఒకవేపు పొయ్యి దగ్గిర చట్లూ కుండలూ వున్నాయి. ఇతరత్రా ఇత్తడిసామాను బహు కొద్ది. ఇంకోమూల ఒక ట్రంకున్నది.

వరదరాజు భోంచేస్తూ, "నాలుగురోజులబట్టి తిరుగుతావుంటే ఈయేల దొరికింది డబ్బు. ఇంకోవారంవరకు దిగుల్లేదు" అన్నాడు ఎడంచేత్తో, జేబు తడుముకుంటూ. వసంతంకళ్లు ప్రకాశించినై. "ఎంతదొరికింది, చెప్పు! నాకేటి తెచ్చినావు?"

"అరవైరూపాయల చిల్లర. రేపు బజారుపోయి నీకేంకావాలో తెచ్చుకో. నే నిప్పుడేంతెస్తాను నీమొహం! సరాసరి, అంజయ్యకాడికి పోయి ఓ గ్లాసు 'మందు' వేసుకుని వచ్చేసినా"

"ఆ అంజయ్య సచ్చినోడికి రోగం ఏందంటా? దొంగతనంగా సారాకాసి జనాన్ని సంపుతున్నాడు! మొన్న ఈ సారాతాగి, రోశయ్య గుండె ఆగిపోయి డామ్మని సచ్చాడు. నీకేం పొయ్యేగాలం వొచ్చిందిరా! ఎప్పుడో..." ఆమె ఆవాక్యం పూర్తికాకముందే వరదరాజు పకపక నవ్వాడు. "నీమొహంకాదు! నేనెందుకు సస్తానే! గ్లాసుకి రూపాయి...నిక్కచ్చిసరుకు తెలుసా,? మరేం ఫర్వాలేదులే." అన్నాడు, పప్పుచారు అన్నం తింటూ.

"డబ్బులిటతే. ఈ పాడుసోదిలో నీకోమాట చెప్పడం మరిచిపోయినా; నాచెల్లెలు రత్తమ్మ వస్తుండాది." అంది వసంతం మెల్లగా.

"యాంది? రత్తమ్మ! ఏం? రానీ! వొస్తే" అంటూ పరధ్యానంగా అన్నం తినసాగాడు వరదరాజు.

కాని మరునిమిషమే త్రుళ్లిపడి, "ఆ ఎవరూ? రత్తమ్మ! నీ మారుటి చెల్లెలా?" అన్నాడు ఆసక్తిగా.

అతనిలో ఆసక్తి పెరగటం చూసి, వసంతం అన్నది. "అవును అదే. చిన్నప్పుడు గుంటూరు పోయింది; మళ్లీ రానేలేదు. ఈయాల వస్తానని ఉత్తరం రాసింది"

"నీకు మళ్లేనే ఉంటదా అదికూడా?"

"ఆ, నాకు మళ్లేనే ఉంటది."

"రానీ—లే." అంటూ భోజనం ముగించి లేచాడు వరదరాజు.

"మళ్ళీ ఎక్కడికన్నా వెళ్తావా యేం?"

"వెళ్లొద్దూ? రంగయ్యగారి ఆఫీసుల్లో, భలే నంబర్లు చెబుతానన్నాడు" అంటూ వరదరాజు అప్పుడే గడప దాటాడు.

"నీకు ఆ నంబర్లే వొద్దన్నా..." అంటూనే వుంది వసంతం, వరదరాజు పకపకనవ్వుతూ, "నీ మొహం" అంటూ వెళ్ళిపోయాడు.

వసంతం మెటికలు విరుచుకుంటూ, తలుపు దఖేలున వేసుకుని లోపలికి వెళ్లిపోయింది.



అపస్వరాలు

2

వరదరాజు నిదానంగా చార్‌మినార్ సిగరెట్టు వెలిగించి పొగ పీలుస్తూ, నాలుగు ఫర్లాంగులు నడిచి, స్టేషన్ దగ్గరకి వొచ్చాడు. బెజవాడ స్టేషను కుడివేపు కొండదిగువన ఓ పెద్ద హోటలుంది. దానికి పక్కనే వరసగా, బీడీకొట్లున్నాయి. చివర కొట్టు కొంచెం పెడగావుంది. అసలా సెంటర్లో, తెల్లవార్లూ మనుషులు తిరుగుతూనే వుంటారు. రకరకాల మనుషులు, భిన్నప్రవృత్తులు గల వ్యక్తులు, వివిధవేషాలవాళ్ళూ బహుళంగా కనపడతారక్కడ. పగటిపూట వుండేంత రద్దీలేకపోయినా, ఆ తొందర పోయి, అలలు తగ్గిన సముద్రంలాగా, తెరదతీసిన కృష్ణలా మనుషులు నిదానంగా తిరుగుతూ, అక్కడక్కడ గుంపులు గుంపులుగా నిలవదేలుతూ వున్నారు. స్టేషన్ లైట్లకాంతిని జయించే కొండకింది దట్టమైన చీకట్లూ, కొండకెదురుగా, రైల్వే కాంపౌండ్ గోడకానుకుని వున్న గుర్రబ్బండ్ల షెడ్డులోనూ, ప్రక్కగా అనాసలు వెలిగించిన మూడురాళ్ళ పొయ్యిలలోని మంటలదారుణమైన వెలుగు. చీకట్లూ, బలంలేని గుర్రాల సకిలింపులూ, అక్కడ మనుషుల మోట సరసాలూ, కొట్లాటలతో అక్కడ వాతావరణం అమానుషంగా ఉంటుంది. మధ్య మధ్య స్టేషన్లోంచి, మందరస్థాయిలో ఏదో ఇంజన్ కూస్తూవుంటుంది. సైకిల్ రిక్షాల పోటీతో భుక్తిచెడ్డ గుర్రబ్బండ్లవాళ్ళు, రిక్షావాళ్ళని దబాయిస్తూ, పోట్లాడ్డం, జనం అక్కడ పోగులుపడ్డం, తరుచు కనపడే దృశ్యం.

దీపాలకిందగా, వెలుగు వలయాలగుండా రోడ్డు నడిచివచ్చిన వరదరాజు, చివరి బీడీకొట్టుముందుకొచ్చి నిలబడ్డాడు. బీడీకొట్టు ముందు ఏడెనిమిది మంది వున్నారు. అందరూ జీవితంలో దగాపడి నలిగినవాళ్ళే. బీడికొట్టులో గ్యాస్‌లైటు ఒకటి ఉసూరుమంటూ వెలుగుతోంది; జుమ్మని రొదపెడుతోంది. కొట్టుమీద కూర్చుని వున్న అతను బుట్టక్రాపు పెట్టాడు; బలబనియన్ తొడిగాడు. అతనుమాత్రం వాడిపోయిన వంకాయల్లే సన్నగా ఉన్నాడు. అతని మొహానికి వన్నె తెచ్చేదల్లా అతని తెల్లని పళ్ళవరసమాత్రమే. ఓ చిన్న బిల్లుపుస్తకంమీద ఏదో రాసుకుంటున్నాడు.

కింద నిలబడ్డవాళ్ళల్లో గళ్ళలుంగీ, ఆకుపచ్చని అరచొక్కా తొడిగిన ఒకడు "సుబ్బయ్యా! డబుల్‌త్రీ (రెండుమూళ్ళు) జేసరాయి?" అన్నాడు ఉత్సాహంగా.

అతనిపక్కనే నుల్చున్న ఇంకో అరలాగూ, బనీను తొడిగిన వ్యక్తి. "ఏందిరోవ్, ఇవ్వేళ మాలిష్‌లో ఏపాటి సంపాయించావు" అని ప్రశ్నించాడు.

"రూపాయిన్నర" అన్నాడు గర్వంగా. అతను స్టేషన్లోనూ, బైటా మనుషులకి తల 'మాలిస్'చేస్తూ జీవిస్తున్నాడు. అతను పక్కకి తిరిగి, "సత్తెం! నిన్న అయిదూ మూడూ (ఫైవ్‌త్రీ) రాశానా! తన్నేసింది; ఇవ్వాళ నువ్వేం రాయించావ్?" అని అడిగాడు.

వరదరాజు, ఈ సంభాషణలు వింటూ ఎవరికోసమో ఎదురుచూస్తూ స్టేషన్‌వేపు చూస్తున్నాడు.

సత్తెం ఏంపనిచేసి ఎట్లా సంపాయిస్తాడో ఎవరికీ తెలీదు. చూడ్డానికి కూలిమోస్తాడేమో అనిపిస్తోంది. అతను మెల్లిగా, "నేను, ఎనిమిదీమూడు (ఎయిట్ - త్రీ) రాశా - పావలా. తప్పకుండా దిగుతుంది చూస్కో" అన్నాడు ఉత్సాహంగా.

"నీమొహం! నువ్వు బొమ్మచూశావా? "అంటూ జేబులోంచి, ఏదో ఇంగ్లీషు దినపత్రికనుంచి కత్తిరించిన బొమ్మముక్క తీసి చూపించాడు. సత్తెం, "నేను పొద్దున్నే చూశా. నేను రాసిందే వస్తదట. రంగయ్యగారు చెప్పాడుగా" అన్నాడు.

చుట్టూ అందరూ ఇదేవిధమైన తర్కంలోపడి వున్నారు. చుట్టూ ఏం జరుగుతోందోగూడా గమనించకండా, బ్రాకెట్ అంకెల వ్యసనంలో చిక్కుకుని వున్నారు. వాళ్ళ మనోనేత్రాలలో సున్నా మొదలు తొమ్మిదివరకూ గల అంకెల సముదాయమే, విడివిడిగా జంటలుజంటలుగా, కనపడుతున్నాయి; ఆడుతున్నాయి; మెరుస్తున్నాయి, చెరిగిపోతున్నాయి.

బీడీకొట్టు సుబ్బయ్య బ్రాకెట్లు తెగ బుక్‌చేసుకుంటున్నాడు. చిల్లరతెగ పోగవుతోంది. క్రమంగా, ప్రతివాడు, నాలుగేసి, ఆరేసి బ్రాకెట్లు రాయిస్తున్నాడు.

అందులో ఒకడికీ మనస్సు స్థిమితంలేదు. దగ్గరవున్న చిట్టచివరి అణాకూడా ఒకటీ ఎనిమిది (వన్ - ఎయిట్) మీద కట్టేసిన గుర్రబ్బండి రామదాసు, టీ కొట్టుముందు బండిదగ్గిర నిలబడి, వోపెనింగ్ కోసం ఎదురుచూస్తున్నాడు.

సైకిల్‌రిక్షా తోలే వెంకడు, తన మొదటిబాడిగ మూడణాలలో చెరొ ఒక అంకెమీద, ఓపెనింగ్ కట్టేసి, మిగిలిన అణాకి టీ తాగి, ఇంకో బాడిగకోసం చూస్తూ నుల్చున్నాడు.

ఏ అంకెలొస్తాయో ఎవడికీ తెలీదు; తానుకట్టిన అంకే వస్తుందని ప్రతివాడికీ నమ్మకం; అన్ని ఇతర వ్యవహారాల్లోలాగే, ఇక్కడా మెజారిటీ ఒకటి ఉంది! గుంపులో గోవిందా అన్నట్టు కొంచెం నీటుగావున్నవాడు ఏ అంకెలమీదేనా, పదిరూపాయలు

కట్టే, మిగతావాళ్లూ ఎగబడి దానిమీదే బేడలూ పావలాలు సమర్పించుకుంటున్నారు. ఆ అంకెలు రెండు మెజారిటీ సంపాదించుకుంటున్నాయి.

ఎవరికివాడే గట్టినమ్మకంతో, పేకమేడలో నివసిస్తున్నాడు.

లైట్లు వెలుగుతున్నాయి. జనం, కొట్లముందునుంచి నిష్క్రమిస్తున్నారు. జనసమ్మర్దం తగ్గుతోంది. అన్నిచోట్లా తగ్గినా సుబ్బయ్య కొట్టుముందు మాత్రం జనం తగ్గటంలేదు. రాత్రి పదకొండు కావస్తోంది. అంకెలు జోరుగా వినిపిస్తున్నాయి.

వరదరాజు పెట్టె సిగరెట్లు తగలేశాడు. ఇంకా రంగయ్యగారు రాలేదు...రాడేమో! వరదరాజు అకస్మాత్తుగా స్టేషన్‌వేపు చూశాడు. రంగయ్యగారే. వస్తున్నాడు. భలే బ్రాకెట్ చెబుతాడు! చార్టు అంతా ఆయనకి కంఠోపాఠం.

రంగయ్యగారు బెజవాడలో ఒక స్కూల్లో తెలుగు పండితుడు. ఆయనకున్న ఒక్క దుర్గుణం—ఇదే; ఈ అభ్యాసం మూలంగా ఆయన, ఈ కొట్టుదగ్గిరకి రావటమూ, ఆయన అంతస్థుకి ఎక్కడా పోలికలేని మనుషుల సహవాసం ఏర్పడ్డమూ జరిగాయి. కాని, ఈ పరిచయం ఇక్కడే. ఇతరత్రా ఏ సంబంధమూ లేదు. రంగయ్యగారి నొసట నామాలు ప్రకాశమానంగా కనిపిస్తున్నాయి. నిగనిగలాడే బట్టతల; తెల్లని మల్లుపంచె; లాల్చీ; లాల్చీపైన వెయిస్టు కోటు; కాళ్లకి చెప్పులూ, కళ్లకి జోడూ; వయస్సు ఏభై పైన.

రంగయ్యగారు, బీడీకొట్టు సమీపించగానే, అక్కడ అందరూ కొంచెం పక్కకి వొదిగి ఆయనకి దారి ఇచ్చారు. ఆయన పక్కగా వరదరాజుకూడా వచ్చి కొట్టుకు ఆనుకుని నిల్చున్నాడు.

రంగయ్యగారు ఏ అంకెలమీద డబ్బుకట్టే, ఆ అంకెలమీదే కడ్దామని మిగతావాళ్లు సిద్ధంగా డబ్బులు తీసుకుని నిలబడ్డారు.

రంగయ్యగారు, వరదరాజువేపు చూసి, "ఓ—నువ్వా! నాలుగురోజుల్నుంచీ కనపడ్డంలేదేం?" అన్నాడు వాత్సల్యంతో.

"వూళ్లోలేనండి అయ్యగారు! ఇవ్వాళ మీరు.. ఏ అంకె అంటే దానిమీద ఐదురూపాయలు కట్టా." నమ్రత ఉట్టిపడుతూ అన్నాడు వరదరాజు.

రంగయ్యగారు, కొంచెం ఆలోచించాడు. సుబ్బయ్య పెన్సిలూ, పుస్తకం రెడీగా వుంచుకుని ఆదుర్దాగా రంగయ్యగారి మొహంకేసి చూస్తున్నాడు.

చుట్టూ వున్నవాళ్లందరూ కూడా ఎదురుచూస్తూ నిల్చున్నారు.

రంగయ్యగారు, "రెండురూపాయలు తీసి రెండూ నాలుగూ (టూ—ఫోర్) మీద రూపాయి, రివర్సు (నాలుగూ రెండు) మీద రూపాయి" అన్నాడు. సుబ్బయ్య గబగబ రాశాడు. చీట్లు చించి, ఇచ్చాడు.

ఇంక అందరూ అవే అంకెలు రాయిస్తున్నారు. రంగయ్యగారు రాయించే అంకెలు, అప్పుడప్పుడు రావటం కద్దు. రాకపోయినా, అక్కడి అజ్ఞానులకి ఆయనమీద గొప్ప గురి. ఆయన సంస్కృతపండితుడు. తెలుగు ఎం. ఏ. ఆయనకి ఈపాటి బ్రాకెట్ అంకెలు తెలీవా, అని వాళ్ల నమ్మకం. ఆ గుంపులో చదువొచ్చినవాళ్ళు లేరు. అంకెలు గుర్తుపట్టే వాళ్ళే తక్కువ.

రంగయ్యగారు, నాలుగు అడుగులు ముందుకు వేశారు స్టేషన్ వేపుగా. తొమ్మిదిగంటలు కావస్తోంది. చీకట్లు దట్టంగా అలుముకుని వున్నాయి. ఆకాశం, నక్షత్రాలు పరిచిన రత్నకంబళంలా వుంది. రంగయ్యగారు, ఎందుకో ఒకనిమిషం, ఆగి వెనక్కి చూశాడు వరదరాజు వేపు. వరదరాజు ఆయన చూపు గుర్తించినట్టు చిరునవ్వునవ్వాడు. "రా" అన్నట్టు రంగయ్యగారు సౌజ్ఞచేశాడు.

వరదరాజు గబగబ నడిచి రంగయ్యగార్ని కలుసుకున్నాడు. రంగయ్యగారు, తల వొంచుకుని నడుస్తూ, "నాతో గాంధీనగరం దాకా రాగలవా? నీతో ఒక్కమాట మాట్లాడాలి" అన్నాడు.

"ఎందుకు రానండీ! పదండి..." అంటూ వరదరాజు వినయంగా ఆయనవెంట నడవసాగాడు. ఆయన గొప్ప పండితుడట!...ఎంత గొప్పవాడో...ఆయన తనని రమ్మంటున్నాడు .. ఎంత గౌరవం...అనుకుంటున్నాడు అతను. ఆయనకి తనతోటి మాట్లాడాల్సిన పని రావటమా!...

ఇద్దరూ స్టేషన్ ఓవర్‌బ్రిడ్జి దాటి ఎలక్ట్రిక్ దీపాల కాంతిధారల ప్రక్క చెట్లనీడల చిక్కని చీకట్లలో నడుస్తున్నారు. రోడ్లమీద జనం పల్చపల్చగా వున్నారు.

"నీ పేరేమిటి నాయనా. మర్చిపోయానూ" అని అడిగాడు రంగయ్యగారు.

"నా పేరు వరదరాజు అంటారండి"

"మనకు ఆట్టే పరిచయంలేదనుకో ... ఐనా ఒక్కమాట అడుగుతాను...ఏమనుకోవుగదా" అన్నాడు రంగయ్యగారు కొంచెం స్థాయితగ్గించి.

"ఏబ్బే ... ఏమనుకుంటానండి ... చెప్పండి ఫరవాలేదు." సంశయం పోగొట్టేట్టుంది వరదరాజుమాట మన్నన.

"మరేంలేదు...ఒక్క ఐదురూపాయలుంటే ఇవ్వు...ఫస్టు తారీఖురాగానే ఇచ్చేస్తాను...నమ్మకంవుంటేనే చూడు."

వరదరాజు క్షణంసేపు నిర్ఘాంతపోయి మరుక్షణం తెప్పరిల్లుకున్నాడు. "మిమ్మల్ని నమ్మకపోవటం ఏమిటండి.. తీసుకోండి..." వెంటనే అతను జేబులోనించి ఐదురూపాయిలకాయితంతీసి ఆయన చేతికిచ్చాడు.

రంగయ్యగారిమొహం క్షణకాలం వికసించింది. "మంచి సమయంలో ఆదుకున్నావు నాయనా. ఇందుకే పెద్దలన్నారు: లేనివాడికి త్యాగబుద్ధి ఎక్కువని. ఫస్టుతారీకునాటికి ఇచ్చేస్తాను." అన్నారు ఆగి.

వరదరాజు చాలా నమ్రంగా, "ఇంకో నెలకిచ్చినా ఫర్వాలేదులెండి..."అన్నాడు.

రంగయ్యగారు, "నాయనా- చాలా పొద్దుపోయింది... నేను వెళ్లొస్తా ... ఒక్కమాట ... ఈ కంపెనీవాడు పేమెంటు సరిగ్గా ఇస్తాడా - నమ్మకమేనా? నీకు తెలుసా?" అని ప్రశ్నించాడు.

వరదరాజు ఏమాత్రం ఆలోచించకుండా, "ఆ భయం అక్కర లేదులెండి ... ఇవ్వకండాపోడానికి వాడికి ఎన్ని గుండెలండీ? ఇవ్వకపోతే- వాడ్ని బొమికలు గుండ కొట్టెయ్యమండి!"అన్నాడు. అతను రంగయ్యగారితో మాట్లాడుతున్నంతసేపూ, సహజమైన తనయాస రాకుండా జాగ్రత్తపడుతున్నాడు కొంత శ్రమతో. అయినా ఉద్రేకం వొచ్చినప్పుడు ఆ యాస వొచ్చేస్తుంది.

వరదరాజు పకపక నవ్వాడు. "పంతులుగారూ...ఆ భయం మీకొద్దండి.. పొద్దుపోతంది.. రిక్షా పిలవనా..." అంటూ సైకిల్ రిక్షావాణ్ణి కేకేశాడు.

రంగయ్యగారు చిరునవ్వునవ్వుతూ, "వెళ్తా నాయనా,..." అంటూ రిక్షాఎక్కి కూచుని, "గవర్నర్‌పేట, పటేల్‌రోడ్డుకి పోనియ్య..." అన్నాడు. రిక్షా గంట గణగణ మోగుతూ వెళ్ళిపోయింది.

వరదరాజు నవ్వుతూ స్టేషన్‌వేపు నడవసాగాడు. అతని చూపులు తీక్ష్ణమైనాయి. జాగ్రత్తగా చుట్టూ చూసుకుంటూ రీవిగా నడవసాగాడు.

(ఇంకా వుంది)

వనితాలోకం

మహాత్ముడు—మహిళ ★

భారతదేశమున మహిళోద్యమము పురుషులతో ప్రారంభమయినది.

భర్తమరణానంతరము జీవించే అధికారములేని స్త్రీలకు పందొమ్మిదవ శతాబ్దములో ఆయుర్దాయము నొసగిన అపరబ్రహ్మ రాజా రామమోహనరాయలు.

నిర్బంధ వైధవ్యముతో అక్షరజ్ఞానము లేకుండా, అత్తింట పుట్టింట వెట్టిచాకిరీ చేసి బానిస బ్రతుకు బ్రతుకుతూ, ఒంటిపూట భోజనానికే నోచుకొన్న స్త్రీల నొసట కుంకుమరేఖలు తీర్చి సౌభాగ్య మొసగిన పరమేశ్వరుడు రావుబహాదూరు కందుకూరి వీరేశలింగముపంతులు. ఈ శతాబ్దారంభములో ఈయనచేత స్త్రీవిద్య పునరుద్ధరింపబడ్డది. శ్రీమంతుల బాలికలకు వివాహాలు జరుగుతూ వచ్చాయి. ప్రజల హృదయాలలో సంస్కార బీజాలు నాటబడి మొలకలెత్తాయి.

'స్త్రీ పడకటింటి వంటయింటి ఉపయోగాలకేనా సృజింపబడినది? ఆమెకు సంసారాన్ని, సంఘాన్ని, దేశాన్ని, లోకాన్ని పరిపాలించగల శక్తిసామర్థ్యాలు ఉన్నాయి.' అని గుర్తించి స్త్రీచేతికి రాజకీయధ్వజమిచ్చిన మహావిష్ణువు మోహనదాసు కరంచందు గాంధీ.

ఈనాడు శ్రీమతి విజయలక్ష్మి పండిట్ ఇండియా హైకమిషనరుగాను శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ ప్లానింగు కమీషను సభ్యురాలుగానూ నియమింపబడటము ఈ త్రిమూర్తుల కృషి ఫలితమేనని వేరే చెప్ప నక్కరలేదు.

1920 వ సంవత్సరములో సహాయ నిరాకరణోద్యమముతో ప్రారంభమైంది మహిళోద్యమములో మహాత్ముని యుగము.

స్త్రీలసహాకారము లేనిదే స్వాతంత్ర్య సమరము విజయవంతము కాదని ఆయనకు

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

ఇల్లిందల సరస్వతీదేవి

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

దృఢనమ్మకము కలిగింది. సీతమ్మ తల్లితో మొరపెట్టుకోనిదే రామదాసు మొరను రామయ్య తండ్రి ఆలకించలేదుగా! మరను కదలించాలంటే దాని కిటుకులను చక్కగా తెలిసికొని ఉండాలి. మహాత్ముడు కోమటిబిడ్డకదూ - ఉపాయాలపుట్ట! విదేశ వస్తువ్యామోహమువల్ల దేశదారిద్ర్యము మితిమీరిపోయినది వస్త్రములకొరకే కాకుండా, సూదులదారాలు, పన్నులు, దువ్వెనలు, తలనూనెలు, మందులు, కళ్ళజోళ్లు, కలాలు మొదలైనవన్నీ విదేశవస్తువులే - వీటికొరకు ఎంతధనము వెచ్చింపబడేదో - కోటానుకోట్లు! దీనిని అరికట్టటానికి స్త్రీలను కదిపితే చాలని ఆయనకు తోచింది.

అదేమొదలు స్త్రీల విదేశ వస్తుబహిష్కరణకు. విదేశవస్తుబహిష్కరణేకాదు - స్త్రీలు విదేశవస్తువిక్రయశాలలముందర పికెటింగుచేశారు; ఖద్దరు వస్త్రాలను ఇంటింటికీ తీసుకొని వెళ్ళారు; అమ్మకము చేశారు. విదేశీవస్త్రాలను ఇంటింటా పోగుచేశారు; నడివీధిలో కుప్పచేసి అగ్నిహోత్రునికి ఆహుతిచేశారు.

మహాత్ముని ఆదేశానుసారముగా ఇంటింటా స్త్రీలు రాట్నాలను తిప్పారు; దారము తీశారు; స్వయముగాతీసిన దారముతోనే వస్త్రాలను నేయించుకొన్నారు; ఆ ముతకచీరలనే కాశ్మీరుసిల్కు చీరలవలె వాడుకొన్నారు. చరఖా సంఘాలను అనేకంగా స్థాపించి నడిపించారు.

మద్యపానము నిషేధింపబడాలంటే అక్కడా స్త్రీలనే ప్రయోగించాడు మహాత్ముడు. ప్రతిపానశాలముందర ఒక స్త్రీ! తలనిండా పూలు - నొసట పెద్ద కుంకుమబొట్టు - ముతకచీరెతో ప్రత్యక్షమయేది! 'నాయనలారా! మద్యము మంచిదికాదు. వినాశకారి. ఇళ్లకు మరలండి. ఈ డబ్బుతో మీ భార్యాబిడ్డలకు కడుపునిండా అన్నము పెట్టండి!' అంటూ వాళ్లను బ్రతిమిలాడుతూ ప్రాధేయపడుతూ దారికి అడ్డముగా నిలబడేవారు

ఉప్పుసత్యాగ్రహములోకూడా మొదటి పిలుపు స్త్రీలకే. మొదటిపిలుపుకే మారు పలికి తండోపతండాలుగా బయలుదేరి మహా





అజంతా శిల్పాలలో

శిరోభూషణాలు





చిత్రకారిణి:

వి. సుభద్రాదేవి
హైదరాబాద్.

★ మహాత్ముడు—మహిళ ★

> పరిచితులు, అపరిచితులు అందరూ ఉన్న ఒకచోట ఒకానొక రచయిత తన ప్రతాపం చాటించుకుంటున్నాడు: "నాకు బుద్ధిపుట్టాలే కాని నేను శ్రీనాథునికంటే గొప్పగా కవిత్వం చెప్పగలను"
> వెంటనే ఎవరో సమర్థించారు వెనకనుంచి: "మీరు అటువంటి కవిత్వం చెప్పటానికి 'బుద్ధి' ఒక్కటే తక్కువైంది."

త్ముని అడుగుజాడలలో నడిచారు స్త్రీలు; నిర్భయముగా చెరసాలకు వెళ్లారు.

అంగాంగసౌష్ఠవము దేహానికి ఎంత ముఖ్యమో, జాతికి దేశానికీ సంఘబలమంత ముఖ్యము. అగ్రజాతులనీ, నిమ్నజాతులనీ సంఘము రెండుగా చీలి, ఒకరినొకరు తాకనుండ, ఒకరినొకరు కనబడకుండ జాతికీ జాతికీ మధ్య నిలిచెడు గోడలను నిర్మించుకొంటే సంఘబలము ఎట్లా సిద్ధిస్తుంది? దీనికి శాస్త్రప్రమాణాలు, అనుశ్రుతములైన ఆచారాలు, అనేకముగా సహకరిస్తూ ఉండేవి. వీటన్నిటికీ స్త్రీజనము ఆటపట్టు. స్త్రీలను చుట్టూ చేర్చుకొని తోటిమానవులపట్ల ఏవిధముగా ప్రవర్తించాలో బోధించుతూ ఉండేవాడు. అస్పృశ్యతనుగురించిన సంస్కారబీజాలు చిన్ననాడే ఆయన హృదయములో నాటుకొన్నాయి. నౌకరును తాకగానే స్నానము చేయమనో, వస్త్రములను మార్చుకొమ్మనో తల్లి నిర్బంధముచేస్తూ ఉండేది పసుపు నీళ్లతో కుమారుని శుద్ధిచేస్తూ ఉండేది. అంటరానివారని ఎవరయినా అంటే ఆయన హృదయము తరుక్కుపోయేది. ఆ కులము వారికి హరిజనులని పేరుపెట్టి ఆ పేరులోని శిష్టతను స్త్రీలకుబోధించుతూఉండేవాడు.

విద్య లేకపోయినందువల్ల స్త్రీల సామర్థ్యము మరుగుపడిలేదని మహాత్ముడు తన అనుభవమువల్ల తెలిసికొన్నాడు. స్త్రీల శక్తిసామర్థ్యాలను ఏవిధముగా దేశానికీ ప్రపంచానికీ ఉపయోగపడునట్లు చేయవలెనా అని నిరంతరమూ ఆలోచించుతూ ఉండేవాడు. ఒక్కొక్కసారి ఆయనదృష్టి సమాజములో స్త్రీకి గల స్థానముపైకి పోయేది. వెంటనే ఒక వ్యాసము సిద్ధమయ్యేది. ఆ మరునాడు హరిజన్‌పత్రికలో పాఠకులకు ఆ వ్యాసము ప్రత్యక్షమయ్యేది.

'స్త్రీ అబల అనుభావము నామటుకు నాకు లేదు. స్త్రీ పురుషవర్గాలలో స్త్రీవర్గమే హెచ్చు మాననీయమైనది. స్వార్థత్యాగానికి, వినమ్రతకు, విశ్వాసానికి, విజ్ఞానానికి, ఓర్పుకు, పతనావస్థయందున్న ఈనాటి స్త్రీలుకూడా పురుషులకంటే మిన్నగా ఉన్నారు. పురుషుని ఘనతర జ్ఞానరాశికంటె స్త్రీయొక్క సహజాంతఃప్రబోధము తరచుగా సత్యమై ఒప్పుతుంది. దౌర్జన్యరాహిత్యము జీవనధర్మమయిన పక్షమున స్త్రీలదే భవిష్యద్యుగమని చెప్పవలసి వస్తుంది.'

దీనినిగురించి ఆయనకు పురుషులదగ్గర నుండి లేఖలు అసంఖ్యాకముగా వచ్చేవి. వాటన్నిటిని మరొకసంచికలో ఓపికతో ఖండించుతూ ఉండేవాడు.

బాల్యవివాహాలు దేశానికి సంఘానికి నిస్సత్తువను కలిగిస్తాయి. ఈ విషయము మహాత్మునికి అనుభవైకవేద్యము. తన వివాహమైనప్పటినుండీ వాటిని అరికట్టవలెనని ఆలోచనా, వరకట్నాలమీదవిహ్యాభావమూ ఆయనకు కలిగినవి.

'బాలికలు చౌకగా తమను అధిక మొత్తమునకు అమ్ముకోకూడదు. తమకు తగిన వరులు లభించినప్పుడే వివాహము చేసుకోవాలి. రూపతృష్ణ ధనతృష్ణలకు మోసపోవద్దు. ప్రతి భారతకన్య ఎవనినో ఒకనిని వివాహమాడటానికే జన్మించలేదు. ఒక పురుషునికి, ఒక కుటుంబానికీ మారుగా ప్రజాసేవకు ఆత్మార్పణము కావించుకొనుట అత్యుత్తమమైన త్యాగము' అని బాలికలను, వారి తల్లులను దగ్గర కూర్చుండబెట్టుకొని ప్రబోధము చేసేవాడు.

నిర్బంధవైధవ్యము శాపమువంటిది దేశానికి కళంకము నాపాదించేది. బ్రహ్మచర్యమొక కఠినదీక్ష. బ్రహ్మచర్యము పూనలేని వారిని నిర్బంధించినందువల్ల వ్యభిచారానికి అవకాశమిచ్చినట్లవుతుంది. అటువంటి వారికి వివాహాలుచేయటము మంచిదని మహాత్ముని విశ్వాసము.

'ఆధ్యాత్మికసంయోగమే వివాహము. అదే వివాహముయొక్క పరమాదర్శము. దానివలన ఉద్భవించే ప్రేమ దైవికమూ విశ్వవ్యాప్తమూ అయిన ప్రేమకు మూలాధారముగా ఉండాలి. అహంకారమమకారరహితమయిన పవిత్ర సేవాధర్మమును నెలకొల్పటానికి వివాహమొకసాధన. భర్త మృతిచెందినపక్షములో అతడిమీది ప్రేమను సేవాభావమును సంఘముపట్ల దేశముపట్ల చూపగల స్త్రీ ధన్యురాలు.

> మోటారుకారు గతుకుల్లో వెళుతున్నది. యజమాని ప్రశ్నించాడు.
> "ఎందుకు కారు అలా ఎగురుతుంది?
> డ్రైవర్: గుంటలు - మిట్టలు వస్తున్నై సార్!
> యజమాని: హారన్ మోగించు.
> —జి. కె. మూర్తి, గద్వాల.

"భార్య అనగా భర్తయొక్క బానిస కాదు ఆమె అతడి సహధర్మచారిణి, సహవాసిని; పతి దేవుడయితే స్త్రీ దేవి; వారిద్దరు ఒకరిపైనొకరు అధికారులు; జీవిత కర్మలను ధర్మాలను పరస్పరసహకారముతో నిర్వహించుకొనవలసినవారు; ఇద్దరూ ఒక ఆత్మతో మెలగవలసినవారు' అని బహిరంగసభలలోను, స్త్రీల సమావేశాలలోను, పత్రికలలోను చాటుతూ ఉండేవారు.

స్త్రీలలో కొన్ని జాతులవారికి ఘోషాపద్ధతి ఉండేది. వారికి కొన్ని విషయాలలో స్వేచ్ఛ అరికట్టబడినది 'మహాత్ముడు స్త్రీజనోద్ధారకుడుకదా! మనకే సందేశమిస్తాడో' అని ఆ స్త్రీగణము మహాత్మునితో ఉత్తరప్రత్యుత్తరాలను నడుపుతూ ఉండేవారు. దాని కాయన "స్త్రీలను గృహాలలో బంధించటము కూడనిపని పురుషులనుభవించు స్వాతంత్ర్యము స్త్రీలెందుకు అనుభవించకూడదు? స్త్రీలు బహిరంగముగా నడచిపోయి స్వేచ్ఛావాయువును పీల్చతగరా? పురుషుల కనుమానములకే తాళజాలని స్త్రీలపాతివ్రత్యము అదెంతటిది? తనకు విశ్వాసములేని స్త్రీని తన సంతానానికి మాతగా స్వీకరించటము పురుషునికి అవమానకరము కాదా? స్త్రీ అంతటి అవిశ్వసనీయయా? నమ్మకము, గౌరవము, మర్యాద ఇచ్చి పుచ్చుకొనవలసినవి గాని బలాత్కారముగా గాని నిర్బంధమువలన గాని స్వీకరించటము ఘనకార్యమా? స్త్రీలను ఆ దృష్టితో నిర్బంధించిన పురుషులు నాదృష్టిలో క్షమార్హులు కారు" అని తన సమాధానముతో పాటు తనకువచ్చిన జాబులనుకూడా ప్రకటించేవాడు.

సద్గుణాలూ సంస్కృతీ స్త్రీ పురుషులిద్దరికీ అవసరమే. సత్యమూ అహింసా ఇద్దరికీ కావలసినవే. ఈ ధర్మసూత్రము ననుసరించి స్త్రీ నిర్వివాదముగా నాయకత్వము వహించి మానవాభ్యుదయముకొరకు పాటుబడి తన కర్హమైన అగ్రస్థానము నలంకరింపగలదని ఆయన దృఢనమ్మకము. అప్పుడుగాని తన కాపాదింపబడిన హైన్యతను ఆమె బాపుకొనజాలదని ఆయన విశ్వాసము.

'స్త్రీ అనగా అహింసామూర్తి' అను మాటలు ఆయన నోటివెంట ఎన్నిలక్షల పర్యాయములు వెలువడినవో! "అహింస అనగా అనంతమైన ప్రేమ. అనంతప్రేమ అనగా బాధ నోర్చుకొనుటలో అంతులేని శక్తి; బిడ్డయొక్క దినదినాభివృద్ధికి కష్టపడేది స్త్రీయేగదా! అటువంటి ప్రేమనే ఆమె సర్వమానవకోటియందును చూపవలెనని నాకోరిక. స్త్రీమాతయై, స్వజనకర్త్రియై, నిరాడంబరమార్గదర్శినియై, పురుషుని చెంత నిలచి సగౌరవముగా తన కర్హమైన స్థానము నధిష్ఠింపగలదు. రణజ్వాలలలో చిక్కుకొనిపోయి దరీదాపూ కానని లోకానికి శాంతిసుధ నందించగల అమృతస్వరూపిణి స్త్రీ. నా సత్యాగ్రహసమరానికి స్త్రీయే నాయకురాలు" అని శంఖము నూదిన హృషీకేశుడు మోహనదాసు కరంచందు గాంధీ ఈ ప్రబోధానికి స్త్రీలు ఉత్తేజితులై ఆయనకు నీరాజనములిచ్చి ఆయన అడుగుజాడలలో సమరానికి బయులుదేరారు భర్తల అనుజ్ఞ తీసుకొని, పిల్లలను మరొకరి అధీనముచేసి, సంసారాలకు సెలవుపెట్టి ధరిత్రి దద్దరిల్లేటట్లుగా స్వాతంత్ర్యసమరానికి స్త్రీలు సాగిపోయారు. చెరసాలలలో ఉదయించిన పసిపాపలు ఎందరో కృష్ణనామధారులైనారు.

స్త్రీలు ఒంటరిగా తిరగటము క్షేమకరమా కాదా అని కొందరాయనను ప్రశ్నించారు. "స్త్రీలనుగురించిన పచ్చి శృంగారవర్ణనలు మాకు అవమానకరముగా ఉంటున్నాయి. మీరు ఈవిషయములో జోక్యము కలిగించుకోకూడదా?" అని కొందరు ప్రాధేయపడ్డారు

"స్త్రీసౌందర్యాన్ని పురుషుడు దుర్వినియోగము చేయటము అన్యాయమే. స్త్రీని తన వినోదప్రక్రియగా భావించి ప్రకటనలను వాఙ్మయమును విహ్యాముగా సృష్టించి ఆనందిస్తున్నాడు. స్త్రీ సహజముగా మానవతి. తన గౌరవమును శీలమును స్త్రీయే కాపాడుకోవాలి సీతా ద్రౌపదుల శీలాన్ని శ్రీరాముడూ పాండవులూ రక్షించారా? తనను ఇష్టమువచ్చినట్లు ఆడించి క్రీడించు అధికారమును స్త్రీలు పురుషులకివ్వకూడదు. స్త్రీలు ప్రతిఘటించాలి. ప్రపంచదృష్టిని మార్చగలశక్తి స్త్రీలలో ఉన్నది. దానిని స్త్రీలు గ్రహించి మసలుకోవటము ముఖ్యము –" ఈధోరణిలో ఆయన వాదన సాగిపోతూఉండేది.

తన సలహాలను కోరి వచ్చినవారిలో కొందరికి దుర్వ్యసనములపాలయిన భర్తలున్నారని మహాత్మునికి తెలియవచ్చింది. హరిజనవాడలకు పానశాలలకు వెళ్ళి మద్యపాననిషేధాన్ని ప్రబోధించమని స్త్రీలను ప్రేరేపించుతూ ఉండేవాడు. "మా ప్రబోధాలను వినేవారెవరు?" అని కొందరు నిరుత్సాహము కనబరచారు. దానికాయన "చాలామంది స్త్రీలకు భర్తలచేష్టలను గురించిన ప్రసక్తి ఉండదు. తమకు అర్హత లేదనుకుంటారు. భర్తలకు భార్యలమీద అధికారము బాధ్యత ఉన్నట్లే, స్త్రీలకూ ఉన్నాయి. ఆ విధానము తెలిసికొని ప్రవర్తించాలి. భార్యతప్ప మరొకరు పురుషుని సరిదిద్దగలరా?" అన్నాడు పకపకనవ్వుతూ. ఈమాటలకు స్త్రీజనము బిడియముకొద్దీ తలవంచుకొన్నది పురుషులు మందహాసము చేశారు.

స్త్రీలకు అలంకారములంటే ప్రీతి. మోయలేనన్ని ఆభరణాలతో అలంకరించుకొని మహాత్ముని దర్శనార్థము వెళ్లుతూ ఉండేవారు. ఆయనదృష్టి మొట్టమొదట వారు ధరించిన వస్త్రాలమీద పడేది. ఆ తరువాత నగలమీద పడేది. ఆభరణాలను చూడగానే ఆయనకు కళ్లు కుట్టేవి. వెంటనే నవ్వుతూ "స్త్రీలకు నిజమైన భూషణములు శీలము, సత్ప్రవర్తనము. లోహములు, రాళ్లు నిజమైన భూషణాలు కాజాలవు మీకవి అలంకారములు కావో వాటినన్నిటిని నాకివ్వండి. మీ సౌందర్యాన్ని ఇనుమడింపచేసే ఆభరణాలను నేను చేయించియిస్తాను. దేశసౌభాగ్యానికి వాటిని వెచ్చించి నేను సాధించిన ప్రయోజనముద్వారా మీకు దివ్యాభరణాలను చేయించుతాను. హృదయపారిశుద్ధ్యమును సాధించి ఆత్మసౌందర్యమును పెంపొందించుకోవటమే మీకు ముఖ్యమని నా భావన. మీకవే దివ్యాభరణాలు." ఈ మాటలంటూ దోసిలి పట్టేవాడు గలగలలాడుతూ ఒక్కొక్క నగ ఆ చేతులలో పడేది:

పాశ్చాత్యవ్యామోహములో పడి భారతీయులు మంచిచెడ్డలను తెలిసికోలేనిస్థితిలో ఉన్నారని ఆయన హృదయము ఆరాటపడేది. పురుషులకుచితమైనవిద్యను స్త్రీలకు గరపుతున్నారని చింతగా ఉండేది. ఆయన దృష్టిలో స్త్రీపురుషులు గౌరవానికి స్వాతంత్ర్యానికి సమానులుగాని ఒకేరీతిని మనగల జీవులు కారు. స్త్రీ పురుషు లొకరికొకరు పూర్ణతనుగూర్చు భిన్నజాతివ్యక్తులు. ఒకరు లేనిదే మరొకరి ఉనికిని భావనచేయటానికే అసంభవము. ఈ యధార్థవిషయమును గమనించి, స్త్రీవిద్యాప్రణాళిక నేర్పరచాలి. గృహవ్యవహారమంతా స్త్రీపరమే కావాలి. శిశుసంరక్షణ, శిక్షణ ఆమెకే వదలాలి. వీటికి అనువైన విద్యను ఆమెకివ్వాలి అని తన అభిప్రాయాలను వెలిబుచ్చాడు.

ఆయన ఏమాటగాని అనడమే తడవుగా దేశములోని మారుమూలలకు ప్రాకిపోయేది. హరిజన్, యంగ్ ఇండియా, నవజీవన్ పత్రికలు భగవద్గీతవలె పఠించేవారు స్త్రీలూ పురుషులు.

ఆయనకు 'స్త్రీజన పక్షపాతి' అని కొందరు పేరుపెట్టారు. "మీరు ఎప్పుడూ స్త్రీలనుగురించే ప్రసంగిస్తారు. మాకూ ఏదైనా చెప్పండ"ని కొందరు పురుషులు చనవుతీసుకొని ఒకపర్యాయము అడిగారు. జాతియొక్క భావిపౌరులను రూపొందించే లలితకళ స్త్రీలసొత్తు. అది వారి ప్రత్యేకత; విశిష్టాధికారము. ఆమె రక్షణలేనిదే జాతి వికసించదు. స్త్రీలు మీకంటె ఎందులోనూ తక్కువకాదు. నేను మీకు చెప్పేమాట లివే నని మందహాసముచేస్తూ వారిముఖాలను తేరిపారజూశాడు.

కొడుకులతో సమానముగా కుమార్తెలకు కూడ ఆస్తిపంపకము జరుగవలెననీ, తమకు సహాయము చేయవలెననీ స్త్రీలు మహాత్మునొకసారి అర్థించారు. 'స్త్రీల హక్కుల విషయములో నేను రాజీపడువాడను కాను. శాసనసంబంధములైన విభేదములన్నీ తొలగిపోవటము క్షేమకరమైనదే. ఈ కార్యాలన్నీ స్త్రీలే విశ్వాసముతో నిర్వర్తించుకోవాలి. కాని స్త్రీలు తమ కడుపు నిండినదని మిగతా సోదరీగణానికి అన్యాయము జరుగనివ్వకూడదు" అని నిర్మొగమాటముగా పలికాడు. స్త్రీలకు ఓటింగు అధికారము రావలెననీ వారికి సమాన ప్రతిపత్తి కలుగవలెననీ ఆయన అభీష్టము.

"తోకచిలుకలవలె అలంకరించుకొని పురుషునికి వెర్రి ఎత్తించే స్త్రీలనుచూస్తే నాకు ఏవగింపుగా ఉంటుంద"న్నాడు ఒకసారి. స్త్రీలు చాలామంది ఈమాటలకు అలిగి ఆయనపేర అనేక ఉత్తరాలు వ్రాశారు. స్త్రీలనట్లా అనటము సమంజసము కాదన్నారు. దురుద్దేశము లేకనే స్త్రీలు అలంకరించుకొంటారని సమర్థించారు. కాని ఆయన తన అభిప్రాయమును మార్చుకొనదలచలేదు. "ఆత్మసౌందర్యమును పెంపొందించుకోండి. బాహ్యసౌందర్యముతో పెనిమిటినయినా ఆకర్షించాలని ప్రయత్నించటము వెర్రితనము" అని మందలించాడు.

స్త్రీజనానికి ప్రబోధముకావించి, సుశిక్షితలనుచేసి వారికి దివ్యపథమును చూపిన మహాత్ముడు స్త్రీలపాలిటి దైవము. ఆ కాలానికీ ఈకాలానికే కాదు - ఏకాలానికయినా ఆయన వాక్కులు వేదవాక్కులు. సర్వకాల శిరోధార్యములు. ★


సుభద్ర
అవసరాల రామకృష్ణారావు

"ఆమె పెద్ద పెద్ద పుస్తకాలేం చదువుకోలేదు. కాలేజీ చదువు చదవలేదు. అయినా ఆమెకు అలవడని ఉత్తమ సంస్కారం లేదు. ఓటమి లేని జీవితం ఆమెది. స్వార్థ మెరుగని త్యాగం ఆమెది"

గంటసేపై తమ్ముడు తలుపు కొడుతున్నాడు. విశాల విసుక్కుంటూ తలుపు తీసింది.

'అదేమిటే చిన్నక్కా యింకా అలా ఉన్నావ్? కాలేజీకి రావా?'

'ఊహుఁ నువ్వు పో' అని విశాల తిరిగి తలుపు వేసేసుకుంటూంటే అమ్మ వచ్చింది.

'కాలేజీకి వెళ్ళకపోతే పోయావు, భోజనానికి రా - వడ్డించేశాను.'

'మళ్ళీ ఏం భోజనం?'

'బాగుంది యిందాకట్టీ భోజనమే? నెయ్యన్నంలోనే చెయ్యి కడిగేసుకున్నావ్'

'నా కాకలి లేదే' విశాల ముఖం అటు వైపు తిప్పేసుకుంది. అమ్మ బలవంతాన్ని యిటు తిప్పింది. రెండు బుగ్గలమీదా కన్నీటి చారికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. విశాల అమ్మను కౌగలించుకుని భోరని ఏడ్చేసింది. అమ్మ కూడా ఏడ్చింది.

'ఏం చేస్తాం తల్లీ, దానికి రోజులు నిండిపోయాయి. నువ్వూరుకో - నాకన్న నీ దుఃఖం ఎక్కువదా?' విశాల బలవంతంగా కన్నీళ్లు ఆపుకుంది. లేడీస్ క్లబ్ బంట్రోతు వచ్చాడు.

'రాత్రి ప్రోగ్రాంకి అందరికీ యిన్వైటేషన్లు పంపాలిట - మీ ఆజ్ఞ లేనిదే...'

'ఉండు' అంది విశాల. గబగబా లోపలికి వెళ్ళి నోట్‌బుక్‌లోంచి ఒక తెల్ల కాగితం చింపింది. దానిమీద నాలుగు ముక్కలు ఏవో గబగబా రాసింది. వాడి కిచ్చింది.

'దీన్ని సెక్రటరీగారి కియ్యి' వాడు వెళ్లిపోయాడు. అమ్మ తలుపువేసి వచ్చింది.

'అదేమిటే?'

'నా ప్రెసిడెంట్‌షిప్‌కి రాజీనామా'

అమ్మ తెల్లబోయింది. ఇలాంటి సరిస్థితుల్లో ఆవిడ కారణం అడగదల్చుకోలేదు.

'సరేగాని భోజనానికి రా'

'నేరాను'

'అయితే నేనూ తినను...'

'మానెయ్' విశాల తలుపు వేసేసింది. ఎంతగా దుఃఖపడితే ఆమె మనస్సు తేలికవుతుందో ఆమెకే అర్థంకాలేదు. 'నేను చచ్చిపోను - చచ్చిపోను - బతికేఉంటాను' అన్న మాటలు జ్ఞాపకం రాగానే ఆమె తలగడాలో తల దూర్చుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. నాన్న భోజనానికి వచ్చినట్టున్నారు. అమ్మ ఆయనతో అంటున్నట్టుంది-

'ఇదేమిటండీ యీ విశాలా? క్లబ్బులో దీన్ని ఎన్నుకున్నారని అవాళ అంతలా మురిసిపోయిందా? ఇవాళ హుసుక్కున రాజీనామా యిచ్చేసింది! ఇవాళ గుప్పెడన్నమయినా తినలేదు, కాలేజీకి వెళ్ళలేదు, బాగుందా? చూస్తే దీనికి మతిపోయినట్టుంది' 'లేదు జ్ఞానోదయమయింది' అనుకుంది విశాల. కాని ఆమె మనస్సు వికసించేసరికి అంతా మించిపోయింది. ఆమె స్నేహసు చేరుకునేసరికి రైలు వెళ్లిపోయింది!

* * *

నాలుగేళ్ల క్రిందట - సుభద్ర స్కూలు ఫైనలూ, విశాల థోర్డుఫారమూ చదువుతున్నారు. తమ్ముడు ఫస్టుఫారం చదువుతున్నాడు. రంగనాథంగారు సామాన్య సంసారి. అతనికి సనాతనాభిప్రాయాలూ లేవు, సంస్కారభావాలూ లేవు. ఆరోజు హాయిగా గడిచిపోవడమే ఆయన ఆదర్శం.

ఇక ఆయనభార్యుంది, వరలక్ష్మిగారు: ఆవిడకు మడిగా దేముళ్లకు పూజా పునస్కారాలు జరుగుతున్నంతకాలం, ఆవిడ దేవతావిగ్రహాలు తళతళ మెరుస్తున్నంతకాలం, మానవమాత్రు లేమైపోయినా ఆమెకు అక్కర్లేదు. అసలు యింట్లో ఆవిడ అభిప్రాయానికి వీసమెత్తు విలువలేదు. ఆ విలువ కావాలని ఆవిడ మనసా యాచించీ ఎరగదు.

'ఎందుకండీ యీ పిల్లల్ని యింత చదివిస్తున్నారూ?' అని ఎవరేనా అడుగుతే

'చదివించక ఏంచెయ్యమన్నారూ? ఇంట్లోది మీధర్మమా అని పదిమందివచ్చినా ఎవరంచేత్తో వండి వార్చెయ్యగలదు. మరి వీళ్లకు యింట్లో ఏంపని? అందుకనే కాస్త కష్టమయినా ఆడపిల్లలకి సహం జీతాలు కనక ఎలాగోయీడ్చుకొస్తున్నాను. ఎప్పుడు పెళ్లయితే అప్పుడు మానేస్తారు, కాస్త కట్నమయినా తగ్గుతుంది' అనేవా డాయన. అందుకనే 'మీ సుభద్రకి మొన్న హాఫియర్లీలో అంత తక్కువగా మార్కులొచ్చాయేమిటండీ, ఎవర్నేనా ప్రైవేటుమేష్టార్ని పెట్టి ప్రైవేటు చెప్పించకపోతే లేపాస్టరువ ఎలా గట్టెక్కుతుంది?' అని ఎవరైనా అడుగుతే ఆయనలో ఏవిధమయిన ఆత్రుతా కనిపించేదికాదు.

రంగనాథంగారికి మొదటినుంచీ సుభద్ర మీద అంత మంచిఅభిప్రాయంలేదు. చెల్లెలు విశాల అన్ని ప్రైజులూ తనే తెచ్చుకుంటూంటే - సుభద్ర ఒక్కొక్క తరగతి పాసవడమే బ్రహ్మాండమయిపోయేది. అమ్మ ఎప్పుడు యింట్లోకి రాకపోయినా ఆ మూడు రోజులూ బడి మానేసి సుభద్రే వండేది. శెలవుదినాలు చెల్లెలు బీచికో, సినిమాకో తండ్రితో కలిసిపోతే సుభద్ర తమ్ముడికి నోట్సు రాసిపెట్టో, అమ్మకి బట్టలుతకడంలో సాయంచేసో, నాన్నగారి కోటు గుండీలు కుట్టో, చెల్లెలికి లేసులు అల్లిపెట్టో - యిలాంటి పనుల్లో నిమగ్నురాలై ఉండిపోయేది. ఎవరికైనా యింట్లో జ్వరంవస్తే చాలు అదింక నిద్రాహారాలు మాని అక్కడే కూర్చుండిపోయేది.

సుభద్ర అనాకారి కాదుగాని అందమయిందికాదు. ఉన్నకళ్లు చిన్నవేఅయినా వాటిలో చిత్రమయిన మెరుపు ఉండేది. ఎత్తయిన బుగ్గలూ, లావుగాఉన్న పెదవులూ ఆమెకు వికృతాన్ని అంటగడుతున్నా, మెరుస్తున్న కళ్లూ, విశాలమయిన నుదురూ - వీటినిమించి వయస్సుతో వచ్చిన సొగసూ - యివి ఆమె అనాకారితనాన్ని కప్పిపుచ్చేవి. ఇంతకన్న అనేకవిధాల విశాల లక్షణ లక్షితంగా, ఆకర్షణీయంగా ఉండేది.

స్వతహా తగినంత ఆదుర్దా లేకపోయినా, యిరుగుపొరుగుల సూటీ పోటుమాటలు పడలేక ఒకనాడు మొగుడ్ని కాస్త గట్టిగానే కదిపిచూసింది వరలక్ష్మి.

'ఏమండీ, విశాలకి పదహారు వెళ్లిపోయాయి. పెద్దదాని మాట సరే, పద్దెనిమిది దాటేయి. ఈ వయసుకి నే నిద్దరుబిడ్డల తల్లినయ్యాను. ఇంట్లో పెళ్లికెదిగిన పిల్లలు కంట్లో రాళ్లలా బాధిస్తూంటే మీకు చీమకుట్టినట్టయినా లేదు. పిల్లలకి పెళ్లిళ్లు ఎప్పుడవుతాయో, ఆ వినాయకుడికి దయెప్పుడు కలుగుతుందో!'

'వినాయకుడికి కలిగేం లాభం, వియ్యంకుడికి కలగాలి గాని!'

'వస్తూంటే సరసం! ఇద్దరికీ ఒకసారి చెయ్యడమంటే...'

'అదే నేనూ ఆలోచిస్తున్నాను. విశాలకేం అదే అవుతుంది - ముందు యీ సుభద్రకి అయిందనిపిస్తే...అయినా నేను మాత్ర

★ సుభద్ర ★

కూర్చున్నావా లక్ష్మీ! చేసే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాను! అన్నారు రంగనాథం గారు. ఆరోజు మొదలు ఆయన మరింత శ్రద్ధతో పనిచేసేవారు. ఎక్కడెక్కడి సంబంధాలూ గాలించేవారు. ఇంకా ఆయన ప్రయత్నాలు అలా ఉండగానే ఓ దుస్సంఘటన జరిగి సుభద్ర జీవితాన్నే తారుమారుచేసింది. ఆ సంఘటన ప్రభావం ఆ యింట్లో అందరిమీదా అంతో యింతో కనపడింది.

* * *

ఒకనాటిరాత్రి వరలక్ష్మికి హఠాత్తుగా ఎవరో ఏడుస్తున్నట్టు అనిపించి మెలకువ వచ్చింది. లాంతరు పెద్దదిచేసి పెరట్లోకి వెళ్ళింది. నూతిగట్టుమీద కూర్చుని సుభద్ర రెండుచేతులతోనూ మొహం దాచుకుని కష్టపడి దుఃఖం ఆపుకుంటోంది. వరలక్ష్మి దగ్గిరగా వెళ్ళింది. సుభద్ర తల్లిని కౌగలించుకుని 'అమ్మా!' అని ఒక్కసారి వెక్కివెక్కి ఏడ్చేసింది. వరలక్ష్మి సుభద్రని విడిపించుకుని 'ఏమిటే, ఏమయిందే?' అని అడిగింది.

'పాపిష్టిదాన్ని. తప్పుచేశాను. ఎలాగే అమ్మా?' వణుకుతున్న పెదవులతో, తీవ్రంగా కొట్టుకుంటున్న గుండెతో సుభద్ర తల్లివైపు చూసింది. తల్లిమొహంలో ఆమెకు ఏవిధమయిన క్షమాభావమూ కనిపించలేదు. ఆమెకు మరింత ఆతృత ఎక్కువైంది.

'ఏంచేశావ్? త్వరగా చెప్పవే!' సుభద్రకి ఏడుపులో దగ్గువచ్చింది. తల్లి అడిగిన ప్రశ్నకు జవాబుగా వాంతిచేసుకుంది. రెండు రోజులబట్టి సుభద్రవాలకం చూస్తే తల్లికి అనుమానంగానే ఉంది. ఇంకేం, అనుమానం దృఢపడిపోయింది! సుభద్ర కడుపుతో ఉంది! పెళ్ళికాకుండా కడుపుతో ఉంది!! కుంతి, ద్రౌపది మొదలయిన పుణ్యచరిత్రలు జన్మించిన భారతభూమిలో పుట్టిన, ప్రత్యేకించి ఆడవాళ్ళ సౌశీల్యమే గణిస్తే మహాపతివ్రతలు గల వంశానికి చెందిన వరలక్ష్మి - యీ వార్త నిజమని తెలియగానే నిలువునా నీరైపోయింది. ఆమె కొలిచి పూజించే దేవతలెవరూ సుభద్ర చేసినపనిని హర్షించలేదు. ఆమె కుమార్తెను ఎంత మాత్రం క్షమించలేకపోయింది. పైగా, రేపొద్దుట తనకి సంఘంలో ఏర్పడేస్థానం తలచుకునేసరికి ఆమెకే దుఃఖం వచ్చింది!

'ఎంతపని చేశావే దిక్కుమాలినదానా! ఇంతమందీ యిలా కళ్ళల్లో కళ్ళుపెట్టుకుని చూస్తూంటే యిలాంటి నిర్భాగ్యపు పని ఎప్పుడు చేశావే! ఎవడే ఆ దరిద్రగొట్టు వెధవ?'

ఎప్పుడూ అబద్ధమాడి ఎరగని సుభద్ర, ఎవరికైనా చిన్న ఆపద జరుగుతే మనసా విచారపడే సుభద్ర, జరిగిన 'దిక్కుమాలిన పని' అంతా తల్లిముందు వెళ్ళబోసుకుంది.

సొంతయిల్లే లేకపోతే నూటఏభై రూపాయిల జీతంతో రంగనాథంగారికి మద్రాసు నగరంలో రోజులే గడిచేవికావు. ఆ యింట్లో ఊరికే పడున్న వీధిగదిని 'ఏదైనా ఉద్యోగం చేసుకుందామని' మద్రాసు చేరుకున్న నారాయణకి పదిరూపాయిలకి అద్దెకిచ్చారు. అతనికి వచ్చిన పదిరోజులకే సుభద్రమీద విపరీతమయిన అభిమానం ఏర్పడింది. ఒకనాడు అతనికి జ్వరంవస్తే సుభద్ర పొద్దుట కాఫీ, రాత్రి జావాయిచ్చి అతని అభిప్రాయాన్ని యినుమడింపజేసింది. ఆ తరవాత ఒకరోజున, తండ్రీ చెల్లెలూ తమ్ముడూ సినిమాకీ, తల్లి పార్థసారధికోవెల్లో హరికథకీ వెళ్ళిపోయిన రోజున - ఏం తోచక ఏదైనా పుస్తకం అడిగి తెచ్చుకుందామని నారాయణ గది చేరుకున్న సుభద్ర- నా అన్నవాళ్ళు లేని నారాయణ జీవితంలో నేను ఉన్నానంటూ ప్రవేశించింది.

* * *

సంగతంతా విని రంగనాథంగారు జాగ్రత్తగా ఆలోచించారు. సహజంగా ఆయనకి సుభద్రమీద ఉన్న చిన్నచూపు, అసహ్యంగా మారిపోయింది. చల్లగా, చాపకింద నీరులాఉన్న యీ దౌర్భాగ్యురాలు ఎంతపని చేసింది! కుటుంబానికి ఎంత అపకీర్తి తెచ్చింది! ఇదేమయినా అంత బాధ లేదు, దీని తరవాత ఏ పాపం ఎరగని ఆ విశాల ఉందే! దాని బతుకేంగాను? దీన్నేం చేస్తే పాపముంది? - అసలు యిప్పుడేం చెయ్యాలి?

ఈ సంగతి వీలయినంత రహస్యంగా ఉంచమని వరలక్ష్మికి చెప్పినతరవాత ఆయన సుభద్రని పిలిచి మరోసారి జరిగిందంతా తెలుసుకున్నారు. నారాయణని పిలిపించి అడిగారు. వాడి ధర్మమా అని అట్టే అల్లరి లేకుండా వాడు జరిగిన సంగతి ఒప్పుకున్నాడు. వాడి కులం తమ కులమే అని తెలిసిన తరవాత రంగనాథంగారు అయిదు నిమిషాలు ఆలస్యం చెయ్యలేదు. వారంరోజులు దాటకుండా మంచిరోజు చూసి యిద్దరికీ దేముడిగుళ్ళో పెళ్ళి జరిపించేశారు. ఇంత సాహసం ఆయనకి ఎలా వచ్చిందో అని బంధువులంతా ముక్కుమీద వేలేసుకున్నారు. కట్నం, బంధువులు లేరు, ఆస్తిలేదు, చదువులేదు - మాగొప్ప అల్లుణ్ణి వెతికి పట్టుకొచ్చావయ్యా రంగడు బావా!' అని ఎవరైనా అంటే 'ఇన్నీ ఉన్నవాళ్ళు మహాసుఖపడి చచ్చారా? దాని అదృష్టం ఎలా ఉంటే అలా జరుగుతుంది!' అని రంగనాథంగారు జవాబు చెప్పేవారు.

'నువ్వు కలిగున్నయింట్లో, పదిమంది బంధువుల్లో పుట్టేవు. ఏ ఆఫీసర్నో పెళ్ళాడి సుఖంగా ఉండవలసినదానివి. చివరికి ఈ నిర్భాగ్యుడు నీకు దాపురించేడు. నన్ను క్షమించు సుభద్రా!' పెళ్ళయినతరవాత మొదటిరాత్రి మధురక్షణాలలో నారాయణ ముందుగా అన్నమాట యిది. సుభద్ర అతని కన్నీళ్ళు తుడిచింది.

'మనకు అదృష్టం ఉంటే మీకే పెద్ద ఉద్యోగం దొరకొచ్చు. మనకి ఎంతో సుఖంగా గడిపే శుభదినాలు రావచ్చు. మీరిలా దుఃఖపడితే నేను ఒప్పుకోనేదిలేదు - నేను మీ నీడని ఉన్నంతకాలం మీరు కంటతడి పెట్టడానికి వీల్లేదు'అంది సుభద్ర.

కళ్ళెత్తి సుభద్రవైపు చూశాడు నారాయణ. అతని జీవితంలో యీ పాతికేళ్ళూ ఒక్క మంచిమాట, ఒక్క వాత్సల్య వచనం, ఒక్క ప్రేమ ప్రియసూక్తి ఎరగడు. తల్లి చిన్నప్పుడే చనిపోగా, తండ్రి చనిపోతూ ఆస్తినంతా తన సవతి తమ్ముడికి రాసిచ్చిన విషాదజీవితం అతనిది. బాగుపడదామన్నా బాగుపడే పరిస్థితులు లేక చెడిపోయినవారిలో చేరిన బతుకు అతనిది. అందుకనే అతనికి చదువుకునే అదృష్టం లేకపోయింది. హైస్కూలు చదువయినా పూర్తిచెయ్యలేకపోయాడు. ఎక్కడో ఏభైరూపాయిలు అప్పుచేసి పట్నంచేరి - నిలవ నీడలేక, గాలిపాటున రంగనాథంగారింట్లో వచ్చిపడ్డాడు. ఇక్కడ యీ అమృతమూర్తి లభించింది.

మెరుస్తున్న ఆ చిన్నకళ్ళను మరోకసారి చూశాడు నారాయణ. పవిత్రభావాలు వెల్లివిరుస్తున్న ఆ నేత్రద్వయంలో ఎక్కడా అసంతృప్తికి తావులేనట్టు కనిపించడం అతనికి ఆశ్చర్యమనిపించింది. సామాన్యసంసారంలో పుట్టిన స్త్రీకి కావలసినవీ, కోరుకో దగ్గవీ ఒక్కటీ సుభద్రకు లభించలేదు. వీలయినంత వేడుకగా జరగడం మాట అటుంచి, ఆమె పెళ్ళికి పట్టుమని పదిమంది బంధువులయినా రాలేదు. ఖరీదయిన బట్టలు, విలువయిన నగలు - వీటి ప్రసక్తే రాలేదు ఆ పెళ్ళిలో. వీటన్నిటికీ కారకుడయిన నిర్భాగ్యుడైన భర్తమీద ఏమాత్రం కంకో లేకపోగా - యింకా ఆమె సంతుష్టిగా ఉండడం నారాయణని చకితుణ్ణిచేసింది.

అతని మనస్సు ఆమెకు జోహారు లర్పించకుండా ఉండలేకపోయింది! సుభద్ర దేన్ని చూసుకుని యింత నిశ్చింతగా ఉందో అతనికి ఎన్నివిధాల ఆలోచించినా అర్థం కాలేదు.

మొట్టమొదట రంగనాథంగారింట్లో తను అద్దెకు తీసుకున్న గది, ఆ గదిలోనే నారాయణ ఉంటేవాడు. అతని సామానులు - పెద్దసామానేం వున్నాయి గనక? ఒక చాప చుట్టా, ఒక బొంతా, ఒక పెట్టె దాంట్లో నాలుగైదు జతలబట్టలూను! - ఇవే సుభద్ర కాస్త పొందికగా అమర్చేది. ఆ వీధిగది కిటికీలో కూర్చుంటే బజారంతా కనిపించేది. బడి మానేసినతరవాత, నారాయణ ఏదేనా పని ప్రయత్నంకోసం పొద్దుటే వీధిలోకి వెళ్లిపోయినతరవాత, ఆమెకేం తోచేదిగాదు. క్రిందకు దిగివచ్చేసరికి విశాలా తల్లీ, ఏదో గుసగుసలాడుకుంటూ సుభద్రని చూసి మానేసేవారు. సుభద్ర అడుగులో అడుగు వేసుకుంటూ తల్లిదగ్గరకు వచ్చి——

'అమ్మా ఏమయినా సాయం చెయ్యనుటే?' అనేది. తల్లి కొంగుతో కనుకొలకులు ఒత్తుకుంటూ

'ఒక్కగా నొక్క తమ్ముడు. వాడుకూడా ఉత్తరమ్ముక్క రాయడం మానేశాడు. ఇంకా ఎందుకు తల్లీ, చాలు! కుటుంబానికంతటికీ చేసిన సాయం చాలు! నిప్పులాంటి వంశం! యాదవకులంలో ముసలం పుట్టిందని...' ఇలా ఏదో మొదలెట్టేది.

ఇంక తల్లిమాటలు వింటూ సుభద్ర అక్కడ ఉండలేకపోయేది. ఒక్కొక్కప్పుడు విశాలకూడా తల్లికి తోడై శ్రుతి కలిపేది.

“చూశావా అమ్మా! మాట పూర్తవకుండా ఎలా వెళిపోయిందో! తప్పుచేసిన మనిషి కాకపోతే నీముందు ఎందుకు నిలబడలేకపోయిందీ? మా క్లాస్‌లో అందరూ 'మీ అక్కయ్యకి చదీ చప్పుడూ లేకుండా యీ గాంధర్వవివాహం వేఁచిట'ని చంపేస్తున్నారే!”

'గాంధర్వ వివాహం' అన్న యీ ముక్కకి పూర్వకాలపు తల్లికి నవ్వొచ్చింది. ఈ కాలపు చదువుకుంటున్న పిల్లకి కూడా నవ్వొచ్చింది. ఇద్దరూ కలిసి పకపకనవ్వేరు. సుభద్ర గుండెల్లో అగ్ని మంటలు రేగుతే మేడమీద 'అత్తవారిల్లు' అయిన ఆగది చేరుకుని ఏడ్చేది.

విశాలా తమ్ముడూ కూడా భోజనాలు చేసి స్కూళ్లకి వెళ్లిపోయిన తర్వాత సుభద్ర కిందకొచ్చి ఏవో రెండు మెతుకులు కొరికేది. ఆ ఎంగిళ్ళుతీసి, యిల్లు కడిగి - అంట్లు నూతిదగ్గర వదేసిన తర్వాత ఆమె కేమీ పనుండేదికాదు. తండ్రి ఆఫీసునుంచి రాగానే మొహం కడుక్కోడానికి మరచెంబుడు చల్లని నూతినీళ్లూ, సబ్బూ, తువ్వాలూ బల్లమీద ఎదురుగా పెట్టేది. చిందర వందరగా ఉంటే తమ్ముడి పుస్తకాలు సర్దేది. ఇన్ని చేసినా ఆమెకు పొద్దు పోయేదికాదు. తమ గదిలో అలా కిటికీలో చూస్తూ కూర్చునేది.

సుభద్ర ఆ కిటికీలో కూర్చునే రోజులు, వారాలు, నెలలు గడిపింది. 'ఏదైనా ఉద్యోగంకోసం' వెళ్లిన భర్త తెచ్చే మంచి కబురుకోసం నిరీక్షిస్తూ ఆమె అక్కడే కూర్చునేది. భర్త రాగానే ఆమె ఏమీ అడిగేదికాదు. అతన్ని చూసే జరిగింది తెలుసుకుని ఒక నిట్టూర్పు విడిచేది. అక్కడే, ఆ కిటికీలోనే ఆమె చేసిన తప్పుపనిని చాటి చెప్పే శిశువు నెలలుగడిచి పెద్దదై తల్లి మొహం మాలిన్యమో, మాధుర్యమో చూద్దామని తొందరపడేది.

'ఈ ప్రపంచంలో నాలాంటివాళ్లు ఎందుకు బతుకుతున్నారో తెలీదు. మన పెళ్లికిముందు అనేకమార్లు ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నించినా, ధైర్యంలేకపోయింది. ఆఖరికి నీతో విప్పరాని ముడిపై నీ జీవితాన్నే నాశనంచేశాను. నా పాపం యిక్కడితోనూ అంతంకాలేదు. ముచ్చట్లూ, ముద్దులూ మన జీవితాలకు అందని అనుభవాలే అనుకుందాం. రోజు గడిచేమార్గమెలా? రేపొద్దున్న మన పాపకు మనం ఏం పెట్టుకోగలం? స్కూలు ఫైనలయినా పాసవ్వని నాకు ఏంచూసి ఎవరు ఉద్యోగమిస్తారు? బంధువులే లేని వాడికి అభిమానం దేనికి? నువ్వు అడ్డు చెప్పకపోతే హార్బరులో కూలీగానో, హోటల్లో సెర్వరుగానో, బస్సులో క్లీనరుగానో చేరిపోతాను'

సుభద్ర కళ్లమ్మట రెండు వేడి నీటి బొట్లు నేలమీద పడ్డాయి. వేరే పని ఏదైనా చేసుకు బ్రతకడంలో ఆమెకేలాంటి అభ్యంతరమూ లేదు. నూటఏభై రూపాయలతో తండ్రి పడుతున్న బాధ, తమ కుటుంబబాధ్యత మరింత తోడై సంసారాన్ని యీదుకురావడంతో ఆయనకష్టం ఆమె ఊహించకపోలేదు.

చెల్లెలు చిన్నపిల్ల; ఎంతో చక్కటిది, మంచి సరదాలున్నదీ! దానిముద్దూ ముచ్చట్లు యిప్పుడు తీరకపోతే యింకెప్పుడు తీరతాయి? దాని సినిమాలకోసం, చీరలకోసం తండ్రి ఖర్చుపెట్టడంలో తప్పేముంది? పోతే తమ్ముడు! వెర్రినాగమ్మ! వాడుమొగాడూ! ఈయిల్లూ, యిందులో ప్రతిఅంశం వాడికి కాక యింకెవరికి? ఎంత ఆలోచించినా సుభద్రకి తన కుటుంబం యీయింటికి భారమైపోతోందనే బాధ ఎక్కువకాజొచ్చింది. ఆమె దీనంగా భర్తవైపు చూసింది. ఆమెకు ఆక్షణంలో భర్తమీద, జీవితంలో అభిమానమనేపదానికి పాతికేళ్ళ వరకు అర్థం తెలియని భర్తమీద, చెప్పలేనంత అనురాగం, అపురూపం కలిగింది. ఈయనేనా కూలీ, సెర్వర్, క్లీనర్!? ఎంత మాత్రం వీల్లేదు. ఈ పురుడు గడిచాక తనే ఏదోమార్గం ఆలోచించాలి.

ఏవిధంగానూ పనికిరాని భర్త అనురాగమూ, తప్పక భరించిన తండ్రిఖర్చూ, విసుక్కుంటూచేసిన తల్లిచాకిరీ - వీటితో సుభద్ర పురుడు గడిచింది.

* * *

రెండునెలలపాపకి పాలిచ్చి పడుకోబెట్టి, చూస్తూండమని భర్తకుచెప్పి సుభద్ర క్రిందకి దిగివచ్చింది. రంగనాథంగారు ఏదో ఉత్తరం రాసుకుంటున్నారు. సుభద్ర నెమ్మదిగా వచ్చి తలదించుకుని బొటనవ్రేలితో నేల రాస్తూ మెల్లిగా పిలిచింది.

'నాన్నా' రంగనాథంగారు తలెత్తి చూశారు. సుభద్ర తలవంచుకునే అంది.

'నే నెందుకూ పనికిరానిదాన్నయిపోయాను నాన్నా! ఈ కుటుంబానికి అన్నివిధాలా బరువునైపోయాను నాన్నా' రంగనాథంగారు అవుననలేదు, కాదనలేదు. నోటితో పెన్ చివర్ని కొరుకుతూ ఆశ్చర్యంగా వినసాగేరు.

'ఈ కుటుంబాన్ని యీదడానికి నువ్వు మొదట్నించీ పడుతున్న బాధలు నాకు తెలుసు. నేను, ఆయన, పిల్ల - యిందరం యింకా యీ కుటుంబానికి ఎక్కువయ్యాం. ఆయన అసమర్థతకి ఆయనా నేనూకూడా సిగ్గుపడుతున్నాం. నీ ఆశీర్వాదమే ఉంటే నేనే ఏదైనా ఉద్యోగం చేస్తాను నాన్నా!'

ఆయన ఆశ్చర్యానికంతులేకపోయింది. కళ్లు పెద్దవిచేసుకుని అన్నాడు.

'అతని ఉద్యోగమైపోయింది, ఇంక నీ ఉద్యోగం ఉండిపోయిందా?' సుభద్ర తల యింకా క్రిందికి దించేసుకుంది. తనలో తను గొణుక్కుంటున్నట్టు అంది.

'లేదు నాన్నా! ఉద్యోగం చెయ్యగలననే నమ్మకం నాకుంది. ముందు మెట్రిక్ పాసయితే ఎక్కడయినా ఏమైనా దొరకొచ్చు......సెప్టెంబరుకే కూర్చుందామని ఉంది నాన్నా...పుస్తకాలకీ ఫీజుకీ ఒక్క పాతిక రూపాయిలు...'

'అందుకటే యీ వ్యాఖ్యానమంతా? ఆ మాట ముందే చెప్పకూడదూ? నా సంసారబాధ్యత అంతా వంటబట్టించుకొన్న దానివి - యిరవైయో తారీకున నాదగ్గిర

★ సుభద్ర ★

పాతిక రూపాయిలు ఉంటాయని ఎలా అనుకున్నావే?'

'నీదగ్గిర ఉండవని నాకు తెలుసు. ఇప్పుడే యిమ్మని నేను అడగను. జీతమందిన తరవాతే, యిద్దువుగాని...'

'ఏమో అప్పుడు మాత్రం ఏం ఖర్చులొస్తాయో ఎవరు చెప్పగలరూ? బాకీలు తీర్చేసరికి చేతిలో పది రూపాయలేనా మిగలవు—ఏమో, నీ ఆలోచనేం నాకు నచ్చలేదు. అయినా చంటిపిల్లతో చదువేం సాగుతుంది?' సరిగ్గా వేళకు పాపాయి ఏడ్చింది. సుభద్ర గబగబా మేడమీదకు వెళ్ళిపోయింది. సుభద్ర మొహం చూసి నారాయణ జరిగిన సంగతి తెలుసుకున్నాడు. పొద్దుట కొత్త చీరకని పదిహేను రూపాయిలు రంగనాథంగారు విశాలకివ్వడం అతడు చూశాడు. ఈ యింట్లో జరుగుతున్న యింకా అనేక అన్యాయాలు అతడు చూస్తున్నాడు. కాని అతడు ఏ అధికారంతో ప్రశ్నిస్తాడు? భార్యదగ్గిర చెప్పి ఆమెను బాధించడం అతనికసలు యిష్టంలేదు. నారాయణ సాధారణ మానవులకుండని సహనం-సుభద్ర వద్ద నేర్చుకున్నాడు. విశాల జోళ్లు చప్పుడు చేస్తూ ఎక్కడికో వెడుతోంది. సుభద్ర పైనుంచి చూసి పిలిచింది. విశాల తల పైకెత్తి చూసింది.

'విశాలా, విశాలా! చిన్న కబురు. ఒకమాటిలా రావే!'

'నా కవతల మీటింగు ఉంది. ఎందుకూ, నువ్వే యిలా రా' అంది మొహం చిట్లించి.

సుభద్ర ఏడుస్తున్న పాపని బలవంతాన మొగుడికిచ్చి

'మాడండి - ఒక్కసారి దీన్నలా దూరంగా తిప్పి ఆడించండి - దాంతో మాట్లాడే పనుంది' అని గబగబా కిందకొచ్చింది. ఇద్దరూ విశాలగదిలోకి వచ్చారు.

'నెల్లీ! ఎప్పుడూ నిన్నేం అడగలేదు. ఈ ఒక్క కోరికా కాదనకు. నేను నాన్నతో అన్నదంతా విన్నావుగా... పాపం ఆయనెక్కడ్నుంచి తేగలరు? ఒక్క పాతిక రూపాయిలు నీదగ్గిరుంటే యియ్యి. మళ్ళీ తప్పకుండా యిచ్చేస్తాను.'

'నాదగ్గిరమాత్రం అంత సొమ్మెక్కడిదే? నాకే మైనా నీలా పెళ్లయిందా, నా మొగుడేం అర్జనపరుడా?' విశాల విసురుగా వెళ్ళిపోయింది. ఆ రోజు క్లబ్బులో "స్త్రీ నిస్సహాయత - తోటి స్త్రీ చూపించవలసిన సహాయం" అనే విషయంపై ఆమె మాట్లాడుతుంది!

* * *

'చూడు నారాయణా, ఈ రెండుత్తరాలూ పోస్టులో పడేసి నాలుగు కార్డులు కొనుక్కురా. వచ్చేటప్పుడు బజారు కెళ్ళి ఒక వీశ వంకాయలు పట్టుకురా.' రంగనాథంగారిదగ్గిర డబ్బులూ సంచీ పట్టుకుని నారాయణ బజారుకి వెళ్లేడు. ఇలాంటి పనులు చేస్తున్నందుకు అతను ఏమాత్రమూ నొచ్చుకోడు. వాళ్లు తనకి రెండు పూటలా తిండి పెడుతున్నారు. పొద్దుటా మధ్యాన్నం కాఫీ యిస్తున్నారు. ఏవిధంగానూ వాళ్లకి తను సాయపడలేడు, చెప్పిన పని చెయ్యడంలో నామోషీ దేనికి?

నారాయణ యీ నమ్రతాభావం లోకువకింద జమకట్టి ఆ యింట్లో అందరూ అతని మీద అధికారం చెలాయించేవారు.

'ఊరికే యింట్లో అలా కూర్చోకపోతే వీధిలో పాలవాడు అలా కేకలేస్తున్నాడు, ఏం, కొస్త మేడ దిగి పాలు పోయించుకుంటే మన ప్రతిష్ఠకేం భంగమా?' అనేది వరలక్ష్మి.

'బావగారు మరోలా అనుకోకపోతే, మధ్యాన్నం ఆ న్యూమార్కెట్నుంచి రాలేక చస్తున్నాను, కాస్త రోజూ టిఫిన్ తెచ్చిపెడితే...' అని పురమాయించేది విశాల.

మంచివాళ్లను ఎవరూ జయించలేరు. నారాయణ ఎన్ని పనులు చెప్పినా విసుక్కోలేదు. ఇన్ని పనులూ చేసి మిగిలిన కాలమంతా సుభద్రకీ పాపకీ ఏవిధంగానైనా సహాయం చెయ్యడానికి ప్రయత్నించేవాడు.

గాజు లమ్మి, వచ్చిన డబ్బుతో సుభద్ర పరీక్షకు కట్టింది. ఆమెకి చదువుమీద ఏనాడూ లేని శ్రద్ధ యిప్పుడు కలగడం చూసి యింట్లో అందరికీ ఆశ్చర్య మనిపించింది. తమ్ముణ్ని బతిమాలి ఎక్కడెక్కడివో సెకండ్ హేండ్ నోట్సు సంపాదించింది. ఒక సైడు మాత్రం కొట్టబడిన తెల్ల కాగితాలు నారాయణ ఎదురింటి ఆఫీసర్ని అడిగి తేగా వాటిమీద లెక్కలు చేసేది. ఆ మిగిలిన సొమ్ముతో మొగుడికి రెండు నేత పంచెలు, రెండు చొక్కాలకు సరిపడే గుడ్డా, పాపకి ఒక గౌనూ రెండు జతల రబ్బరు గాజులూ కొంది. ఇదంతా చూసి వరలక్ష్మికి మరింత అసహ్యం వేసింది. కడుపున పుట్టినదే అయినా యీ 'పాపిష్టిదాని' యీమాత్రం ఔన్నత్యం ఆమె భరించలేకపోయింది.

'దీనికీ, దీని మొగుడికీ కూడా చాకిరీ చెయ్యడానికి నేనేం దాసీదాన్నా?' అనుకుని తను మోస్తున్న పల్లకీలో ఒకకొమ్ము సుభద్రమీద వదిలేసింది. ఆ రోజునుంచీ రాత్రిపూట వంటభారం యావత్తూ సుభద్ర మీద పడింది! అయినా సుభద్ర ఓడిపోలేదు. నారాయణకి ఎక్కువగా చాకిరీ తగుల్తే సుభద్రా, సుభద్రకి మరింత పని ఎక్కువయితే నారాయణా మాత్రం బాధపడే వారు! ఒకర్నొకరు ఓదార్చుకొనేవారు. ఇద్దరూ అప్పుడే అడుగుదీసి అడుగువేస్తున్న పాంసపిల్లను చూసి మురిసిపోయేవారు!

అవాళ పేపర్లో మెట్రిక్ రిజల్ట్సు పడ్డాయి. నారాయణ సంతోషాని కంతులేకపోయింది. పిల్లనెత్తుకుని క్రిందకు దిగబోతున్న సుభద్రని గుమ్మందగ్గిరే ఆపేసి కౌగలించుకున్నాడు.

'ఇందులో నేను చేసిందేముంది? ఈ విజయం మీదే. రాత్రనక, పగలనక నాతో కూడా మేలుకుని, ధైర్యం చెప్పి - ఎన్నిసార్లయినా విసుక్కోకుండా పాపాయిని ఆడించి...'

'ఇంక చాలు - ఆపు.' సుభద్ర నవ్వింది. ఆమె చిన్నకళ్లుకూడా నవ్వేయి. పాపాయి నవ్వింది. నారాయణకూడా నవ్వేడు. ఇన్నాళ్లకి - కాపురంలో మొదటిసారిగా - యిద్దరూ కలిసి నవ్వుకున్నారు.

'నేను మొదట చదివిన హైస్కూలు హెడ్మిష్ట్రిస్ చాలామంచిది. నేను మొన్న మాంబళం బస్సులో వస్తూంటే కనిపించింది. నేను చేసినపనికి చాలా సంతోషించింది. ఈమాట వింటే మరీ సంతోషిస్తుంది. 'ఇది గనక పాసయితే డిస్కంటిన్యూ చెయ్యకు, వెంటనే ట్రైనింగు అయిపో - నువ్వే తుణాన్ని వచ్చినా మన హైస్కూల్లో పోష్టు ఖాళీగానే ఉంటుంది' అని చెప్పింది. కాని...' సుభద్ర ఆపేసింది.

'ఆపేశావేం, చెప్పు?'

'మరేంలేదు. ట్రైనింగుకాలేజి చాలా దూరం. మనింటికి మూడు మైళ్లయినా ఉంటుంది. ఎలాగా అని ఆలోచిస్తున్నాను'

'పొద్దుటే భోంచేసి నడిచి వెళ్లిపో .. సాయంకాలం రా'

'మరి యిది? ఇంకా ఏణ్ణర్థమయినా లేదే నన్నువిడిచి ఉండగలదా?'

'నేను ఉన్నానుగా? దాన్ని ఆడించే పూచీ నాదీ' సుభద్ర మనస్సుకి వెయ్యి ఏనుగులబలం వచ్చేసింది. ఆమె కళ్లలో గిర్రున నీళ్ళు తిరిగి నారాయణ పాదాలమీద పడ్డాయి.

'మీకు చదువులేదు...కాని హృదయముంది' అంది ఆమె అప్రయత్నంగా.

ఆరాత్రే భోజనాలదగ్గర వరలక్ష్మి ప్రస్తావన తీసుకొచ్చింది.

'విన్నారా? ఇది ట్రైనింగు కూడా చదువుతుందిట'

'చదవనీ - మనకేం?'

'అంతలో ఉండన్నమాట నా తెలివి. ఎంత పట్టించుకోకుండా ఏడుకొండల వాడ్ని తలుచుకుంటూనుకున్నా, ఇరుగూ పొరుగూ యిప్పటికే పనీపాటూ లేనివాడ్ని తెచ్చి యింట్లో కూర్చోపెట్టుకున్నామని దూదేకినట్టు ఏకేస్తున్నారు. ఇక యీవిడగారు ఉద్యోగంకూడా వెలిగిస్తే, అతనికి సిగ్గులేకపోతే పోవాలిగాని - వాళ్లని ఉంచుకోడానికి మనకేనా అభిమానం ఉండొద్దుటండీ?'

'నీ తెలివితేటలకి సంతోషించాంగాని, దానికే నిజంగా ఉద్యోగమైతే వాళ్లెక్కడెందుకుంటారూ? అప్పుడు మనం పంపేశామని లోకనింద ఉండదుగా?'

'అవును నిజమే. నే అంతముట్టుకు ఆలోచించలేదు. అవునుగాని పద్దెనిమిదికూడా వెళిపోతాయి,ఆ విశాలకేనా మంచి సంబంధం చూడరేమండీ? ఈ స్కూలు ఫైనలు పరీక్ష అయిపోయేసరికి - ముందుగా సంబంధం నిశ్చయించుకునివుంటే - అయిందనిపించవచ్చు. ఇంకా ఆలస్యంచేస్తే మన పెద్దమ్మాయిలాగే...'

'ఛత్ ఊరుకో! అదెక్కడ, యిదెక్కడ? విశాలకి అలాంటి యిలాంటి సంబంధం నచ్చుతుందా? అయినా అదింకా చదువుకుంటానంటే మనం కాదనగలమా?' అన్నారు రంగనాథంగారు.

* * *

రంగనాథంగారు అనుకున్నట్టే జరిగింది. సరిగ్గా ఏడాది గడిచినతర్వాత చూస్తే విశాల ప్రెసిడెన్సీ కాలేజీలో యింటర్ చదువుతోంది. సెలవుల్లో రంగనాథంగారు తీసుకొచ్చిన ఏ సంబంధమూ విశాల భావాలకు అనుగుణంగాలేదు. ఈ యిల్లు పాతికవేలకి అమ్మేసి త్యాగరాయనగర్‌లో మరోక యిల్లు పద్దెనిమిదివేలకి కొనుక్కుని - మిగిలిన సొమ్ముల్లో అయిదువేలదాకా కట్నానికీ మిగిలింది పెళ్లిఖర్చులకీ పెడదామనీ రంగనాథంగారు అంతా సిద్ధంచేస్తే, విశాల నా కిప్పట్లో పెళ్లొద్దు పొమ్మంది.

ఈ ఏడాదిలో యింకా అనేక మార్పులు జరిగేయి. వరలక్ష్మికి కీళ్లవాతం వచ్చి ఆ దేముడి గదిలోనే మంచం దిగేదికాదు. సెకండరీగ్రేడు ట్రైనింగు ప్యాసయి వెంటనే ఉద్యోగం దొరికినా సుభద్రకి వంటపని తప్పిందికాదు. ఇంటిదగ్గిర యీ పనితోనూ, కొత్తలో ఉద్యోగంలేని త్రొక్కిడివల్లనూ ఆమెకు క్షణం తీరికయ్యేదికాదు. ఆ రోజుల్లో ఆమె దినచర్య గమనిస్తే మిక్కిలి విచిత్రంగా ఉండేది. అది యంత్రమో మానవశరీరమో అర్థమయ్యేది కాదు.

సుభద్ర, నారాయణ ఉదయం నాలుగింటికే లేచేవారు. నారాయణ పాపదగ్గిరే ఉంటే, సుభద్ర కిందకి దిగి త్వర త్వరగా కాలకృత్యాలు తీర్చుకుని నీళ్ల పొయ్యీ కాఫీ కుంపటీ అంటించేది. పాలు కుంపటి మీద పెట్టి నారాయణ్ణి చూస్తూండమని నీళ్లు పోసుకుని వచ్చేది. రాగానే కాఫీ చేసేసి - కత్తిపీట ముందేసుకుని కూరలు తరుగుతూ ఉండేది. పక్కనే భర్తతో కబుర్లు చెబుతూంటే ఆమె కేపని చేస్తున్నట్టే ఉండేది కాదు.

'నిజంగా నాలాంటి అదృష్టవంతురాలు లేదు. మీలా ఎవరువచ్చి సాయంచేస్తారు?'

....

'ఇలాంటప్పుడు అమ్మని విడిచిపెట్టి ఎక్కడికి వెళ్లను? చెల్లాయి చిన్నదీ-దానికేం తెలుసు! అది చిన్నప్పట్నుంచీ ముద్దుగా పెరిగింది ... శ్రద్ధగా చదువుకుంటోంది. ఇలాంటప్పుడు వంటపని అప్పచెప్తే అదేం చెయ్యగలదు?...

'ఫస్టుతారీకు రాగానే నా జీతం జీతంలా నాన్న చేతిలో పెట్టేస్తున్నాను. చెల్లాయి పెద్దచదువులు చదువుతోంది. దానికేం తక్కువవుతుందా? నాన్నకి అమాత్రమేనా సాయం చెయ్యకలుగుతున్నానని నాకెంతో తృప్తిగావుంది!...

'ఇంకోళ్లయితే నేను మొదటచేసిన పాడు పనికి యింట్లోంచి గెంటేద్దురు. మొహమొహాలు చూసుకోకుండా చేద్దురు. కాని నాన్న నన్ను ఆదరించి పెళ్లిచేశారు. ఆయన ఋణం ఎన్ని చేస్తే తీరుతుంది?..."

ఇలా ఏవేవో సుభద్ర చెప్పుకుంటూ పోయేది. నారాయణ ఆశ్చర్యంగా వినేవాడు.

'ఇద్దరు పిల్లలు ప్రైవేటు చెప్పించుకుంటామన్నారు. వాళ్లిచ్చేజీతాలతో మనపై ఖర్చులకి చాలు'

నారాయణ, ఆశ్చర్యాని కంతులేకపోయింది.

'ప్రైవేట్లుకూడా ఎక్కడ చెబుతావ్? టైమేదీ?'

'మనకుంటే మార్గమేలేదూ? మీరుండగా నాకు తీరికేలేదూ?' సుభద్ర నవ్వేది. ఈలోగా తల్లీ తండ్రీ లేచేవారు. వాళ్లిద్దరకూ కాఫీలిచ్చి, తమ్ముడికీ విశాలకీ కాఫీలు ఫ్లాస్కులో పోసి, పాపాయికి పాలిచ్చివచ్చి సుభద్ర మడిగట్టుకొనేది. ఎనిమిదిన్నరకి

★ సుభద్ర ★

వంటయిపోయేది. తనుమాత్రం గబగబా భోంచేసి, చిన్న కేరియర్‌లో మధ్యాహ్నానికి మజ్జిగాన్నం సద్ది ఉంచుకునేది. ఈ లోగా జడవేసుకుని - ఒక్క పదినిముషాలు పాపాయితో ఆడుకుని ... దాన్ని అలంకరించి ... 'యిప్పుడే అలా వెళ్ళి వస్తాన'ని చెప్పి ... నాలుగడుగులు నడిచి సందుచివర మాయమయ్యేది. ఆవిడఖర్మమూ అని వరలక్ష్మమ్మ మాత్రం మిగిలినవాళ్ళకి వడ్డించేది. ఆరోజుకి కావలసిన బజారు సామానులూ, వరలక్ష్మికి మందులూ, యింట్లో పాపాయి సంరక్షణా నారాయణ చూసుకొనేవాడు. సుభద్ర సాయంకాలం అయిదింటికి వచ్చి ఆరింటివరకూ ప్రైవేట్లు చెప్పి-తర్వాత వంటపని చూసుకునేది.

ఒకనాడు - సాయంకాలం వేళ - విశాల చల్లగాలికి డాబామీద కూర్చుంది. తనకు తెలియకుండా తనలో యిదివరకు యిమిడి ఉన్న ఏదో ఒక అసంతృప్తి - పదిరోజుల్నించీ మరీ ఆందోళన కలిగించ నారంభించింది. ఈ చదువులూ, క్లబ్బుల్లో ఉపన్యాసాలూ, ఆమె కేవిధంగానూ తృప్తి నియ్యలేకపోయాయి. ఎదురుగుండా కిటికీలో నారాయణ, పాపాయితో ఆడుకోడం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ చిన్నపిల్లతో ఒకమారు ఆడుకుంటే మనస్సెంతైనా తేలిక పడుతుందని ఆమె కనిపించింది. కాని ఆమె అక్కకూతుర్ని ఎత్తుకోడానికి యిష్టపడలేకపోయింది. 'పెళ్లాం చేత పోషింపబడుతున్న యీ దిక్కుమాలిన వాడి'దగ్గరకు వెళ్లడానికి ఆమెమనస్సు అంగీకరించలేదు. సరిగ్గా అదేవేళకు క్లబ్ బంట్రోతు వచ్చాడు. ఆవాళ ఆమె 'కన్యలు - చిత్తస్థైర్యము' అనే విషయం మీద మాట్లాడాలి. ఆమెకు ఆ హెడ్డింగు కాగితంపై చూడగానే మనసులోనుండి ఎవరో ప్రశ్నిస్తున్నట్టయింది. తలనెప్పివంక పెట్టి వాడ్ని పంపివేసింది. ఆమె హృదయం ఆమెను ప్రశ్నించడం మానలేదు. ఇంతలోనే సుభద్ర డాబామీదకు వచ్చింది.

'ఇక్కడున్నావుటే, ఇల్లంతా వెతుకుతున్నానూ? చూడు విశాలా రేపు మా స్కూల్లో నాటకం. నే వచ్చేసరికి పొద్దుపోతుంది. రేప్పొద్దుటే నేను రాత్రికూడా అన్నం వండేసి వెళిపోతాను. నాన్న కూర లేకపోతే విసుక్కుంటారు. నువ్వు ఏదైనా వేపుడు చేసి...'

విశాలను ఆ యింట్లో ఎవరూ యిప్పటికి పొయ్యిదగ్గరకు వెళ్లమనలేదు. ఈనాడు ఈవిడగారు ఉద్యోగం చేస్తున్నాననే గర్వంతో...అలా ఆమె ఊహాలు పరుగెత్తేయి.

'నాకేం చేతకాదక్కా, నువ్వే పొద్దుట అన్నీ చేసి వెళిపోదూ ..' అనేసింది అటు తిరిగి.

సుభద్ర మరేం మాట్లాడకుండా క్రిందికి వెళ్లిపోయింది. అక్కడే అనేక ఆలోచనలతో విశాల చీకటిపడేదాకా గడిపింది. సుభద్ర మేడమీదకు వచ్చినపుడు తన గురించి బావతో ఏం చెబుతుందో ఆమెకు వినాలనిపించింది. డాబా చివరకి వచ్చింది.

'నిజంగా దానికేం వంట చేతకాదు. కాలేజీగొడవ తప్పితే దానికేం తెలుసూ, చిన్నపిల్లా! వంటే వచ్చిఉంటే అది ఒక్కనాటికి నన్ను చెయ్యనిచ్చేదా?'

విశాల చెవుల్లోంచి ఈ మాట ఎంతసేపయినా పోలేదు. ఆమె కారాత్రి నిద్రపట్టలేదు.

* * *

మనస్సుకున్న వేగం శరీరానికి లేదు. అంత కష్టపడి సుభద్ర మనస్సా పనిచేస్తున్నా, ఆమె శరీరం అంత కష్టానికి ఓర్వలేకపోయింది. ఆమె త్వరలోనే జబ్బు పడిపోయింది- మొదట్లో కొద్దిగా జ్వరమొస్తున్నా ఆమె లెక్కచెయ్యక తన పనులు చేసుకో నారంభించింది. కాని ఆమె జ్వరం తగ్గలేదు. క్రమంగా ఆమె మంచంమీద పడుకోక తప్పలేదు. వరలక్ష్మి విసుక్కుంటూ చాకిరీ చెయ్యకా తప్పలేదు. 'ఆఖరికి నా కర్మకాలి అడ్డమైనవాళ్లకీ చాకిరీ చెయ్యవలసివస్తోంది' అంది ఒకసారి. ఈ మాటకి ఎందుకో విశాలకి కష్టమనిపించింది. తల్లిని గట్టిగా 'నాకు జబ్బుచేస్తే ఇలాగే విసుక్కుంటావుటే?'అని అడుగుదామనుకొంది. కాని ఆమె అభిమానం అడ్డొచ్చింది. 'నేనూ సుభద్రా ఒకటేలా ఔతాం?' అనుకుంది.

'ఏంచేస్తానూ, నా కర్మ నా యనా యిదంతా...పద భోజనానికి' అని అత్తగారు అదోలా చూస్తూ అన్నప్పుడు మాత్రం అతి సహనభావం అలవరుచుకున్న నారాయణకికూడా మనసు కెలికినట్టయేది. వీవో పేరుకి రెండు మెతుకులుకొరికి లేచిపోయేవాడు.

'ఇలా చూడండి...మా అమ్మ పెద్దదీ, జబ్బుమనిషీ...ఒకవేళ ఏదయినా అన్నా మీరేం అనుకోరు. మీ స్వభావం నాకు తెలుసు...మీరు కడుపునిండా భోంచెయ్యకపోతే నామీద ఒట్టే...ఇలా తిరగండి, మీకు మంచి కబురుచెబుతానూ, మా హెడ్‌మిస్ట్రెస్ మొన్న ఏమందో తెలుసా? టైపు లోయర్ గ్రేడ్ పాసయినా సరేట, మీకు ఉద్యోగం యిప్పిస్తానంది. ఈ వేసవిశెలవల్లో మీరు తప్పకుండా టైపు నేర్చుకుందురుగాని, ఏంకే?'

సుభద్ర యీ మాటలు అంటున్నప్పుడు నారాయణ అటువైపు తిరిగి కన్నీళ్లు తుడుచుకునేవాడు. పాపాయిని దగ్గరగా తీసుకునేవాడు. సుభద్ర కష్టపడి నవ్వేది.

'ఏమి టాలోచిస్తున్నారు? నావైపు తిరగండి, యిలా చూడండి'

'నేనీ యింట్లో యింక క్షణం ఉండదల్చుకోలేదు. ఏమాత్రం ప్రత్యుపకారం లేకపోయినా సంతృప్తిపడే నీలాంటి దివ్యహృదయం నాకు లేదు...రెండ్రోజులై నీకు జ్వరం. బాగా ఎక్కువగా వస్తోంది. అంతకు ముందు మూడురోజులై ఉంది. ఒక్కసారైనా నువ్వెలా ఉన్నావో అని మేడమీదకు వచ్చారా?' నారాయణ రెండు చేతులతోనూ మొహం కప్పుకున్నాడు. వేళ్ళ సందులనుంచి కన్నీటి చుక్కలు సుభద్ర బుగ్గమీద పడ్డాయి. కాస్సేపు ఆగి నెమ్మదిగా అంది.

'మీ రింత చిన్నవిషయానికి మనసు పాడుచేసుకుంటారనుకోలేదు. నాకు జ్వరం ఎక్కువైందని వాళ్ళకి తెలిసిఉండక పోవచ్చు - అయినా మీ రిలా చిన్నపిల్లాడిలా ఏడుస్తే నేనేం ధైర్యం చెప్పనూ? నేను మరేమీ అయిపోను...రేపటికే తగ్గిపోతుంది'.

మూడోరోజు సాయంత్రం విశాల అడుగులో అడుగువేసుకుంటూ నెమ్మదిగా మేడ ఎక్కి అక్కగదిలోకి వచ్చింది - ఇంకా పక్కదగ్గరకి రాకుండానే—

'కాలేజీ, క్లబ్బూ మానుకుని ఏమంత మించిపోయిందని అక్కగార్ని చూడ్డానికి వచ్చావ్?' అనేశాడు గబుక్కున నారాయణ. విశాల అహంకారం దెబ్బతింది.

'నే అందుకోసం ఏంరాలేదు' అనేసి గబగబా మేడదిగి వెళ్లిపోయింది. నారాయణ ఒక్కసారి నిర్లక్ష్యంగా అటు చూసి సుభద్రకు మందిచ్చాడు.

'ఈ ఆసుపత్రిమందు వద్దంటే వినవ్ - ఇలా యింకా ఎన్నాళ్ళు చేసి ప్రాణం మీదకు తెచ్చుకుంటావ్? వెళ్లి పెద్దడాక్టర్ని పిల్చుకొస్తాను'

నారాయణ బయలుదేరుతూంటే సుభద్ర చొక్కా పట్టుకుని ఆపేసింది.

'ఒద్దు - నాన్నకి మళ్లీ ఖర్చు. అదే తగ్గిపోతుంది' అంది. ఈమాటలు మెట్లుదిగు



అమ్మవారు

తున్న విశాల వింది. ఆమె గుండెల్లో బాణం గుచ్చుకుంది. 'అక్కకేం కావలసినా నే నిస్తాను - పెద్దడాక్టర్ని తీసుకరా బావా!' అని అందామని ఆమె తిరిగి అక్క గది వైపు రెండుమెట్లెక్కింది. సుభద్ర మాట వినకుండా పెద్ద డాక్టరికోసం బయలుదేరిన నారాయణ అప్పుడే తలుపు తీశాడు.

'ఇప్పు డెలాఉంది బావా?' అంది విశాల.

'ఎలాఉంటే నీకేం? నువ్వు అందుకోసం రాలేదుగా!?' నారాయణ గబగబా మేడ దిగి వెళ్లిపోయాడు. విశాల మొహం ఎర్ర బడింది. అంతకన్న త్వరగా క్రిందకి దిగి వచ్చింది.

'ఎలా ఉందే?' అని తల్లీ తండ్రీ ఒక్క సారే అడిగారు.


'బాగానే ఉంది! మరేం ప్రాణపోని లేదు!' అంది వెటకారంగా అక్కని చూడని విశాల. కాని విశాలమాటలు నిజంకాలేదు. ఆ మరునాడురాత్రే సుభద్ర నిర్భాగ్యుశ్లైన బావనూ దిక్కుమాలిన పాపనూ యీ పాడులోకానికి అప్పజెప్పి నక్షత్ర మండలంలోకి వెళ్లిపోయింది! ఆ పవిత్ర హృదయానికి సమీపించడానికైనా సాహసంలేక అమ్మా నాన్నా అంతదూరంలో ఎందుకూ పనికిరాని చూపులు చూస్తూవుండగా-అక్క బావ బుగ్గల్ని రెండుచేతుల్లోనూ పట్టుకుని ఏమంది? 'నేను మిమ్మల్ని యీ లోకానికి అప్పజెప్పి ఎక్కడికీ వెళ్లిపోను. నేను చచ్చిపోను, చచ్చిపోను బతికేఉంటాను!' చివరిదాకా అక్కప్రాణం బావకోసం పాపాయికోసం గిలగిల తన్నుకుంటూనే ఉంది.

'మీరలా ఏడవకండి... నేను ఉద్యోగం చేసి పోషిస్తున్నా ఏనాడూ మీ హృదయం తక్కువతనాన్ని గురించి బాధపడలేదు... మీరే ఉద్యోగం చేద్దురుగాని... టైపుపరీక్షకట్టి పాసై మా స్కూల్లో క్లర్కుగా పనిచేద్దురుగాని! నేను మిమ్మల్ని వదలను - వదలలేను! మన్నిద్దర్నీ ఎవ్వరూ వేరుచెయ్యలేరు!'

'నాన్నా! చిన్నతనంలో తెలియక తప్పుపనిచేసినా క్షమించి ఆదరించావు. నేను నీ కేవిధంగానూ ఋణం తీర్చుకోలేకపోయాను. పిల్లలు తప్పుచేస్తే పెద్దవాళ్లే క్షమించాలి. నన్ను మరొకసారి క్షమించు నాన్నా!'

నాన్న కన్నీళ్లు తుడుచుకున్నారు. అమ్మ ఆడది కాబట్టి విలువలేని ఏడుపు ఒకటి ఏడ్చింది. నాన్న గడుసువాడూ, అమ్మ పూర్వకాలపుదీ! వీళ్లకి హృదయాలు లేవు! చదువుకొన్న తనకు? ఒకనాడు అక్కని తనతో పోల్చడానికి నిరాకరించిన విశాల, యీనాడు తన్ని అక్కతో పోల్చుకోడానికి సిగ్గుపడుతోంది!

అక్క! అక్కని తలుచుకోడానికేనా తనకు అర్హత ఉందా? ఈ ప్రపంచంలో కొందరు ఒకళ్ళకు చెయ్యడానికే పుడతారు. అక్క అలాంటిదే. అక్క పెద్దపెద్ద పుస్తకాలేం చదువుకోలేదు. కాలేజీ చదువు చదవలేదు. బల్లలుగుద్ది ఉపన్యాసాలు యివ్వలేదు. అయినా అక్క జీవితాన్ని చూస్తే ఆమెకు అలవడని ఉత్తమసంస్కారం లేదు. దిక్కులేనివాడిని మనస్ఫూర్తిగా పెళ్లాడింది. చేతకానివాడ్ని మనస్ఫూర్తిగా జీవితాంతమూ ప్రేమించింది. ఏకొడుకూ వహించని తండ్రి బాధ్యతంతా తనే వహించింది. కష్టపడి చదువుకుని ఉద్యోగంచేసి తండ్రికీ భర్తకీ చిరునవ్వుతో తోడ్పడింది! ఓటమి లేని జీవితం అక్కది! స్వార్థమెరుగని



"కొండదాపునా గోవులు కాచిన
కొండొక శిశువుకు గొబ్బిళ్లో"

—ఫొటో: నాళం కామేశ్వరరావు.

★ సుభద్ర ★

త్యాగం అక్కది! అక్క చచ్చిపోనేలేదు! దాని కెన్నటికీ చావులేదు! తను?

మళ్లీ ఏడుపుకున్నది. క్లబ్బులో వారం వారం ఉపన్యాసాలిస్తుంది. క్లబ్బు ప్రెసిడెంటుకూడాను! తోటిసోదరి గర్భవతి అని తెలిసినాడు పకపక నవ్వుతుంది! ఆ అక్క చేతా, ఆఖరికి బావచేతకూడా చివరివరకూ సేవ చేయించుకుంది! ఆ బావ దుఃఖక్షణాలలో ఉన్న నాలుగుముక్కలూ అంటే అభిమానపడి చేజేతులా అక్కను బలియిచ్చింది! తను ఆ అక్కపాదాలదగ్గిర సిగ్గుతో తలబ్రద్దలు కొట్టుకుని చనిపోకపోయిందా? ఏవిధంగానూ ఎవరికీ ఉపయోగపడని తను బ్రతికేఉందా?

పాతస్మృతులు జ్ఞాపకంవచ్చి, సంఘటనల స్ఫురణ పశ్చాత్తాపం తెచ్చి - నాలుగు రోజులు పిచ్చెత్తినట్టు బాధపడినతరవాత విశాలకు ఒకనాటిరాత్రి ఒక వింత ఆలోచన వచ్చి కొంచెం సేద దీర్చింది. తను బావను పెళ్లాడితే? బావకన్న మంచిహృదయం తనకి ప్రపంచంలో దొరుకుతుందా? ఇంతకన్న అక్కఋణం యింకేవిధంగా తీర్చుకోగలదు? ఇంకేవిధంగా తనలోని అగ్నిజ్వాలలు చల్లారుతాయి?

పిచ్చిబావ! సముద్రంలో రత్నంలా తమ యింటికి కొట్టుకొచ్చిన వెర్రిబావ! అక్క మరణంతో పిచ్చివాడై నాలుగురోజుల్నుంచి గదిలో గుండెలు బ్రద్దలయేలా విలపిస్తున్న నారాయణబావ! ముందు ఆ కాళ్లమీదపడి మనస్సులోని మాలిన్యమంతా కన్నీళ్లలో కరిగిపోయేలా ఏడవాలి! తరవాత క్షమించమని ప్రార్థించాలి! ఆఖర్న తన్ని స్వీకరించమని వేడుకోవాలి! బావ తన్ని క్షమిస్తాడా? స్వీకరిస్తాడా??

విశాల నెమ్మదిగా మేడమెట్లు ఎక్కింది. ఒణుకుతున్న వేళ్లతో గదితలుపు తోసింది. తలుపులు తెరుచుకున్నాయ్. బావ లేడు! కిటికీలో లాంతరుక్రింద ఉత్తరం గాలికి రెపరెప కొట్టుకుంటోంది.

"విశాలా, ఈ యింట్లో ఎవరైనా హృదయమంటూ ఉన్నవాళ్లుంటే, అది నువ్వే అని నాకు తెలుసు గనక నీకే యీ ఉత్తరం రాస్తున్నాను. నాలుగేళ్లక్రిందట వట్టి చేతులతో నే నీ యింటికి, ముఖ్యంగా యీ గదిలోకి వచ్చాను. తిరిగి యివాళ నా దివ్యజ్యోతి నాకిచ్చిన స్మృతిచిహ్నాన్ని నా పాపాయిని తీసుకుని వెళ్లిపోతున్నాను. విశాలా, మీ అక్క చచ్చిపోలేదు. నేను బ్రతికున్నంతవరకే కాదు, హృదయమున్న మానవులున్నంతవరకూ దాని చరిత్ర శాశ్వతమై ఉంటుంది. మీ అక్క నాకెన్నో నేర్పింది. నువ్వు కూడా ఏమైనా నేర్చుకుంటే అదృష్టవంతురాలివి. ఇంకేం రాయ్యను?

బావ.'

విశాలమనస్సు వికసించేసరికి అంతా మించిపోయింది. ఆమె స్టేషను చేరుకునేసరికి రైలు వెళ్లిపోయింది! ★

కోడలు

కందుకూరి లింగరాజు

సంక్రాంతి పోటీలో రెండవ బహుమతిపొందిన కథానిక

స్కూల్ ఫైనలు చదువుకున్న కోడలు క్రొత్తగా కాపరానికి వస్తోంది అన్న వార్త..., అంతవరకూ నడిచిన స్వేచ్ఛ, పెంకితనాలు, మంకుపట్లు, మాట కొట్టాయింపు వగైరా వందల విషయాల్లో ఏయే మార్పులు వస్తాయో అన్న భావన, కుతూహలం, రాజేశ్వరమ్మకూ, ఆవిడ ఇద్దరి కూతుళ్ళకూ మనసుల్లో మెసలింది.

ప్రత్యేకంగా, తను చాకలి పద్దు వేసే వరకూ చదువుకున్న జ్ఞానం, దానికి తోడుగా, అత్తవారింట కాలు పెట్టినది మొదలు ఆడపడుచు పోరులో జీవచ్ఛవమై పోయి, నేటి కాలానికి ఇంక కోడలు కాస్త చెయ్యి ఆసరాగా వుంటుంది అన్న ఆశ కలిగింది రాజేశ్వరమ్మకు. అది కూడా చదువుకున్నది; వింటుందో వినదో అన్న ఆందోళన కమ్మేసి, తన జీవితం ఎప్పుడూ ఒకళ్ళకు సేవచేసుకోవడంతోటే సరిపోయింది, ఇప్పుడు ఎవళ్ళో వచ్చి చేస్తారన్న ఆశ పెట్టుకోవడం ఉత్తి మౌఢ్యం, అనుకుంది. ఏమైనా పెళ్ళి నాలుగురోజుల్లోనూ కలిసి మెలిసిపోయిన కోడలుపిల్ల, తప్పకుండా చెయ్యిదోడుగానే వుంటుందనుకోకుండా ఉండలేకపోయింది.

ఒక్క తీవ్రంగా ఆలోచించిన వారు ఇద్దరు ఆడపడుచులూ; పెద్దావిడ రమణమ్మ, రెండో ఆవిడ మంగమ్మ. ఇక ఇన్నాళ్ళూ సాగిన ఆటలు సాగుతాయో లేవో అన్న జిజ్ఞాసలో మునిగిపోయి, "నాన్నగారు ఎలాగైనా నావైపు" అనుకుని ధైర్యం చెప్పుకున్నది రమణమ్మ. ఇక మంగమ్మ, ఉండిపోయిన కోపం, మార్కుపట్టుల్లోని ఉత్కృతాలమీద ఆధారపడి, తన్ను తాను అనునయించుకుంది.

ఇంతకీ ఆలోచించకుండా వున్నది అనంతయ్యగారు ఒక్కరే.

ఆ ఏకాదశినాడు కోడలుపిల్ల రానే వచ్చింది. వచ్చేటప్పుడే రెండుబళ్ళ సామానుతో రావడంతో అందరూ ఆశ్చర్యపోయేరు. మంచాలతో పాటు సోలవరకూ సామాను తెచ్చుకుంది. లోపల రాజేశ్వరమ్మగారు, అనంతయ్యగారు కూడా ఆశ్చర్యంలో మునిగిపోయేరు, వియ్యపురాలి ఔదార్యంచూచి.



"కోడలు అన్న పదంలో ప్రతి అక్షరం ఎంత క్రూరంగా జీవితాల మీద పనిచేస్తుందో ఆమెకు అర్థం అయింది. తమ తర్వాత వంశం నిలబెట్టడానికి వచ్చిన లక్ష్మి అనుకుంటూనే ఉచ్చుల్లోకి దింపే పెద్దలు, తమ స్వాతంత్ర్యానికి ఏదో మిత్తిలా అడ్డుకుంటుందనుకునే చిన్నల పన్నాగాలు, అన్నీ అనుభవంలోకి వచ్చేయి. అవి ఎవరూ చేస్తున్నట్టుగా ఉండకనే ఆచరణలో పెట్టబడ్డాయి"

★ కోడలు ★

'చూచేరా! నేను అత్తవారింటికి వెళ్లినపుడు, ఆఖరుకు రిక్షాపక్షే సామానైనా పెట్టేరు కారు' అన్న అవహేళనంగానే, వస్తువు వస్తువు దగ్గరనుండీ పరిశీలించింది రమణమ్మ. మంగమ్మ మాట్లాడకుండా ఉండిపోయింది.

చూచినవాళ్ళు, ఇరుగుపొరుగులవాళ్ళు, వారం రోజులపాటు సామానుల విషయం విడ్డూరంగా చెప్పుకున్నారు. ఇంట్లో వున్న వంటలక్క, నోట్లో చింతకాయ పెట్టుకున్నట్లే. అలవలు పలవలూ అల్లేసి, "కోడలుగారి కేమమ్మా, బంగారపు బొమ్మ. సారెక్రిందే తెచ్చింది సరిపోయి, మిగిలిపోయేటట్టు" అని వాడల్లో సాటేసింది.

దీంతో ఆ నెలరోజులూ వచ్చిన వాళ్ళందరికీ అడపకుచులు కోడల్ని చూపించడం, అత్తగారు సమయజ్ఞతగా 'నమస్కారాలు పెట్టమ్మా' అనడం, 'ఓసారి వీణవాయించు వింటారు' అనడం, సంగీత కచ్చేరీలు, దాంతర్వాత సారెలో వచ్చిన మిఠాయి పంపకాల్తోటి, తెలియకుండానే రోజులు గడిచిపోయేయి.

ఇంతస్కూలు ఫైనలుపిల్లా, నోరు కుట్టేసుకుని ప్రదర్శనబొమ్మ అయిపోయింది! రోజూ పెట్టెతియ్యడం, చీరలు చూపించడం ఓ వందసార్లైనా చేసేది. రవ్వలదుద్దులు తడిమి తడిమిచూచే పేరంటాళ్ళతో కొన్నాళ్ళకి అయ్యవార్లంగారి ముత్తైదునైపోతానేమో, అనుకుంది. అయినా మాట్లాడనేలేదు; ఈ అర్థంకాని పరిస్థితుల్లో,

ఆరోజుల్లో 'ఆతని'కి ప్రక్కగా కూర్చుని భోజనం చెయ్యడం అంటే వల్లమాలిన సిగ్గేసేది. అదిచూచి రమణమ్మ నవ్వడం మరింతగా శ్రుంగతీసేసేది.

"ఒదినగారూ, మా ఇంట్లో అలవాటు, కూర్చోండి" అనేది రమణమ్మ.

"స్కూలుఫైనలువరకూ ఇల్లా సిగ్గుపడుతూనే ఎల్లా చదివేరండి" అని మంగమ్మ అండంతో, తప్పనిసరే అయ్యేది. ఏదో తిన్నట్టే ఉండేదికాదు కోడలికి, అలవాటు లేక.

"మా పెద్దనాన్నగారు, ఆడవాళ్లి క్రింద జమ కట్టేసి ఇల్లాంటి అలవాట్లు చెయ్యలేదండీ" అందామనుకునేది. అయినా ధైర్యం చాలక 'ఆతని'వైపు చూసి, కళ్ళల్లోనే భావం కుదించుకునేది.

అనంతయ్యగారూ రాజేశ్వరమ్మా ఈవిషయాలన్నీ నవ్వుకుంటూనేచూచి, రహస్యంగానే, "అపూర్వపురోజుల్లో ఇవన్నీ ఉంటే నేను చేసేసేదాన్ని" అని ఆవిడా, 'పోనీ ఇప్పుడు చెయ్యకూడదూ?' అన్న తలంపులో ఆయనా పులుకూ పులుకూ మనుకునేవారు.

ఆరోజుల్లో ఇంకా ఎన్నో సంతోష విషయాలు సమిష్టిగానే జరిగేయి. ఒక్కదాల్లోనూ కోడలికి తను చాకిరీచెయ్యడానికి వచ్చేనన్న భావం తట్టలేదు. ఆడపడుచులు ఇంత మంచిగా వుంటారా అన్నది ఆశ్చర్యం కలిగించింది. దానికన్న అత్తగారికి మాటలు వచ్చా, రావా అనుకుంది.

'ఆతని'వైపు ఆరాధనతో చూచేది. ఆ మాట్లాడకుండా, ఎక్కువ మౌనం వహించే, ఆయనలోని నిగూఢం తెలియకనే ఉండిపోయింది.

"జీవితంలో అదృష్టం అన్నది కోరుకుంటే రాదు. దానంతట అదే వలచి వస్తుంది. ఈనాడు ఈ నూత్న పరిసరాలల్లో ఉండి, పుట్టి పెరిగి పెద్దయినవాతావరణాన్ని మర్చిపోతున్నానేమో అనిపిస్తుంది. కొన్నాళ్ళకి పూర్తిగా మైకం క్రమ్మి మర్చిపోతానేమోకూడా..." అని తల్లికి వ్రాసింది.

ఉత్తరంఅంతా అయినతర్వాత 'ఆయన' చేతుల్లో పెడుతూనే చిలిపిగా నవ్వింది. ఉత్తరం చదివేడు. లోపల్లోపలే "ఈ ప్రతి చిన్నవిషయాన్ని కూడా మర్చిపోలేని, ఈ పిచ్చిపిల్లని ఎల్లా పెంచుతానో" అనుకున్నాడు.

ఆ పెళ్లిచూపులనాడే అనుకున్నాడు: తండ్రి లేనిది; ఆమె జీవితంలో లోటులన్నిటికీ తనే, అన్న భావంలో పడిపోయేడు.

నెలలు జరిగేసరికి, తక్కిన విషయాలన్నీ ఎల్లా వున్నా, వంటింటి లక్ష్మీమీదమాత్రం పూర్ణ అధికారం, ఇచ్చేనని ఒకళ్లు చెప్పకుండానే కోడలు చేతిలోకి వచ్చేసింది. అత్తగారి వెనకాల చేదోడుగా వుంటుందని, తనే అన్ని పనులు చెయ్యడంతో, పురమాయింపుల అధికారం చేతికి తగిలింది.

ఇకనుండి ఏ పదార్థాలు చెయ్యాలి, ఏం కావాలి?, ఎల్లా తయారుచెయ్యాలి, అన్నవాట్లతో, పాలు, పెరుగు, పప్పులచిక్కాల బీరువా తాళం చెవి కూడా రొండిలోకి వచ్చింది. దీంతో క్షణం తీరిక లేకుండా ఉండిపోవలసివచ్చింది.

ఇంతవరకూ విచ్చలవిడిగా వదిలివెయ్యబడి, జమాలెఖ్ఖలు లేకుండానే అవిచ్ఛిన్న సామ్రాజ్యంగా సాగిపోతున్న వంటింట్లో ఆటకాయింపు జరిగి, ఓ విశమైన అదుపాజ్ఞల్లో పడి, కట్టుదిట్టాల్లోకి వచ్చినందుకు, ఆ పని ఇప్పుడు కోడలు చేతుల్లోనే, పకడబందీగా జరుగుతోందని అనంతయ్యగారు సంతోషంతో ఊగిపోయారు. "కోడలూ, ఇన్నాళ్ళనుండీ చెలరేగిపోయే వంటావిడని ఓ దారికి తెచ్చేవు. ఎన్ని సామానులు పోయేయనుకున్నావు. చేసేదాంట్లో సగం గోడలు దాటేవి...ఏదో నువ్వు...మీఅత్తగారు...ముక్కు మొఖం తెలియని మాలోకం..." అన్నారు.

దీనికి సిగ్గుపడిపోయింది. "అంతా అత్తగారు చెప్పేదేనండీ,.."

ఈ మాటలు నిజంగా రాజేశ్వరమ్మని సింహాసనంమీద కూర్చోపెడితే... "అల్లా ఘట్టిగా చెప్పు ఆయనకి..." అంది.

రమణమ్మ నవ్వుతూనే "అవును నాన్నారు...అమ్మ ప్రభుత్వంలో రోజూ రెండు కూరలు, పప్పు, పులుసు, రసం, ఉండేవి. ఇప్పుడు పప్పుపులుసు. అప్పడాలు తిని, పైత్యరోగులమై పోతున్నాం. ఏమంచారు ఒదినెగారు...?" అంది.


ఈమె మైసూరు
యువతి శాంత
రుచికరమైన
వంటకాలు
పెట్టితే, ఆమె భర్త
సంతసిస్తాడు
రుచికరమైన పదార్థాలు వండేది
తుషార్
విటమిన్‌లుగల
వనస్పతిలో
Tushar
తుంగభద్ర ఇండస్ట్రీస్ లిమిటెడ్., కర్నూలు
పరిశుభ్రంచేయబడిన తుషార్ నూనెకూడా లభ్యం కాగలదు

★ కోడలు ★

అందులోని హేళన అనుకరిస్తూనే మంగమ్మ "ఒదినగారి పెళ్ళిలో అప్పడాలు ఉల్లికేకుల్లా ఒత్తేకే...ఇకనుండి అల్లాంటివి తినవచ్చే" అంది...

ఏమనాలో తెలియక కోడలు అత్తగారి వైపుచూచింది. అదిదా "పిళ్ళ మాట్లకేం తల్లీ...అల్లాగే అంటాయకే" అంది.

అయినా సముదాయింపుకాలేదు. కోపం వచ్చింది. ఆ ఉడుకులోనే వెళ్ళి..."లక్ష్మి! ఇవ్వాళ బంగాళాదుంపలకూర, కొబ్బరి కాయ పచ్చడి, చారు, సాంబారు పెట్టు" అని సామాను ఇచ్చేసింది.

ఈ చర్యవల్ల మనస్సుకు శాంతి వచ్చిందనుకుంది. అయినా రమణమ్మ మంగమ్మల కిరువురికి లోకువఅయిపోయింది అన్న భావం కలిగింది. వాళ్లు తనకన్న చిన్నవాళ్లు, అనుకుంది.

'ఆతను' ఆశ్చర్యపోయేడు. ఆ రోజు మాత్రం, 'నీ ఉనికికోసం, ఇంటికోడలిని బానిసగా చేస్తున్నావు నీ తండ్రికి, తల్లికి, చెల్లెళ్లకి,' అని మనస్సు బోధించింది. కొంచెం బాధపడ్డాడు.

సంవత్సరాలు ఉద్యోగంలో గడిచిన కొలదీ, నేర్పు, చాకచక్యం వస్తుందంటారు. అల్లాగే కోడలికి ఇంట్లో ప్రతిపరిస్థితిలోని మూలము అవగాహన అయ్యింది. దాంతో చాకిరీ ఎక్కువైంది. ఆ మొట్టమొదటి నెలల్లో పనిలేకుండా ఉన్న రోజులు, ఇప్పుడు తీరికలేని రోజులకు ఎంత తేడా వుందో అనుకుంది. అయినా, ఎవరైనా తన మీద అధికారం చేస్తున్నారేమో అనుకుంటే, ఒకళ్ళూ కనిపించకనే పోయేరు! అత్తగారు మాట్లాడరు. ఆడపడుచులు నవ్వుతూనే వేళాకోళాలు చేస్తారు. మామగారు ప్రత్యేకంగా పిలిచి 'ఏం కావాలి' అని అడుగుతూనే వున్నారు. 'ఆయన' మాటలురాకుండా వుంటూనే రాత్రిళ్ళు మర్చిపోయేట్లు చేసేస్తారు..ఇంకా ఏం కావాలి అనుకుని, భోజనంలో తృప్తిపడిపోయింది.

ఆరోజు అల్లుడుగారు ఉత్తరం వ్రాసేడు-తను మునసబీ సెలక్షన్లో సెలక్టు అయినట్లు. అందరూ సంతోషించేరు. ప్రత్యేకంగా రమణమ్మ పట్టపగ్గాలులేకుండా సంతోషపడింది. ఆ రాత్రి విందే జరిగింది.

రాత్రి పదకొండింటికి లక్ష్మి, తనూ భోజనానికి కూర్చుంటే మూలపురుషులొంచి చింతకాయ పచ్చడి తీసుకుని తిన వలసివచ్చింది. సావిట్లో పెంకులెగిరేటట్లు రమణమ్మ, తందానతాన అంటున్నట్లు మంగమ్మ, కబుర్లు చెప్పేస్తున్నారు.

"నాన్నారు మీరు డబుల్ కాట్ చేయించాలి. ఓగాడ్రెజ్ బీరువా, ఓ సోఫా సెట్టు, ఇవన్నీ ఆర్డరివ్వండి." అంటోంది రమణమ్మ.

"అవున్నాన్నారు. బావగారు ఉద్యోగస్తుని హోదాలోకి వచ్చేరుకదా మరి..." మంగమ్మ.

కోడలు తనూ అనాలనుకుంది- ఈ ఎంగిలి విస్తళ్ళమధ్య, అడుగూ పొడుగూ ఊడ్చుకుంటూ, జీతం మనిషి సరసన కూర్చుని... పైగా ఉద్యోగం, సద్యోగం లేకుండా, జలగలా వున్నట్టుగా తనూ, ఆయన...తల్చుకోలేక కుమిలింది. దుఃఖం వచ్చింది. కళ్ళమ్మట నీళ్ళు తిరిగేయి. సగంలో చెయ్యి కడుక్కుంటూ లేచిపోయింది. లక్ష్మి తెల్లబోయింది.

గదిలోకి వెళుతూనే "ఏమండీ! మీరూ ఉద్యోగానికి ఎందుకు ప్రయత్నించకూడదూ!..." అంది.

ఉలిక్కిపడ్డాడు. ఆ అడిగిన స్వరంలోని సప్తస్వరాల ఉద్దీపనకు, నరనరాలు తోడేసినట్లు అయ్యింది.

ఉద్యోగానికి ఎందుకు ప్రయత్నించకూడదూ? కోడలు అడిగినదాంట్లో నిండు నిజం నిబిడీకృతం అయ్యేవుంది. తనే ఇన్నాళ్లూ ఓ విధమైన బద్ధకస్తుని జీవితం అలవాటుచేసుకుని, పైకి ఆ వయస్సుమళ్లిన తండ్రికి ఆసరాగా వుంటున్నానని మెరుగు పెట్టుకున్నట్టు అనిపించింది. "అవును. కోడలుకోసమైనా తనూ ఉద్యోగం చెయ్యాలి" అనుకుని, రెండురోజులకతల ముహూర్తంపెట్టి, మద్రాస్ వెళ్లిపోయేడు.

* * *

అవ్వాళ భోజనాలదగ్గర అనంతయ్యగారు - "రామన్నపాలెం వెళ్లాలి, ఈదరపల్లి వెళ్లాలి, ఇద్దరు రైతులూకూడా ఎన్నిసార్లు పిలిపించినా రాలేదు. ఇక నేనే వెళ్ళాలి... బకాయి చాలావుంది..."

"అన్నయ్య వుంటే వెళ్లివుండునుకాని ..." మంగమ్మ సగంలో ఆగిపోయింది.

రమణమ్మ కోడలువైపు చూస్తూనే "అన్నయ్య అంటే రైతులందరికీ భయం. అయినాకాని ఒదినగారూ, అన్నయ్య ఎందుకు వెళ్లేడండీ?" అంది.

"నాకూ చెప్పలేదు" అంది కోడలు. కాని అది ఎవరూ నమ్మలేనట్టుగా, ఒకళ్లమొఖం ఒకళ్లు చూచుకున్నారు.

"ముసలివాళ్ళని ఒదిలేసి, ఎవళ్ళ దారి వాళ్ళు చూచుకోడానికి వెళ్ళేరు. పైగా భార్య కాపురానికికూడా వచ్చిందిగా..." అంది రాజేశ్వరమ్మ.

దీంతో కోడలు మొఖం తెల్లబడింది. తప్పిదం చేసినట్టుగా బాధ తెరతీసుకుంది. ఒక్క విషయం నిజమే. తను రాకపూర్వం అంతా ఒకటిక్రిందే ఉన్నారు. ఇప్పుడు తను కాలెట్టడంవల్లనే ఈ సమిష్టి కుటుంబానికి విచ్ఛిత్తి ప్రాప్తిస్తోందా? తనే కారణమా అన్న సమస్య బాధించింది. ఓవిధంగా ఇది లోకధర్మమే అనుకుని అనునయించుకున్నా, ఈనాటికి 'అతని' చర్యను ఎవరూ హర్షించనట్టే తడుతోంది.

"ఏదోరోజు వాడు వెళ్ళిపోతాడని, వాడి కాళ్ళమీద వాడు నుంచోడానికి ప్రయత్నాలుచేసి, సఫలుడౌతాడని అనుకుంటూనే వున్నాను. ఇంకా ఇక్కడ, ఈ క్రొత్త సంసారం సరిగ్గా దారిలో పడనేలేదు. ఇంత త్వరలోనే వెళ్ళిపోతాడు అనుకోలేదు నేను.." అందులో బాధంతా ఉట్టిపడినట్లుగా అన్నారు అనంతయ్యగారు.

"మీరే వెళ్ళారా" రమణమ్మ అంది.

"ఏంచేస్తాను. వెళ్ళకపోతే, తప్పదు..."

ఆయన సరిగ్గా భోజనంచెయ్యనట్టే కనిపించింది. మూడురోజులనుండి కీళ్ళనొప్పులతో బాధపడుతున్న విషయం జ్ఞప్తికివస్తే, కోడలికి, తను తనభర్తని అంత త్వరగా అడగడంలో తప్పేమైనా చేసేనేమోఅన్న భావన ఏర్పడింది. 'ఆయనా' సమాధానం చెప్పకనే వెళ్ళిపోయేరు. ఏమిటో అర్థం చేసుకోగలుగుతున్నానన్న ఇల్లు, ఈ విధంగా విచిత్ర దృక్పథాల్లోకి దారితీస్తుం దనుకోలేదు.

లక్ష్మి, తనూ ఆఖరున కూర్చున్నప్పుడు, "మీ మామగారికి ముద్దకూరలు ఇష్టం, రమణమ్మగారికి వేపుళ్ళు, మంగమ్మగారికి ప్రతీదాంట్లోనూ ఉల్లిపాయలు వెయ్యాలి. ఇక మీ అత్తగారికి ఏది వున్నా సరేనమ్మా...మీరు ఒచ్చినప్పటినుండీ..."

"ఏమైనా అనుకున్నారా?"

"ఏమంటారు? అందరూ మూతులు విడాయించుకునే తింటున్నారులెండి..."

మాట్లాడలేదు కోడలు.

"మర్చిపోయే. మీరే వారిని తరిమేసి ఉద్యోగం ఊళ్ళొస్కనేవరకూ రావద్దన్నారుటకో..."

"ప్రక్కవాళ్ళు అన్నారా?"

"అబ్బే! అది కాదండి. ఉన్నది, విన్నది, కన్నది కూడా అంతేకదండీ!"... ఉన్న తెలివితేటల్తో!

"అవును. వెళ్ళమన్నాను" అంది కొంచెం గుసుగ్గానే.

'ఆ' అంటూనే గోడకు చేర్లబడి, కాస్సేపటికి తేరుకుని, పురిషెడు నూనె పోసి అవకాయ కలిపేసింది.

ఒక్కొక్కటే అర్థం అయ్యీ అవనట్టే అయ్యింది కోడలికి.

రెండు రోజుల అవతల రమణమ్మ అత్తవారింటికి వెళ్ళిపోయింది.

* * *

ఆ వారం రోజులు ప్రయాణపు బడలికవల్ల అనంతయ్యగారు మంచంమీదనుండి లేవలేదు. రెండు రోజులు లంఖణం చేసేరు. మూడో రోజు పథ్యం పుచ్చుకున్నా మళ్ళీ ఐదోరోజుకు తిరగబెట్టింది. అదీ ఉధృతంగా వచ్చి, ఓ ఇరవై రోజులు మంచంమీదనుండి లేవనిచ్చింది కాదు. ఓ రోజు అర్ధరాత్రివేళ డాక్టర్ని పిలడంకూడా వచ్చేసింది.

అసలే మనిషి అర్భకం. పైగా వయస్సు మళ్ళింది. ఇరవైఐదు రోజుల లంఖణముల తోటి బడుగు అయిపోయేడు. ఒంట్లో ఎముకలన్నీ లెఖ్ఖపెట్టవచ్చన్నట్లుగా నీరసించిపోయేడు.

ఆ ఖంగారు పడ్డ రోజున కోడలు మొఖంచూపించలేకపోయింది. తను కారణంగానే 'ఆయన' వెళ్ళడం, సుఖంగా అన్ని పనులు 'ఆయన' చేస్తుంటే కృష్ణా, రామా అనుకునే మామగారే ఊళ్ళు వెళ్ళవలసి, బడలికలను తట్టుకోలేక మంచం ఎక్కడం, ఇంట్లో ఉన్న లక్ష్మి ప్రతీదానికి, తనే కారణం అన్నట్లు సూచించడంతో, ఆందోళన పట్టపగ్గాలు లేకుండా క్రమ్మేసింది. మామగారిని చూడ్డం అంటే భయంవేసింది.

అన్నాళ్ళూ అత్తగారు, ఆయనసేవల్లో మునిగిపోయి మాట్లాడనేలేదు. మంగమ్మ చూస్తూనే ఊరుకుంది. ఈ కావలసినవాళ్ళు, తనకి చెప్పకలిగిన వారూకూడా, మౌనంగా కూర్చుంటారెందుకూ అన్న ప్రశ్న బాధించింది ఎక్కువగా.

ఇంక భరించుకోలేక 'అతని'కి ఉత్తరం వ్రాసింది; 'వెంటనే ఓసారి రావలసింది'ని. ఆరోజుల్లో జరిగినసంగతులు వ్రాయనేలేదు; వ్రాయలేకకాదు, తను వ్రాయలేనన్న బలహీనతలో.

ఆ రోజుల్లో ఓ రోజున "వాడు రాలేదా..." ఆయన మగతలో కోడలు ఉండగా అన్నాడు. దీంతో బావురుమన్నట్టే, అత్తగారు "కోడలా; ఓ టెలిగ్రాం ఇప్పించమ్మా..."

నుంచోలేకపోయింది. గదిలోకి వెళ్ళేసరికి కళ్ళమ్మట నీళ్ళు తిరగేయి. "భగవాన్! నేనేం తప్పుచేసేనని, ఇల్లాంటి పరిస్థితులు కల్పిస్తున్నావ్..." అనుకుని ఏడ్చింది.

పైన చూచేవాళ్ళందరికీ కూడా ఆ తండ్రీ కొడుకుల మధ్య ఉన్న బంధాలు, విచిత్రంగా చెప్పలేనట్లుగా వుంటాయి. ఆయన 'అతనూ' కూడా ఎప్పుడూ మాట్లాడుకున్నట్లే కనపడదు. ఆ మాట్లాడినా వంశపారంపర్య వైషమ్యాలు రవులుకుంటున్నట్టుగా, కస్సు, బుస్సు మన్నట్లే వుంటుంది. ఆయన ఎప్పుడూ ఘట్టిగా, ఎదటకు పిల్చిచెప్పడు. 'అతనూ' ఎదుటికి రానేరాడు.

ఇద్దరికీ సరస్వతీ నదిలాంటిది ఏదో వుండే వుంది. పనులుమాత్రం, ఆయన అనుకున్నట్టుగా 'అతను' చేస్తాడు. అవి అయిపోతూనే వుంటాయి 'అతని' ఆధ్వర్యంలో, పైకి కనపడకుండానే.

పైవాళ్ళందరూ 'అతనిమాట అంటేనే భయం,' 'ముసలాయినను ఏడిపిస్తాడు,' 'ఎప్పుడూ ఆ గదిలోనే మ్రగ్గిపోతూ వెధవ కథలన్నీ వ్రాస్తూ వుంటాడు,' ఇల్లా అనుకుంటారు.

అర్థంకాని, భాష్యం చెప్పలేని, అనురాగం వాళ్ళిద్దరిమధ్యా ఉండిపోయింది.

ఇది ఈరోజున అర్థం అయినట్లే అనిపించింది కోడలికి—'వాళ్ళిద్దర్నీ ఎడబాటు చెయ్యడం కష్టం. అది వట్టి మూర్ఖత్వం. ఒకటి చెట్టు, రెండోది దాని ఫలం' అన్నట్లుగా.

మర్నాడు లక్ష్మి చాటేసింది. "అనంతయ్యగారు కొడుకోసం బెంగపెట్టుకున్నారు. రాత్రి పలవరించేరుట కూడాను. కోడలు తరిమివేసిందికాని, లేకపోతే కలకలాడే ఇల్లు, ఇల్లా అవుతుందా? - బెంబేలుపడి, అంపకాలకోసం, టెలిగ్రాం ఇచ్చేరుట..." ఆ వరసలో.

కోడలు చెవుల్లో ఇవి సోకేయి. భోజనాల దగ్గరనే "లక్ష్మీ! ఎవరి హద్దుల్లో వాళ్ళు ఉండడం మంచిది. అది శ్రేయస్కరం కూడాను. అది దాటితే, ఉండినవాళ్ళకీ, ఉంచుకున్నవాళ్ళకీ కూడా కష్టంగానే వుంటుంది.

"తగుదునమ్మా అని, జడ్జీల్లా...ఋణపడవలసిన ఇంటికి దూలాలు, వాసాలు లెఖ్ఖపెట్టి, ఇతరుల కళ్ళల్లో న్యూనపర్చాలని ప్రయత్నించడం మొదటికే మోసం ఏర్పడుతుంది.

"ఇవ్వాళ ఇరవైఎనిమిదో తారీఖు ఒకటో తారీఖుతో నువ్వు పని మానెయ్యొచ్చు..." అంది.

దిక్కులు తెలియక కళ్ళమ్మట నీళ్ళు తిరిగేయి లక్ష్మికి...

★ కోడలు ★

రాజేశ్వరమ్మా, మంగమ్మా కూడా ఆశ్చర్యపోయేరు. సంతోషపడనూపడ్డారు. దాన్ని ఒదుల్చుకోవాలన్న కోర్కె చాలా రోజులనుండి ఉంది. అది చెయ్యలేక పోయేరు.

అయినా మంగమ్మ కళ్లల్లో 'రేపటి నుండి...' అన్న అనుమానం చూపింది.

'ఎవళ్ళింట్లో పని వాళ్లు చేసుకోవడంలో తప్పేముంది.' అన్నట్లు కోడలు ముఖంలో ధీమా కనపడింది.

ఆ ఒకటో తారీఖున అణాపైసలు లెఖ్ఖ పెట్టి లక్ష్మి చేతులో పెట్టేసింది.

"కోడలుగారు కొలొట్టిందమ్మా, మొదట 'ఆయన్ని', తర్వాత రమణమ్మని, ఆవెనుక నన్ను పంపేసింది. అయినా తొంగటి తే పోయేరు. మహామంచావిడి..." అని గొణు క్కుంటూనేపోయింది లక్ష్మి!

కోడలుకు నవ్వు వచ్చింది.

"మంచిపనిచేసేవు కోడలూ" అన్నారు అనంతయ్యగారు.

ఆ ఆదివారం 'ఆయన' మద్రాసునుండి వచ్చేసేరు.

*   *   *

రమణమ్మ శాల్మమ్మగారికి ఉత్తరం వ్రాసింది, ఐదోనెల వస్తోందని. ఆరోజు ఆవిడా అనంతయ్యగార్ల సంతోషం పట్ట పగ్గాలులేకుండా ఉబికింది. మొట్టమొదటగా వంశంలో మనుమడో, మనమరాలో పుడు తుంది అన్న ఆనందం వెన్ను విరుచుకుంది.

ఒకళ్లతర్వాత ఒకళ్లు ఆలోచనలు చేసేరు. సమిష్టిగా తర్జనభర్జన చేసేరు. నిర్ణయాలు లేకుండానే మేడలు కట్టేసేరు.

కోడలుకు ఇవన్నీ పైకి సమంజసంగా కనపడ్డా, తన్ని ఏదో వెలితిగాచూస్తున్నట్లు కనిపించింది. తన కాపురంలో వంశోద్ధార కుణ్ణి ఇవ్వలేనట్లు, ఇచ్చే ఆశలు లేనట్లుగా చూపులు ఉండిపోయేయి!

ఏదో న్యూనతపడ్డట్లే అనుకుంది. మనస్సు బాధించింది.

వెర్రిగా ఆలోచించడం తప్పు అని తెలిసి వున్నా, కోడలు ఆలోచించకుండా వుండ లేకపోయింది.

*   *   *

'ఆయన' ఇంటర్వ్యూకి అటు వెళ్లడం, ఇటు రమణమ్మగారికి నూడిదలుఇచ్చి తీసుకు రావడం ఒక్కసారి జరిగేయి.

ఈసారి రమణమ్మ రావడంతోటి ఆ ఇంట్లో నూత్నాధ్యాయం ప్రారంభమైంది. అందరూ ఒకరితర్వాత ఒకళ్లు, 'రమణమ్మకి ఏం కావాలో' అని క్షణక్షణానికీ అడగం, అవన్నీ ఘంటకు ఒకటి జ్ఞాపకంచేసుకుంటూ పురమా యింపులు చెయ్యడంతోటి సరిపోయింది.

ఉదయం ఆరు ఘంటలకు ముందే లేచి వంటింట్లో ప్రవేశిస్తే, రాత్రి పదకొండు ఘంటలవరకూ కూడా ఊపిరాడకుండా చాకిరీ చెయ్యడంతో సరిపోయింది కోడ లుకు.

మంగమ్మా, అత్తగారు కూడా పాలి పేరలకైనా రాకుండా, పురమాయింపు లతో కాలం గడిపేసేరు. ఒక్కొక్కసారి చెయ్యలేని నిస్సత్తువలో—'లక్ష్మిని,చాలా చిన్న విషయంమీద అనవసరంగా మానిపించే నేమో' అని తట్టేది. అయినా అందరూ మెచ్చుకున్నారు. ఆ మెచ్చుకోడం, ఇప్పుడు కచ్చడాలక్రిందే తయారైంది.

'ఆతను' ఉంటే, ఇంత శ్రమా మర్చి పోయివుండేది. ఆ రాత్రి ఒక్కర్తీ ఆ ప్రక్కమీద పడుకున్నప్పుడు, ఉన్మత్త రాత్రిళ్ళన్నీ కలలుక్రింద వచ్చేవి. ఇప్పుడు ఈ శూన్యంలో, రంగులు కలుపుకోవాలంటే పిచ్చిగా వుండేది.

క్షణికం, అవన్నీ తిరిగిరావు, అన్న భయం వేసేది. ఆ మొదటి రాత్రి తన ఉన్న తికీ, ఈనాడు తను ఉన్న స్థితికీ, కాలం మార్పు కలిగించింది. ఈనాడు ఇంటిల్ల పాతికీ, ఓ బానిస అయ్యింది. కోడలు అన్న పదంలో ప్రతీ అక్షరం ఎంత క్రూరంగా జీవితాలమీద పనిచేస్తుందో అర్థం అయ్యింది. తమ తర్వాత వంశం నిలబెట్టడా నికి వచ్చిన లక్ష్మి అనుకుంటూనే ఉచ్చు ల్లోకి దింపే పెద్దలు, తమ స్వాతంత్ర్యానికి ఏదో మిత్తీలా అడ్డుకుంటుందనుకునే చిన్నల పన్నాగాలు, అన్నీ కూడా ఇప్పుడు అనుభవంలోకి వచ్చేసేయి. అవి ఎవరూ చేస్తున్నట్లుగా ఉండకనే, ఆచరణలో పెట్ట బడ్డాయి.

ఇంత పతనానికి తన మంచితనమే కారణ మేమో అనుకున్నా, వాళ్ళ స్వంతతనం తను నిరూపించలేని విషయంలా తట్టి, తన మంచి తనాన్ని గూర్చి ఆలోచించడం కూడా మూర్ఖత్వం అని తోచింది.

ఆ రోజుల్లో మనస్సు పరిపరివిధాల ఆలో చనల్లో మునిగిపోవడంతో, తిండి తినలేక పోయింది. ఓ విధమైన న్యూనత, కుమిలిం పుల్తో బాధపడింది. నేను బానిసఅయ్యేనా? అన్న ప్రశ్న ప్రతీ చిన్న విషయంలో నూ ప్రశ్నించేది. "అవునోయ్ కోడలూ, నువ్వే. ఈ ఇంటి కంతటికీ పెద్ద బానిసవు.. నౌక రివి...చాకిరీచేసే యంత్రానివి" అన్నట్లు శూలాలు పొడిచేవి.

ప్రత్యేకంగా ఆరోజు వచ్చేసింది.

రమణమ్మకు నొప్పులు ప్రారంభం అయ్యేయి. నర్సు, డాక్టరమ్మ వచ్చేరు.

వాన్నిలాగా పెళ్ళికి అప్పుచేస్తానంటున్నాడు. ఇక పెళ్ళవడానికేం అభ్యంతరం లేదు

"పిల్లకి పిల్లాడు నచ్చక్క లేదేమిటి?" అని తారాజువ్వలాగ లేచింది వాళ్ళక్క.

"ఎవరైనా వింటే నవ్విపోతారు నోరు మూసుకుని ఉండు", అన్నది వాళ్ళమ్మ

"నేనైతే ఆవేళ వచ్చినాణ్ణి చేసుకోను," అన్నది అక్క.

"ఇహ దానికేం చెప్పకుంటారో మీరే చెప్పకోండి. చదివించారు కదూ చదువు! ఇదీ చదువు" అన్నది వాళ్ళమ్మ. నిలువునా నీరైపోయి నిర్ఘాంతపోయాడు వాళ్ళ నాన్న. ఏడుస్తూ అవతల కెళ్ళిపోయి కూర్చుంది వాళ్ళక్క.

"నెమ్మదిగా దానికి నచ్చ చెపుతానులే," అన్నాడు వాళ్ళ నాన్న.

నాలుగైదురోజులైయాక పెళ్ళివారిదగ్గర కెళ్ళి వాళ్ళనాన్న తిరిగి వచ్చాడు వాళ్ళ నాన్న మొహం చూడగానే, "కుదరలేదు కదూ? మీ మొహమే చెపుతున్నది. అమ్మాయి మొహానికి అంత అదృష్టంకూడానా?"

"వాళ్లు అయిదంకెమీదున్నారు, అంటూ నాన్న చతికిల్లా పడిపోయాడు.

"శని విరగడైపోయింద"న్నాదిఅక్కయ్య

వాళ్లయిదంకెమీదున్నారంటే అర్థం ఏమిటో వేణుకి బోధపడలేదు. అక్కయ్యనొకసారడిగితే కసిరింది. దానర్థం ఏమైనా, వాళ్లయిదంకెమీదున్నారంటే పెళ్లికాదన్న మాట అనుకున్నాడు.

సుబ్బమ్మగారింటికెళ్లి సుబ్బమ్మగారితో సహా వాళ్లమ్మ వచ్చింది ఇద్దరూ కూర్చుని అక్కయ్యకి వేషం వేస్తున్నారు. వాళ్లాడుకుంటున్నమాటలూ, వాళ్లు పడుతున్న పాట్లూ వేణుకి కొత్తకాదు. ఏ పెళ్లికొడుకు వచ్చినా వాళ్ళనుకుంటున్న మాటలు ఒక్కలాగే ఉంటున్నాయి

మళ్ళా పెళ్ళికొడుకు వస్తాడు. పెళ్ళికొడుకు వెళ్తాడు. అక్కయ్యకి పెళ్లిమాత్రం కాదు - అనుకున్నాడు వేణు.

వెనకొచ్చిన మగపెళ్లివారిగురించి వేణుకి జ్ఞాపకం వచ్చింది. ఆ పెళ్లివారిని, వాళ్లమ్మా, నాన్నా, సుబ్బమ్మగారూ, చుట్టుపక్కలనున్నయిళ్లవారందరూ చెడామడా తిట్టుకున్నారు. ఆ పెళ్లివారంటే వేణుకూడా పట్టలేని కోపం వచ్చింది. ఆ పెళ్లికొడుకుకాని కనపడితే వెనకనుంచి రాయుచ్చుకొని నెత్తిబద్దలైయేటట్టు కొడదామని వేణు అనుకున్నాడు. ఆ పెళ్ళికొడుకు వచ్చిచూసి వెళ్లేడు అతర్వాత వాళ్ళ ఆడవాళ్లు వచ్చిచూసి వెళ్లేరు. ఆ ఆడవాళ్లన్నారట. అక్కయ్యకి సంసారివాటం లేదుట. సానిపాపలాగుందిట ఇంత చదువుకున్న కోడలు, ఇంత సానిపాపలాగున్న కోడలూ నాకెందుకు బాబూ అందిట ఆవిడెవత్తో. అది మొగుడికి వండిపెడుతుందా? నాకు చేసి పెడుతుందా, అందిట. ఆవిడ ఆమాటలన్నీ సుబ్బమ్మగారిదగ్గరే అందిట!

వేణుకూడా అందరితోపాటు కోపం



"రంగుల బొమ్మల కొలువుల
పొంగే కూతుళ్ళు" (రజని)

—ఫొటో: ఉప్పలూరి వెంకట శ్రీనివాసరావు.

★ వైవాహికం ★

వచ్చింది. వాళ్ళక్కయ్యకి వేషం లేనే లేదు. పెళ్ళికొడుకు వొచ్చినప్పుడే ఎరువు సొమ్ములూ, బట్టలూ తెచ్చి వేషం వేయిస్తున్నారు. ఇంటిదగ్గిరక్కయ్య ఎప్పుడూ అలుగుడ్డలే కట్టుకుంటుంది. అక్కయ్య దగ్గిర ఎంత మొత్తుకున్నా వాయిల్ గుడ్డలు మున్నవని, దుక్కలాంటి చీటీగుడ్డలు తెస్తాడు వాళ్ళనాన్న. అవి కొత్తగా కట్టుకున్ననాడు పువ్వులతో మిలమిలలాడతాయి. చాకలాడికి వేసీవేయడం, ఆ రంగులన్నీ అలుక్కుపోయి కళ్లకలకగుడ్డలైపోతాయి. అక్కయెప్పుడూ ఆ చీటీగుడ్డలే కట్టుకుంటుంది.

అక్కయ్య పనీ-పాటూ చెయ్యలేదుట. వాళ్ల మొహం! వాళ్ళకేమీ తెలీదు. వాళ్ళమ్మ యింట్లోకి రానప్పుడు, వాళ్ళక్కయ్య ఏం వండిపెట్టినా వేణుకి అమృతంలాగుంటుంది.

అక్కయ్యకి మళ్ళా పెళ్లివారు వస్తున్నారట. వస్తారు; వెళ్తారు. పెళ్ళిమాత్రం కాదు అనుకున్నాడు వేణు

వాళ్లనాన్న వీధిలో నిల్చుని ఎదురుచూస్తున్నాడు "వస్తేరానీ", అనుకున్నాడు వేణు. ఆ పెళ్లికొడుకు ఎక్కడలేని పెళ్లికూతుర్లనీ చూస్తూ, ఎవతీ నచ్చక తిరుగుతున్నాడుట. ఎలాగైతే నేమి వాడు అక్కయ్యని చూడ్డానికికూడా వచ్చాడు. ఆ పెళ్ళికొడుకుని చూడగానే, "మరేం ఫర్వాలేదు", అనుకున్నాడు వేణు. వాడికన్నా మొట్టమొదటవచ్చిన కళ్లజోడబ్బాయే బాగున్నాడు. వీడుకూడా నలుపే. దానికితోడు మొహంనిండా గంట్లుకూడా ఉన్నాయి. 'ఈ వెధవ నచ్చినాడ్లో' వాళ్లక్కయ్య ఎలాగా ఒప్పుకోదనుకున్నాడు.

పెళ్లికొడుకు వెళ్లిపోయినతర్వాత, "పెళ్లి

కొడుకు నచ్చేడా?" అని అడిగేడు వాళ్ల నాన్న.

"నామాటకేం? దాన్నడగండి", అంది వాళ్ళమ్మ.

"నేను వాణ్ణి చూడలేదు", అన్నాది వాళ్లక్కయ్య. పచ్చి అబద్ధం ఆడింది. అది బుర్రొంచుకుని కూర్చోలేదు. పెళ్ళికొడుకుని లక్షసార్లు చూసింది.

"అదేమిటే ఆమాటలు! నీకోసం మళ్ళా అతడొస్తాడా?" అన్నాడు నాన్న.

"మీయిష్టాలే చూసుకోండి!" అంది అక్క.

"నాయిష్టమైతే అడిగేవు. ఈ సంబంధం అవాలని వెయ్యిదేముళ్లకి మొక్కుకుంటున్నాను. కల్లగాలిన డబ్బున్నవాడు. ఏ ఆడపిల్లతండ్రీ వాణ్ణి ఎంచలేడు. వాడొప్పుకుంటాడో ఒప్పుకోడో అని మనమే భయపడాలి", అన్నాడు వాళ్లనాన్న.

"ఆ మనసులో మాటేదో చెప్పేద్దూ", అన్నాది వాళ్లమ్మ.

"చెప్పేనుకదూ? ఇక నేమిటి చెప్పాలి", అంది అక్కయ్య.

"నేను చెప్పనా?" అన్నాడు వేణు.

"ఏడిశావు వెధవా!" అన్నాడు వాళ్ళ నాన్న.

"అక్కయ్య పానిపాపలా గుండనేనా అంటారు. లేకపోతే ఏదం కోమాదన్నా ఉంటారు", అన్నాడు వేణు.

"ఛీ వెధవా నోర్మూయ్యి," అన్నాది అక్క.

"ఓరి వెధవా!" అన్నాడు వాళ్లనాన్న. ఛెళ్లుమని వాళ్లమ్మ ఒక్కటేసింది.

కళ్ళమొయ్యి ఏడుపొచ్చింది. గొంతు కెత్తి ఏడవడానికి సిద్ధంగా ఉన్నాడు. ధడీమని వీధి తలుపు తోసుకుని వాళ్ళ మేనమామ వచ్చేడు.

"పండా? కాయా?" అని ఆత్రుతతో అడిగింది వాళ్లమ్మ. వాళ్ల మావయ్య పెద్ద గొంతుకలో ప్రారంభించేడు.

"పెళ్లికొడుక్కి పిల్ల నచ్చింది. మనం యివ్వగల్గిన కట్నం, లాంఛనాలమాట ఎత్తేసరికి అది మీ సంతోషమే అనేరారు. ఇవాళ్ళకి మనమ్మాయికి కళ్యాణరేఖ బయటపడ్డాది. ఒక్కటే చిక్కొచ్చింది. వాళ్లు మాఘమాసందాకా ఉండరట. ఈ శ్రావణంలోనే పెళ్లిముహూర్తం పెట్టాలిట. అది మాత్రం ఖండితంగా చెప్పేరు. మనం తూగగలిగినా తూగలేకపోయినా శ్రావణంలోనే చేసి తీరాలి".

"నిజంగానే!" అని మహా ఆత్రుతతో ప్రశ్నించేడు వాళ్ళనాన్న.


"నిజంగా. హాస్యమాడతానా బావా!" అన్నాడు మావయ్య.

"మా చల్లనిమాట చెప్పేవు నాయనా. అల్లుడింట్లో కాలు పెడతాడా అని వెయ్యి తపస్సులు చేస్తున్నాను", అంది వాళ్ళమ్మ.

"పెళ్లి సంబంధం కుదిర్చినట్టే కొంత



సంక్రాంతి కోళ్ళ పందెం



"నిగిడిన రెక్కల కండలు
తెగు పందెపు కోళ్ళూ" (రజని) —చిత్రం: వి. పూర్ణానందశర్మ.

☆ ప్రజాహితం ★

అప్పుడూడా నువ్వే కుదర్చాలి బావా", అన్నాడు నాన్న.

"సమయం రావాలిగాని అన్నీ వాటంతట వే కుదురుతాయి. మరేమీ బెంగపెట్టుకోకు", అన్నాడు మావయ్య.

పెళ్ళి కుదరడం వాళ్లందరికీ సంతోషంగా ఉంది. వాళ్ళక్కయ్యకూడా సంతోషంగానే కనబడ్డాది. అక్కయ్యొప్పుకుంటుందని వాడెప్పుడూ అనుకోలేదు. వాడనుకున్నదంతా తల్లక్రిందులైపోయింది.

అమర్నాడు వాడితో వాళ్ళక్కయ్య సరదాగా మాట్లాడుతోంది. పెళ్లికాదని వాడన్నందుకు మళ్ళా ఎవరూ వాణ్ణి సతాయించలేదు. అక్కయ్యకూడా మామూల్గానే అభిమానంగా ఉన్నది. వాడికి మాత్రం బెంగగా ఉంది. పెళ్లి త్వరగా కూడా చేసేస్తారుట.

"అక్కయ్యా, నేనొక్కణ్ణీ ఎలా ఉండడం?" అని అడిగేడు వేణు.

"ఒక్కడూ ఉండడ మేమిటిరా", అన్నది అక్కయ్య.

"నువ్వత్తారింటికెళ్లిపోవూ?" అన్నాడు వేణు.

"ఓరి వెధవా! నిన్నుకూడా నాతో తీసుకెళ్తానులే", అన్నది అక్కయ్య. ఆమాట అనగానే వేణు తలలో భారమంతా తగ్గి తేలికైపోయింది.

"నిజంగానే కదక్కయ్యా?" అన్నాడు వేణు.

"నిజంగా నేరా" అన్నది వాళ్లక్కయ్య.

ఇంకొక ధర్మసందేహం వాణ్ణి పీడుస్తున్నది. అయిదంకెమీదున్నారంటే ఏమిటని అడిగితే అక్కయ్య చెప్పిందే కాదు. వాడికి అడగాలనే, ఉందికాని అడగడం మానేసేడు. ఆ 'వెధవ చచ్చినాణ్ణి' చేసుకోనని ఆ మొదటిసారిగా వచ్చిన పెళ్లికొడుకుని కొట్టిపారేసింది. మరి ఈ గంట్లమొహం వాణ్ణి ఎందు కొప్పుకుందీ?

ఒప్పుకోనూ ఒప్పుకుంది. శ్రావణమాసంలో మంచి ముహూర్తం పెట్టడమూ అయింది. పెళ్లికాదని వాడు నిర్ణయించుకొంటే పెళ్ళయిపోతున్నాది.

శ్రావణమాసమూ వచ్చేసింది. పెళ్లి దగ్గిర పడుతున్నకొద్దీ అమ్మకన్నా నాన్న మరీ దిగాలుపడిపోతున్నాడు. అమ్మదాయంటే కొనేవాడు లేడు! అప్పిచ్చేవా డసలే లేడు!

పెళ్లికి కావలిసిన విశ్వప్రయత్నం అవుతున్నది పెళ్లిపనుచెయ్యడానికి అత్తయ్యా పిల్లలూకూడా వచ్చేసేరు. బూడిద గుమ్మడి కాయలకి వాడిచేతే గంట్లు పెట్టించి ఒడియాలు పెట్టేరు. రాత్రి పన్నెండుదాకా అప్పడాలు ఒత్తేస్తున్నారు.

ఒకనాడు మావయ్యా నాన్నా పెళ్లివారికూరు బయల్దేరేరు. ఆవేళ వేణు సంతోషానికి మేరలేదు. మాఘమాసంలోతప్ప శ్రావణంలో పెళ్ళిచెయ్యడం మాతరం కాదని చెప్పడానికే వెళ్లేరు. కొనేవాడు లేడు! అప్పిచ్చేవా డసలే లేడు! ★

జీవనరాగం

అన్నయ్యా వదినా చిలకా గోరింకల్లా ఉంటారనుకుంది రాధ. వాళ్ళని దేవతల్లా చిత్రించుకుంది మనస్సులో. చూడగా చూడగా తన ఊహాలు చిత్రంగా మారుతున్నాయి. అన్నయ్య ఇంజనీరింగు పరీక్ష పాసయేడు; రేపో మాపో ఇంజనీరు. వదినా చదువుకుంది. మరేమో అంత కొడినిపాటుగ మసలుతున్నారు. వదిన ఏమనుకుంటుందో, కొంచెం లోతుగా అడిగితే మనస్సు తికమక పడింది. అన్నయ్య గదివైపుకు రెండడుగులు వేసింది. ఎదురుగా వదిన కనిపించింది. ఆవిడ ముఖం నలిగిపోయిన పువ్వులా ఉంది. ముఖం తిప్పుకుందుకు ప్రయత్నించింది. రాధ ఆవిడముఖంలోకి చూస్తూ చిరునవ్వు వెలిగించింది, వదిన నవ్వింది. రాధగుండెల్లో చిన్న మతాబు వెలిగింది.

ఇద్దరూ గదిలో ఎంతోసేపు కూర్చున్నారు. ఎప్పుడూ లేని కబుర్లు దొర్లేయి. ఎన్నో విషయాలు స్నేహితులు, సినిమాలు సహితం. అయినా రాధ వెళ్ళగించాలనుకున్న కబుర్లకు వీలు చిక్కలేదు. సరూ సంతోషంగా ఉంది. రాధతో ఇంకా కబుర్లాడాలనుకుంది. అత్తగారి కేకలు పెరట్లోంచి వినిపిస్తున్నాయి. ఇద్దరూ అవతలికి పరుగెత్తేరు.

రాత్రయింది. అందరూ నిద్రపోతున్నారు. రాధకు నిద్ర పట్టడంలేదు. అన్నయ్య గదిలోంచి వెలుతురు వస్తూంది ఇంకా. నెమ్మదిగా కిటికీవైపుకు చేరింది. అన్నయ్య సిగరెట్టు కాలుస్తూ రాతుసుల్లా చూస్తున్నాడు. సరూ భయంగా చూస్తూ తలుపుదగ్గర్నే నుంచునుంది. అన్నయ్య విగ్రహం కరుకుతాడేమో అన్నట్టుగా ఉంది. ఏమైనా అడిగితే ఏం చెప్పేది? వెనక్కి వెళ్లిపోయింది భయంగా. ఎటు ఒరిగి నిద్రపోదామన్నా, ఉడుకుతున్న హృదయం కుంపటి కట్టుకున్నట్టుగా ఉంది. కలత నిద్రలో కుమిలిపోయింది. ఎప్పుడు నిద్రపోయిందో తనకే తెలీదు, సరూ తట్టి లేవగొట్టేవరకూ—

“ఏం రాధా నిద్దట్లో ఏడుస్తున్నావేం... ఇటు చూడు...”

“నే... నేం... లేదే” తత్తరపాటుగా లేచింది రాధ.

“ఏదో పాడుకల వచ్చింటుంది... .”

“ఏమో, ఏం కలో,... బ్రతుకంతా కలే...”

సరూ ఏదో అనబోయి, పెదిమలు కదిపి ఊరుకుంది. రాధను నిద్రపొమ్మని మెల్లిగా కాళ్ళీడ్చుకుంటూ బరువుగా నడిచింది. అరె! ఇంకా నిద్రపోలేదే వదిన, అని రాధ మగతలోంచి లేచింది. వదిన అప్పటికే గదిలోకి అదృశ్యమయింది.

“స్వర్ణ”

బయట వెన్నెల పుచ్చపువ్వులా వికసిస్తున్నది. అందని అమృత స్రవంతిని చూస్తున్నట్టుగా వెన్నెలలోకి చూస్తూ కూచుంది రాధ. కునుకు రాలేదు. మెదడులో ఆలోచనలు మండిస్తున్నాయి. ఆమె చిన్న బుర్రకు ఇంత చిచ్చు భరించరానిదిగా ఉంది. చిన్నప్పుడే వైధవ్యం, చెప్పుకోలేని బాధలు. మొండిగా బ్రతుకుతున్నది. అన్నయ్య వదినా ఇద్దరూ సరదాగా ఉంటే వాళ్లను చూచి సంతోషించడం తన బ్రతుక్కి కొంచెం సరదా అనుకుంది. కాని వాళ్ళ బ్రతుకులు, సంతోషంగా గడవడం లేదేం? ఆలోచనలతో తెల్లవారింది. ఈ విషయం వదిన్నడిగి తెలుసుకోవాలి.

రాధ సరూకంటె చిన్నదే. చిన్నతనంలోనే సౌభాగ్యం బుగ్గయి రాధ జీవచ్ఛవంలా బ్రతకడం సరూకు ఎంతో జాలి కలిగించింది.

ఇద్దరికీ గాఢస్నేహం ఏర్పడింది. సమిష్టిగా తమ బాధల్ని మిళితం చేసుకుని ఊరడించుకునేంత దగ్గరగా రెండు హృదయాలూ కలిసేయి. బాధలున్న వాళ్లు ఎంతకాలం మనసుల్లో ముడుచుకు ఉంచుకోగలరు!

* * *

భోజనాలయేయి. సరూ బావి పక్క చీకట్లో నక్షత్రాల్ని చూస్తున్నది. కళ్లల్లో నీళ్ళు తిరిగేయి. దుఃఖం లావాలా ఉబికింది. ముఖం ఎర్రనయింది, పొర్లుకున్న దుఃఖాన్ని అణచుకుని ఏడుస్తున్నది. రాధ పసికట్టి పక్కకు చేరింది. తొందరగా ఏమీ మాటాడలేకపోయింది. సరూ కళ్ళనీళ్ళు తుడుచుకుంది.

“ఏడిస్తే ఏంలాభం వదినా...” ఓదార్చింది. “ఇంతకంటే చేసేదేముంది, ఆడదాన్నయ్యేక...” నిట్టూర్చింది సరూ.

“ఆగు. నేను మెల్లిగా అమ్మతో చెప్పి చూస్తానులే...”

“చెప్పేదేముంది రాధా.” ముఖం కొంచెం బాధగా చిట్లించుకుంది.

“మరీ,......” రాధ ఏదో అనబోయింది.

“మరింకేముంది చెప్పు, ఇంత హృదయంలేని వాళ్ళఇంట పడతానని కలలోనైనా అనుకోలేదు...” దుఃఖం ఇనుమడించింది. రాధకామాటలు బాధ కలిగించినా సరూకు దగ్గరగా కూచుంది.

“మీ నాన్నను చూడ్డానికి వెళ్ళుదూ గానిలే, ఉపాయం ఆలోచించకుండా ఏడుస్తూ కూచుంటే ఏం లాభం. మంచి ఆడదానివే...” కులాసాగా నవ్వింది రాధ “...మీ నాన్నకు మరో ఉత్తరం రాద్దాం. ఆయన కిప్పుడు కులాసాగానే ఉంటుందిలే, పద నిద్రపోదాం. అమ్మ చూస్తే మరీ లోకువగా ఉంటుంది...” ఇద్దరూ లేచేరు.

* * *

అన్నయ్య ఇంకా దీపం ముందు పురుగులా పుస్తకం పుటలు తిప్పుతున్నాడు కుర్చీలో కూచుని. అమ్మా నాన్న కబుర్లు చెప్పుకుంటున్నారు అవతల గదిలో, వాళ్ల బ్రతుకులో గడించిన లాభనష్టాల్ని లెక్కలు వేసుకుంటూ—

“ఈ బొక్క కొంప తప్పిందికాదు...”

“దీనికేం మా తాతలు కట్టించిన కొంప.”

“ఉంటేం ఊడితేం, ముసలికొంప. రామానుజులు చూడండి. ఎంత చక్కటి డాబా వేయించేడో, ఎండల్లో మేడ వేయిస్తాడట...”

“అతనికేం దేవాంతకుడు...”

“ఏదైనా కలిసి రావాలి...మనం ఎంత కొట్టుకు పుణుక్కుంటే మటుకు అయి తీరేదా...”

“రామానుజులుకేం, ఉన్నవాళ్ళంతా మగవాళ్ళేగా. ఖర్చులకైన లవరకూ లాక్కొచ్చేడు, ఒక్కొక్కన్నే. కుర్రాడికి పదివేలు చొప్పున పేలేసి పుచ్చుకున్నాడు



"వెన్నల కడిగిన దారుల
వెలసిన ముగ్గుల్లా" (రజని)

—చిత్రం : గోలీ శేషయ్య.

పై చదువుల పూచీతోటి..., ఇల్లూ కడతాడు, పొలాలూ కొంటాడు..."

"అవునండీ, పెద్దాళ్ళు ముగ్గురికీ రెండేసి ఎకరాలు పల్లం కూడా రాయించుకున్నాడు. అయినా అతని తెలివితేటలే వేరులెండి. భలే మంచి వ్యవహర్త..."

"మనవాడికోసం నేనేమన్నా తక్కువ ప్రయత్నం చేసేనంటావా?"

"అయినా పెద్దలు చెప్పనే చెప్పేరు, పది చెప్పులరిగేవరకూ తిరిగి మరీ జాగ్రత్తగా చేసుకోమని పిల్లల్ని. అయినా ఈ కట్నాల రోజుల్లో ఎంత బెట్టుగా ఉండవలసిందీ మనం మన వాడికోసం..."

"అయితే నేనేమన్నా తిరక్కుండా చేసేనంటావా, పోనీ నీ బుద్ధెక్కడికి పోయింది?..."

"ఆఁ... నేను మొదటే అన్నాను,... ఈ సంబంధం ఒద్దు మొర్రోమని ఇంజనీరింగు పాసైన కుర్రాడికి పదిహేను వేలు, మూడెకరాలూ; ఇరవై వేలూ, నాలు గెక

రాలూ అని ఎగేసుకుని రోజు రోజు గుమ్మ మెక్కేవాళ్ళను ఖాతరు చెయ్యక ఊబిలో పడ్డారేం కర్మం...?"

"సరే, ఇక ఏదో అయింది..."

"పీక తెగినంత అవమానం కాలేదు మరి? తాడూ బొంగరంలేని వెధవలికి హూత్ అంటే హాత్ అని వాలుతున్నారు వేలిస్తామని, మనకి నామర్దా కాదూ. ఏమంత తీసిపోయేడని ఈ సంబంధం కట్టేం? ఇంత ముదనష్టపుసంబంధాని కింత దూరమెందుకు, కలిసి కట్టుగా నాతమ్ముడుకూతుర్నే చేసుకోలేకనా..."

మూలకూర్చున్న సరూ చెవులు పెద్దవయ్యేయి. ఆ తమ్ముడికూతుర్నే చేసుకుంటే బాగుండేదిగా! పళ్ళు నొక్కుకుంది ఉక్రోషంతో. తారతమ్యాలు తెలీక, హృదయం లేని యంత్రంలా ప్రతినోరూ కట్నాలు అడగడం, పెళ్ళంటే కట్నాలని అర్రు చాచడం ఏం మానవనైజం? పౌరుషం కట్టలు తెగుతుంది. అత్తగారిమీదికి ఉరకాలని ఉద్రేకపడింది. రోజూ ఈమాటలు వింటూ కుమిలేకంటే ముఖాన్న అడిగి బుద్ధిచెప్పాలి, నిరసిస్తే నాన్నదగ్గరకే పోయి స్వేచ్ఛగా బ్రతకాలనిపించింది. తల నిమురుకుంటున్న నరసింహాన్ని చూచేసరికి ఉద్రేకానికి మడత పడింది. అతని ప్రేమకోసం ఇంకా నిరీక్షించాలనే ఆశ మెదిలింది. ఆ ఇంట్లో తను ఓడిపోకూడదు. ఓరిమి స్త్రీజాతి ఆయుధం. సరూ ధైర్యంతో నిగ్రహించుకుంది.

"ఏంచేస్తాం డబ్బుపోసి చదివించినా ఫలం దక్కలేదు..." ముసలాయన కొంచెం ముక్కుకున్నాడు.

"అవి మన తెలివితేటలులెండి ... ఇక ఏంచేస్తాం మరి.."

గదిలో నరసింహం ఉడికి నిప్పులు కక్కుతున్నాడు. శరీరంమీద జెర్రులు పాకుతున్నట్టుంది. కళ్ళల్లో నిప్పులు రేగుతున్నాయి. అవమానం ఆవహించి పీక్కుతిన్నట్టుంది. మిణుగురుపురుగులా నిలబడిఉన్న సరూని ఒక్కసారిగా రాక్షసుల్లా నలిపేయాలనిపించింది. ఆమె వైపుకు చూడకుండానే ఆలోచిస్తున్నాడు.

మళ్ళీ వినబడుతున్నాయి—

"వియ్యంకుడి కబుర్లకి బూరెలబుట్టలో పడ్డామనుకున్నారేం..."

"కాదు మరి, ఒక్కగాను ఒక్క కూతురు. ఉన్నదంతా మన కొరుగుతుంది కదా అని.. పోనీ అదైనా దక్కుడు లే..."

"కట్నంమాట తేలవేయడం నాకు నచ్చలా" విదిలించుకు మరీ చెప్పిందావిడ.

"అంతే..."

"ఎంత భూమి వ్రాస్తానన్నా రూపాయిలు రూపాయిలే, అందర్లో ఘల్లుమని రూపాయిలు చదివించిన ఘనం వేరు. నిజానికి రూపాయిలకున్న విలువ, మోజా భూమికుందా. అసలు నగదులేకుండా పెళ్ళి అందమేమి ఏడిసిందని." సరూ కళ్ళనుండి రక్తం ప్రవహించినట్టయింది. నోరు నొక్కుకుని ఏడ్చింది. మళ్ళా ప్రారంభం.

"ఇప్పు డెందుకీ కబుర్లు. ఈ మాటలు అప్పుడు చెప్పలేకపోయేవ్..."

"అయినా నా పెత్తనం ఒక్క విషయంలో చెల్లిందా అని..."

"ఇక నన్ను చికాకుపెట్టకు. పిల్లదాని పెళ్ళి నీ చేతులతో వెలగబెట్టేవుగా.. చెయ్యవలసిన పెత్తనం ఇక చెయ్యరాదూ..." ముసలాయన ముక్కుకున్నాడు.

"దాని కర్మ అలా కాలిందిగాని, ఎంత జాగ్రత్తగా ఆలోచించి చేసేను. ఈ రోజుల్లో పిల్ల ఎదిగింతరవాత బోలెడంత కట్నాలు ధారబోసి చెయ్యగలిగేవారేమో పాపం..."

రాధకు పక్కలో బల్లెం గుచ్చుకున్నట్టు వినిపిస్తున్నాయి మాటలు. ఆడపిల్ల బరువుగా తోచింది. కట్నాలకి అర్రులు చాచి బాధపెట్టడం, మరోవైపు ఆడపిల్లల్ని అంటు జాడ్యాల్లా వదిలించుకోడమే పుణ్యంగా, సంప్రదాయం పేరుతో గొంతుకలు కోయడం - ఏం చక్కటి ఆలోచనలు! గుండె తరిగినంతగా బాధపడింది. తల్లీతండ్రీ ఇంత రాక్షసుల్లా ఎలా తయారయ్యేరా అని ఆలోచించింది. ఆ చిన్న బుర్రకు పెద్దాళ్ళ మూర్ఖపుఆలోచనలుపిచ్చెత్తిస్తున్నాయి. మళ్ళీ తేనెటీగల పుట్టలా చెప్పుకుంటున్నారు—

"అయిందానికేం చేస్తాంగాని, ఆ ముసలాడికి సరిగ్గా ఎంత ఉన్నదీ కొస్త కరణం దగ్గరకెళ్ళి వివరాలు చూచుకురండి..."

"ఉన్న దెక్కడికి పోతుంది..."

"ఏమో ఎవడికెరుక, ఉన్నదేదో దక్కకుండా పోతుంది ముందే మేలుకోకపోతే..."

పాపం వదిన వింటే ఎంత కుములుతుందో. గోరుచుట్టుమీద రోకటిపోటు. నాన్నకు జబ్బుగా ఉందని వచ్చిన ఉత్తరానికే ఏడుస్తోంది. పైగా వీళ్ళమాటలు...

నరసింహం చేతులో పుస్తకం బల్లమీదికి జారబెట్టి లేచేడు. మూలనున్న ఉత్తరం కనిపించింది. ఎక్కణ్ణించి చెప్మా అని కంగారుగా తీసేడు. సరూ భయంగా నోరు విప్పింది - "ఉత్తరం వచ్చిందండి...మరిచిపోయా..." ముఖం ముడుచుకుని ఉత్తరం చూచేడు. నందకుమార్ వ్రాసింది. ఆత్రుతగా చదవడం ప్రారంభించేడు...

".. పెళ్ళికి రాలేకపోయినందుకు, నా దురదృష్టానికి విచారిస్తున్నాను. అనివార్య కారణాలు నీకు తెలుసు. క్షమిస్తావని నమ్ముతున్నాను. వధువు నీకు చాల తగి ఉన్నట్టు, నువు చాల అదృష్టవంతుడవని మన మిత్రులు, నాతో చెప్పారు..."

ఒక్కసారి అందరూ నరసింహానికి పూలమాలలు వేసినట్టుగా ఉంది. అంత మంచి పిల్ల భార్యగా దొరికినందుకు ఎంత గర్వం. ఒక్కసారి సరూవైపు మనసారా చూడాలనిపించింది. చూచేడు. సరూ భయంగా మిణుకు మిణుకుమంటూ చూస్తోంది, ఆరిపోతున్న దీపంలా. మళ్ళీ చదువుకున్నాడు "నేను తొందరలో తీరికచేసుకుని రావాలనుకుంటున్నాను. ఎందుకో తెలుసా? వరకట్నాల నిషేధానికి మొదటివాడిగా నినాదాలు చేసిన మహానాయకుడివల్లా చాటుగా కట్నం పుచ్చుకున్నావని మనవాళ్ళంతా చెప్పేరు. నువ్వు నాతో ఈ విషయం ఇది వరకు సీరియస్‌గా పందెంవేసినమాట మరిచిపోలేదని అనుకుంటున్నాను..." నందకుమార్ రాహువులా అడ్డంగా మాట్లాడుతున్నాడు. చటుక్కున ఉత్తరం మూసేసేడు. గుండె గుదికట్టినట్టనిపించింది. మంచంమీద ఒరిగి కళ్ళు మూసేడు, బలవంతాన. అవతల గదిలో మాటలు ఇంకా వినిపిస్తున్నాయి.

"ఆ ముసలాడు ఎంత గడుగ్గాయి కాకపోతే చూడండి..."

"ఏమో..."

"ఏమో, అని మట్టిబెడ్డలా ఉంటుబట్టే ఇలా జరిగింది..."

"అయితే, ఇక చేసేదేముంది.."

"ఇప్పుడేమైనా ఇంజనీరింగు చదివిన కుర్రాడికి కొంత కాకపోతే కొంతైనా గదు ఇవ్వమని అడిగి చూడండి, వాడి హోదాకి, పీక పోయినంత అగౌరవమని కూడా చెప్పండి. మరి కాదూ, వాడి తోటివాళ్లు అంతంత కట్నాలు తెచ్చుకుంటున్నారు. వాడుమట్టుకు తలెత్తుకు ఎలా తిరగ్గలడు. ఎవరైనా, మీ వాడికి కట్నమెంతిచ్చేరని అడుగుతుంటే నేనే బిక్కచచ్చిపోతున్నాను.. మాట్లాడలేం..."

"ఉన్న భూమి ఎలాగూ దక్కుతుందని రూపాయిల సంగతి ఎత్తుకోనే లేదుగ..."

"పోనీ ఇప్పుడన్నా అడగండి ఉన్నదంతా ఒంటిపిల్లి రాకాసిలా ఏం చేసుకుంటాడు. వచ్చిందే రావడం అడగండి. రామానుజుల్లాగ, ఈ బొక్క కొంప కొస్తా డాబా వేయించుకుంటే వాళ్లకే ఉంటుం నదిగా మీదటికి..."

"అయినా ఇప్పుడడిగితే బాగుండదేమో..." ముసలాయన నీళ్ళు నమిలేను.

"ఏదో జబ్బుగా ఉన్నాను. కూతుర్ని చూడాలని ఉంది అని మరీ మరీ వ్రాసేడుగా. ముందు ఆవిడగార్ని తీసుకెళ్లనివ్వండి. తరవాతనల్లి అడుగుదురుగాని..."

నరసింహం తలగడలో తలదాచుకుని వింటూనే ఉన్నాడు. సరూకి దుఃఖం పొంగివచ్చింది. జబ్బుచేసిన నాన్నను చూచి రావల్సిందిపోయి ఆయనప్రాణంమీద ఇల గాటాలా! పమిటె నోటకుక్కుకుని ఏడ్చింది. నరసింహానికేం పాలుపోలేదు. బుర్ర కెచ్చి రేగింది. బలహీనంగా కూచుని ఎదురుగా ఏడుస్తున్న సరూ మరీ చులకనగా కనిపించింది - "నోరు మూసుకుని లే నీ ప్రయాణంకట్టు ..." అని అరిచేడు, కోపంగా. పొంగిన ఉద్రేకంతో సరూమీదికి నడిచేడు. సరూ హీనంగా వెలుగుతున్న దీపపు శిఖలా చూస్తోంది. నరసింహంలోని ఉద్రేకం నీరయింది. సరూని చూడలేక క్రుంగిపోయేడు. రాధగొంతుక ఆత్రంగా వినిపించింది, అవతలినుండి, "వదినా" అని. నరసింహం మళ్ళీ మంచంమీద వాలిపోయేడు నీరసంగా. సరూ అవతలికి నడిచింది.

రాధ వదినముఖంలోకి ఆత్రుతగా చూచింది. వాళ్ళిద్దరూ కళ్ళతో మాట్లాడుకున్నారు. కళ్ళతో ఓదార్చుకున్నారు. క్షణంలో సరూ మళ్ళీ అక్కణ్ణించి వెళ్ళిపోయింది. కదులుతున్న సరూని చూస్తూ కళ్ళనంట నీళ్ళు కార్చింది రాధ.

ఉదయం నరసింహం కాఫీ తీసుకుంటున్నాడు. సరూ విగ్రహంలా నిలబడి ఉంది. రాధ మెల్లిగా అక్కడికి చేరింది. నందకుమార్ ఉత్తరం మళ్ళీ ఒక్కసారి చూచేడు నరసింహం. పిడుగులా వచ్చేటట్టున్నాడు. ఇలాంటిపరిస్థితుల్లో వాడూ వస్తే! గుండెల్లో ముడతపడింది. పక్కనుండి రాధ మాటలు ధైర్యంగా ఉరికేయి.

"అన్నయ్యా..."

"ఏం?.." అని చీత్కారంగా మగాళ్ల సమాధానం చెప్పేడు.

"రాత్రి ఎందుకన్నయ్యా అలా కేకలేస్తున్నావ్ వదినమీద...." ఒక్కగుక్కలో అడిగేసింది. సరూ నిర్ఘాంతపోయింది.

నరసింహానికి పిడుగుపాటయింది. చిన్నప్పట్నించి చెల్లెలు ఎప్పుడూ తనదగ్గరకు చేరలేదు. అమ్మా, నాన్న శిక్షణలో చెల్లెలికంటే తనకే పెద్దస్థానం ఇచ్చేరు. రాధకెప్పుడూ ఆ భయం ఉంటూనే వచ్చింది. మరి, ఇప్పుడింత అకస్మాత్తుగా ఎలా అడగ్గలిగింది! ఇలా అడుగుతుందని ఎప్పుడూ అనుకోనేలేదతను. ఛీ! ఈ పాడుపిల్ల కూడా నన్ను అడగాలేం, అని మగతనం బిర్రబిగిసింది. చెల్లెలిమీద కళ్లెర్రజేసి చూచేడు. పక్కనే సరూ ఉంది. రాధ జవాబుకోసం ఎదురుచూస్తున్నట్టు కళ్లు పైకెత్తి అమాయకంగా చూస్తోంది. మళ్లీ అతని ఉద్రేకం దెబ్బతింది. ఏమనాలో ఆలోచన తట్టలేదు. బయటికి జారుకున్నాడు.

ఆ రోజంతా ఎక్కడా స్థిమితం తోచలేదు. లొంగని ఉద్రేకం అతన్ని జీవచ్ఛవం చేసింది. తనకంటె చిన్నవాళ్లు రాధ, సరూ తన బలహీనతకు బుద్ధిచెప్పినట్టుగా బాధపడ్డాడు. వాళ్లా నన్ను ఎదిరించగలిగేది! నాలుగు తన్నవచ్చుగా, అని మనస్సు కొంటెగా ఆలోచించింది. కాని తొందరలో తన అమానుష ఆలోచనలకు సిగ్గుపడాల్సి వచ్చింది. వాళ్ల ముఖాలెలా చూచేది? ఒకప్పుడు నందకుమార్‌తో పోటీపడినందుకు ఎత్తిపొడిస్తే ఏం?.. వాడి ముఖం ఎలా చూడగలను? హోస్టల్లో ఉన్న నాలుగు సంవత్సరాలూ ఆదర్శాలు వంజుకుని, ఇంటికి రాగానే మూఢత్వానికి దావడం మస్తిష్కానికి ముసలితనం పోలేదని ఋజువవుతూనే ఉంది. రాధ చిన్నదైనా చురకవేయడంలో తప్పులేదు. మనస్సు చెంపలు వేసుకుంది. ఇల్లు చేరిం తరవాత రాధ ముఖం చూడ్డానికే కష్టమనిపించింది.

*　　*　　*

సూటిగా సరూ ముఖంలోకి చూచేడు నరసింహం. సరూకి అతని కళ్లల్లో పశ్చాత్తాపం కనిపించింది. కొంచెం ధైర్యంగా, ఆశగా చూచింది. నరసింహం కళ్ళల్లో ముగ్ధత్వం, ఆనందబాష్పాలు తిరుగుతున్నాయి. సరూ గుండెల్లో వెయ్యి మెరుపుల సంతోషం మెరిసింది. సరూ వ్యథలన్నీ మరిచిపోయి అతని కౌగిలిలో వాలిపోయింది—

"స.. రూ..." నరసింహం గొంతు సరికొత్తగా పల్లవించింది.

"ఏమండీ..." ఏదో అనేసి సిగ్గుపడింది సరూ.

ఇద్దరూ చాలసేపు కబుర్లు చెప్పుకున్నారు. అనేక విషయాలు దొర్లేయి—

"అంత చదువుకున్నవాళ్లకు నేనేం చెప్పగలను చెప్పండి..." నరసింహానికి తగిలింది సరాసరి.

ఓడిపోయిన ముఖం పెట్టి ఒప్పేసుకున్నాడు—"బూజు పట్టిన మస్తిష్కానికి విద్యాగంధం పైపూతేనని గ్రహించుకుంటూ వీపాటికి..."

"విద్యాధికుల్లో ఉన్న తావర్యాలు కోరడంలో తప్పేముందండి..."

"నేనేం చేయగలిగేను..." నీరసంగా అన్నాడు.

"మీ ప్రేమకు పాత్రత సంపాదించుకో గలిగాను..."

"నిజంగా...!"

"మరీ,..."

"మరేమిటి చెప్పబోయేది..."

"ఆఁ ఏం లేదు, రాధ మాటేం చేసేరు! మీరు కళ్లారా చూస్తూ..."

నరసింహం ఉక్కిరిబిక్కిరై తల నిమురుకున్నాడు. సరూ జవాబుకోసం చిరునవ్వు విసిరింది.

"సరే ఆలోచిద్దాం కొంచెం పెద్దసమస్య కదూ..."

"అన్నీ సమస్యలే మీకు, నన్ను రెండు కళ్లతో చూడ్డానికి ఇంతవరకూ మీకో సమస్యకాలా" సరూ కళ్ళతో బంధించింది. నరసింహం తప్పుచేసి దొరికిన అధికారిలా దొరికిపోయేడు.

"నందకుమార్, మంచివాడే...వాడితో ఎలా ప్రస్తావించేది..." అని గొణుక్కున్నాడు. ఇదివరకే తన్ని పిరికివాడిగా లెక్కేసుకున్నాడు. తనిక ఆదర్శాలగురించి, అందులో తన చెల్లెలుగురించి ప్రాధేయపడితే, స్వప్రయోజనాలకోసం ఆదర్శాలు సెమరుచేసినట్టుంటుంది. పదవికోసం పార్టీలో చేరినట్టుంటుంది. ఎలాగూ? మనస్సు తికమకపడింది. సరూ ఎంతో ధైర్యం చెప్పింది.

★ జీవనరాగం ★

గుమ్మని ప్రసరిస్తున్న నైట్ క్వీన్ పూల వాసనలు పీలుస్తూ అరుగుమీద కూచుని శూన్యంగా చీకటిలోకి చూస్తున్న రాధను ఇద్దరూ చూచేరు. ఇద్దరూ తొందరగా అరుగుమీదికి నడిచేరు—"అదేం రాధా! లోపలికి రా పడుకుందాం..." అని తట్టి లేపింది సరూ. రాధ అన్నయ్యను చూచి లేచి నుంచుంది.

"ఇంకా నిద్రపోలేదా రాధా..." అన్నయ్య ఎంతో ఆప్యాయంగా పిలిచేడు. రాధకు కొత్తసంతోషం మాలకు పూలు కూడినట్టుగా ఉంది. నరసింహం గదిలోకి వెళ్ళిపోయేడు. సరూ, రాధ హృదయాలు విప్పుకుని ఉన్న విషయాలన్నీ చెప్పుకు న్నారు. సరూ కళ్ళల్లో చాతుర్యానికి రాధ మురిసిపోయింది. రాధకు విరిదండలతో స్వర్గంలో ఊరేగినట్టుగా ఉంది. కళ్ళల్లో వెన్నెల కాస్తుంటే నిద్ర ఎలాపట్టేది? మళ్లీ వదినతో ఎప్పుడు కబుర్లు చెప్పుకుంటామా అని సంబరపడింది. చీకటి ఎంత తొందర్లో పోతుందా అని ఎదురుచూసింది.

"ఒరేయ్ నరసింహం..." అంటూ అమ్మ గదిలోకి వచ్చింది. సరూ కాఫీ ఇచ్చి నిల బడి ఉంది.

"ఇదుగో చూడు. ఈవిడ నాన్నకు మరి చాల జబ్బుగా ఉందటకదూ. చూడాలని ఉత్తరం వ్రాసేడు. ఈవిణ్ణి దిగబెట్టేసిరా. తరవాత నాన్న వెళ్తారులే చూడ్డానికి, ఆయనతో మాట్లాడిరావాలి కూడాను, కట్నం సంగతి అదీను..."

నరసింహం తల ఊపి సరేనన్నాడు.

ఇంతలో నాన్న కొడుకొక్కచ్చిన ఎపాయింట్మెంట్ ఆర్డరు గంతులు వేసుకుంటూ కొడుకుచేతులో పెట్టేడు. నరసింహాన్ని విశాఖలో ఎలక్ట్రికల్ సూపర్‌వైజరుగా వేసేరు. సరూ స్వేచ్ఛగా నిట్టూర్చింది.

"అదృష్టవంతుడు వాడికేం, లక్షణంగా వందలు జీతాలు తెచ్చుకునేవాడికి అన్యాయంగా అంటగట్టేం కాని ఇలాటి సంబంధం......నరసింహం! ఆవిణ్ణి వదిలి పెట్టిరా, తరవాత ఏ సంగతీ మీ నాన్న చక్కబెట్టుకొస్తారులే..." గట్టిగా చెప్పి వెళ్లిందావిడ ఇంట్లోకి. నరసింహం కొయ్య బొమ్మలా విని సరూ వైపు చూచి ఒక్క సారి నవ్వేడు.

"మరి నన్ను విడిచిపెడుదురుగాని తొందరగా ప్రయాణం కానివ్వండి..." సరూ అంది. రాధ నవ్వింది.

*　　*　　*

"ఏవాయ్ మొన్న ననగా వస్తావనుకుంటే వారానికి వారమయింది. మీ మామగారు బాగున్నాడా..." నాన్న అడిగేడు.

"ఏదో సుస్తీచేసిందట. పెళ్ళికి చేసిన అప్పులబెంగ, అంతకంటే జబ్బేంలేదు... మందు తీసుకుంటున్నారు. ఇక కోలుకున్నట్టే. ఫరవాలేదు.."

"డబ్బుజబ్బులే. కూతురూ చెల్లాలి, మాట మాటలా ఉండాలంటే ఎలా కుదురుతుంది. తరవాత విషయం నాన్న చూచుకుంటారులే నువు ఇంటిదగ్గరే ఉండు.."

"ఉహూ, నేను తొందరగా వెళ్లాలి, రాధను తీసుకుని.."

"ఎక్కడికి?"

"ఉద్యోగానికి తొందరగా జాయిన్ కావాలి. వండిపెట్టడానికి రాధైనా లేకపోతే ఎలా చచ్చేది, అక్కడ."

"ఉద్యోగమా మరోటా పెళ్ళాంపోతే పెళ్ళాం వస్తుందిగాని ఈ రోజుల్లో...ఏ చింతా లేకుండా హాయిగా ఉండు. తొందరగా ప్రయాణం కట్టుమరి..."

రాధ అన్నయ్యతో ప్రయాణమయింది.

*　　*　　*

మల్లిఖార్జునం, పాండు, కృష్ణమూర్తి, సూరి నందకుమార్ చుట్టూ కూర్చున్నారు, సందడిగా కబుర్లు చెప్పుకుంటూ. నరసింహం హడావుడిగా లోపల్నుండి వచ్చి - "అంతా రెడీ, వేళవుతోంది. తొందరగా టాక్సీలో కూచోండోయ్..." అంతా సద్దుమణిగింది. రెండు కార్లూ పరుగెత్తి గంటలో మళ్ళీ ఇల్లుచేరుకున్నాయి కొత్త వధూవరులతో. రాధ నందకుమార్, అందరికీ విందుచేసేరు. పాండు ఉండబట్టలేక పాడి చేడు,— "నందకుమార్ డిమాండ్ చెయవోయ్ సింపుల్ కట్నం, ఓ నాలు గెకరాలు; ఛీ! డబ్బెందుకులే..." అందరూ నవ్వేరు.

నరసింహం అందర్లో సిగ్గుపడుతూనే నవ్వేశాడు. మల్లిఖార్జునం ".. నిన్ను చూస్తుంటే మా కందరికీ జాలిగా ఉందిరా భాయీ..." అందుకున్నాడు. అందరూ గొల్లున నవ్వేరు.

సరూ రాధ నరసింహం చెవిలో ఏదో మాట్లాడేరు—

"ఉత్తరం వ్రాసేను. ఈరోజు మామగారు అత్తగారూ వస్తారనుకున్నాను. బహుశః ఈ బండికి రావచ్చండి..." సరూ అంది.

"తొందరేమొచ్చిందని ఉత్తరం వ్రాసేవు" నరసింహం పిరిగ్గా విసుక్కున్నాడు. సరూ మెల్లిగా నవ్వింది, పరిహాసంగా.

"పదండోయ్, అందరం స్టేషనుకు వెళ్దాం" నందకుమార్ అన్నాడు.

"తప్పకుండా, ఆలస్యమెందుకూ, ఇక రైలువేళయింది. ముసలాళ్ళను ఆహ్వానిద్దాం మన కొత్తప్రపంచానికి..." పాండు లేచేడు.

అందరూ స్టేషనులో ఎదురుచూస్తున్నారు. రైలు వచ్చింది. సరూ నాన్న దిగి అందర్నీ చూచేడు. వధూవరుల్ని ఆశీర్వదించేడు. అన్ని పెట్టెలూ వెదికి చూచేరు, సరూ, నరసింహం.

"ఎక్కడోయ్ మీ నాన్న, అమ్మా?" నందకుమార్ అడిగేడు.

"రాలేదే" అనుకుంటూ దిక్కులు చూచింది రాధ.

"అవును, ఇక వాళ్లు రాలేరులే..." అని నరసింహం అందర్నీ చూచి స్టేషనవతలికి నడిచేడు. ★

పెద్దకథ:

సుశీల

(గత సంచిక తరువాయి)

5

సుగుణభూషణుడు మళ్ళీ కావ్యం విప్పి కలం తీసుకున్నాడు. కాని అనుకున్న దేదీ వ్రాయలేకపోతున్నాడు. అతని మనసు అన్యాక్రాంతమైవున్నది తను ఇప్పుడొక పెద్ద జీవితసమస్య నెదుర్కోబోతున్నాడు. దానికి పరిష్కారావకాశం యెంతవరకున్నదో ఆలోచించుకోవాలి. తుది నిర్ణయం తనదే అవుతుందా? తండ్రికి చెప్పినమాటలతో తన స్వాతంత్ర్యం కోల్పోయినాడా?

ఇప్పుడీ కావ్యనాయిక అచ్ఛంగా సుశీలయై తనకళ్ళయెదటనే నిలబడింది. అదుగో ఆమెకళ్ళల్లో యెంతటి కార్పణ్యమో... అదంతా తన జీవితంపై ఆమెకుగల విహ్వలభావంవల్ల నేనా? ఎవ్వరినీ లెక్క జేయనట్టు నల్లతాచులాంటిజడ గుండెలపై కులుకుతూంటే మెడమెట్లమీంచి దిగి వస్తోంది. వాడెవ్వడో బాల్కనీక్రిందుగా క్రోటన్సు ప్రక్క నిలబడి కెమెరా గుండెల కదుముకుని ఒంటికంటి సేనానిలాగా లక్ష్యం వెతుకుతున్నాడు. వాడు మొట్టమొదటగా అవారా, బుష్‌కోటుతో క్లాసులో అడుగు పెట్టినప్పుడు ఆడపిల్లల బెంచీలో పెద్ద కలకలం బయల్దేరిందట. దానికంతటికీ సుశీలే నాయకురాలని వాడిభావన. ఆ కసి తీర్చుకోడానికి ఆ మొన్నాటినించే కెమేరాల కిటుకుల్లో సుశీల సౌశీల్యాన్ని కైంకర్యం చెయ్యాలన్నంత అఘాయిత్యానికి వొడి

ఘట్టి కృష్ణమూర్తి

గట్టాడు. అవకాశం అందినప్పుడల్లా వాడిలా వేటాడుతూనే వున్నాడు. అలాటి సుశీలనా తనిప్పుడు నిభాయించుకోవలసింది? ఇంతకీ పెళ్లిగురించిగానీ, తన జీవితంలో భాగం పంచుకోనబోయేతరుణిని గురించిగానీ వొక నిర్ణయానికి రాలేకపోయి వుండడం వట్టి చేతగానితనంగా తోచింది సుగుణభూషణుడికి.

జీవితంలో యేదో వొకనాడు ఇలాటి సంఘటన ముంచుకురాక తప్పదు. అతను ముందే దానికొకరూపం ఇచ్చుకొనివుంటే, తనతండ్రిలాంటివాళ్లు ఖచ్చితంగా అడిగినప్పుడు నిక్కచ్చిగా బయటపెట్టి వుండేవాడు. తన కలాటినిశ్చయజ్ఞానం లేకపోగా నోరు జారినందుకు పశ్చాత్తాపమే గతి అయ్యేటట్లున్నది. తన తండ్రి తల్చుకుంటే అంతపనీ జరిగే తీరుతుంది.

వ్యాపారదృష్టిగలవారికి ప్రతిదానికీ లాభనష్టాలు బేరీజు వేసుకోవడం అలవాటు. దానిమూలాన యెన్ని నిండుగుండెలు తల్లడిల్లిపోవలసిస్తుందో వారికేం తెలుసు! తనమాట తండ్రికి యెందుకు నచ్చజెప్పలేడు! కాని, తనకు ఆశ్రయమిచ్చి వొకమనిషిగా రూపొందించిన రావుగారు అపాటి విజ్ఞత లేకుండానే వ్యవహరిస్తున్నాడా? ఆయనమాటకు ఆమాత్రం తల వొగ్గక మొండి చరదలేకనే ఆయన కలాంటి అవకాశం యివ్వదల్చుకున్నాడా తను?

పోనీ, వద్దని అమ్మతో చెబితే, ఆవిడ చేయగల్గింది బహుతక్కువ. లక్ష్మీబాయమ్మగారు వట్టి పూర్వకాలంమనిషి. నోట్లో నాలుకలేదు. తండ్రిని కాదని తనకు వేరే సంబంధం చేయగల తాహతు ఆవిడకు లేదు. అయినా తను ఆవిడతో చెప్పడం చిన్నతనం అనిపించింది సుగుణభూషణుడికి. లోకందృష్టిలో, లేక తనతండ్రిగారిదృష్టిలో కాకపోయినా స్వీయదృక్పథంలో తనంతటివాడు తను. అయినప్పుడు వొకళ్ళని ఆశ్రయించాల్సిన అవసరం యేముంది?

సుశీలమాత్రం తనను పెళ్లాడడానికి నూటికి నూరుపాళ్లూ వొడబడి వుంటుందా? ఆమెదృష్టిలో పురుషప్రపంచమంతా అనర్థమైనదే. చేతకాక, గతిలేక తమను పెళ్ళాడుతుంటారన్నంత అహంభావంతో వొక మాగజైనులో ఆమె వ్రాసిన వ్యాసం తనకు మరుపు వస్తుందా? మరావిడయెదట పురుషుడుగా నిలబడగలినవాడెవడో... ఎప్పుడూ చదివేవాళ్లని పుస్తకాల పురుగులంటుంది. టెన్నిస్ రాకెట్ తీసుకుని తనవెనకవచ్చేవాడు లౌనిస అంటుంది. మరి కావ్యాత్మకు కైంకర్యంచేసే తను ఆమెదృష్టిలో కలిపురుషుడో...కర్కోటకుడో



శివ శివ మూర్తివి గణనాథా !—నీవు
శివుని కుమారుడవు గణనాథా !
ఎన్నికల రోజులయ్యె గణనాథా! నేను
ఇప్పుడైన కాపుమయ్య గణనాథా !
నిన్ను నమ్మి దిగినారు గణనాథా !—అంత
రెన్నికల గోతిలోకి గణనాథా !

6

ఉదయాన్నే కాఫీ సేవించి వాలు కుర్చీలో మేనువాల్చి అప్పుడేవచ్చిన పత్రిక తిరగవేస్తున్న రావుగారి కొకవార్త హర్షం కలిగించకపోగా అమర్షాన్ని రేకెత్తించింది. అది 'ఆంధ్రా అసెంబ్లీ హైకోర్టును గుంటూరులో స్థాపించడానికే నిశ్చయించిం' దనేది. ఇది వట్టి చవకబారు నిర్ణయం! వస్తే రాజధానిరావాలి, హైకోర్టు ఎక్కడుంటేనేం? ఇంతమాత్రాన కోరిగిందేమిటి? కంట్రాక్టరు అయిన వాడెవ్వడూ యీ నిర్ణయాన్ని హర్షింపలేడు. పోతే కృష్ణా రెగ్యులేటర్ బ్రిడ్జి వొకటి వూగిసలాడుతోంది. కొన్ని అసాధారణ పరిస్థితులవల్ల, మరికొన్ని ప్రత్యేక కారణాలవల్ల తను అందులో భాగం పంచుకు నేఅవకాశం శూన్యమైంది. అయినా ప్రయత్నించి చూడాలి.

రాత్రి అసంపూర్తిగా మిగిల్చివున్న సమావేశాన్ని తిరిగి కొనసాగించితేగాని అసలు నిర్ణయమేదో బయటపడదు. అంతవరకూ బోత్తిగా నీరు వదులుకోవడమెందుకు?

జడ్జీగారితో ఆ విషయం తేల్చి చెప్పివెయ్యాలి. మిగతా వ్యవహారాలన్నీ సౌహార్దంతోనే పరిష్కరించుకోవాలి. తనంతట తానుగా కావాలని వచ్చిన పద్మనాభంగారు ఎందులోనూ తనమాట కాదనడని భావించవచ్చు. ఏమైనా విద్యుత్ అన్న తరవాత కయ్యానికికూడా సూక్ష్మంగా అవకాశం వుంచకపోదు. అమాత్రంకూడా పాటించకుండానే వ్యవహారం నడిపించుకు రావడంలోవుంది శ్రీనివాసరావు ప్రజ్ఞ! ఆ తరవాతగానీ జడ్జీగారిని తన అవసరాలకు వాడుకోనే వీలుండదు. ఇంక సుగుణభూషణం గాడితో సంప్రదించడం సున్న. ఒక్కపుస్తెకట్టడం మినహా మిగతా తతంగమంతా తనచేతిమీదుగా నిర్వహించుకురావలసిందే! ఒకటిమాత్రం వాడితో గట్టిగా హెచ్చరించాలి. తను రామస్వామికోసుకు అనే సంగతి బ్రహ్మకైనా తెలియనీకూడదని, ఒకవేళ నోరుజారి ఆమాట బయటవేస్తే తన ఆస్తిలో చిల్లిగవ్వకూడా దక్కనీవని ఖండితంగా చెప్పివెయ్యాలి. అప్పుడుగానీ దారికి రాడు వాడు. తుక్కైన పేనులా వుంటాడు అంతే. ఇంటో హాయిగా గడుస్తుంటే యెన్ని తీరులు గానవ్వా వేషాలు వేస్తారు. మరెన్ని శ్రీరంగనీతులైనా వల్లిస్తారు వెధవలు! తల తిరిగి నోట్లోకి వచ్చేలా చేస్తేగాని చెప్పిందివిని తుక్కల్లా చేసుకుపోరు. వాడిచేత కంట్రాక్టు పట్టిస్తేనే శ్రీనివాసరావు ప్రజ్ఞ! అదుగో వాళ్ళూ వస్తున్నట్టున్నారు. రాత్రి సంగతే యేదో వొకతీరున తేల్చి వేసుకోవాలి అనుకుంటూ కుర్చీలోనించి లేచారు.

(ఇంకా వుంది)

...ఏమైనా రాబోవు పరీక్ష నెదుర్కొనక పెట్టుకుని కాలక్షేపాలు చేసారు. ఇప్పుడు నిర్లక్ష్యంతో నే కలం జేబులో [illegible]

బొమ్మరిల్లు

సంక్రాంతి

శ్రీనివాస కాశ్యప

★

అదుగదుగో సంక్రాంతి!
అరుదెంచెను సంక్రాంతి!
ఇలనిండెను సస్యకాంతి,
ఇంటింటను శుభముశాంతి!!

అదు గదుగో సంక్రాంతి!
అరుదెంచెను సంక్రాంతి!

పచ్చనైన తోరణాలు,
ముచ్చటైన ముగ్గులతో
కలకలలాడే పండుగ
తెలుగువారి సంక్రాంతి!

అదు గదుగో సంక్రాంతి!
అరుదెంచెను సంక్రాంతి!

చిట్టి చిట్టి చెల్లాయిలు,
చిన్నారి పాపాయిలు
వుంచిరి వాకిళ్లలోన
మంచిమంచి గొబ్బిళ్లను!

అదుగదుగో సంక్రాంతి!
అరుదెంచెను సంక్రాంతి!

వదినలతో మరదళ్లూ
పరిహాసము లాడుకొనుచు
కలువపూల హారాలను
కైసేసిరి గుమ్మాలకు!

అదు గదుగో సంక్రాంతి!
అరుదెంచెను సంక్రాంతి!

వేకువజాముననె లేచి,
జోకుగ నామాలుదిద్ది,
"హరిలో రంగహరి" యనుచు
హరిదాసులు విచ్చేసిరి!

అదు గదుగో సంక్రాంతి!
అరుదెంచెను సంక్రాంతి!

ముద్దులొలుకు పాపాయిలు,
ముత్తైదులు, ముద్దియలూ
చక్కగ ముస్తాబుచేసి
సాగిరి పేరంటమునకు!


అదు గదుగో సంక్రాంతి!
అరుదెంచెను సంక్రాంతి!

తెలుగునాట ప్రతిఇంటను
వెలసిన సంక్రాంతి సిరికి
లలిత మంగళము పాడిరి
అలివేణులు! అలివేణులు!

అదు గదుగో సంక్రాంతి!
అరుదెంచెను సంక్రాంతి!

అరుదెంచెను సంక్రాంతి!
అదుగదుగో సంక్రాంతి!
విశ్వమెల్ల సస్యకాంతి,
విలసిల్లెను శుభముశాంతి!

అదు గదుగో సంక్రాంతి!
అరుదెంచెను సంక్రాంతి!



భోగిమంట

ముళ్లపూడి వెంకటరమణ

ఒరేయ్. అసలిదేం భోగిమంట లేరా. పూర్వకాలంలో జనార్దనస్వామిరథమంత ఎత్తు భోగిమంటలు వేసుకొనేవారు. దాని ముందు ఇదెంతరా. పాత తాటాకు బుట్టలూ, కోళ్ళగంపలూ, పిడకల దండలూ ఇచ్చినమ్మ పుణ్యం ఇవ్వానమ్మది పాపంఅని. నిన్న సాయంత్రం మనం బెల్లించి దండుకొచ్చిన కర్రపేళ్లూను. అయినా మనకి పదేళ్లే కాబట్టి ఇది చాలుననుకో. నాకూ పెద్దవాళ్ల గ్యాంగులో వెళ్ళి తిరగాలనే ఉంది. కాని ఇల్లు కదిల్తే పెద్దన్న పేకావారమ్మాయి నిచ్చి పెళ్లిచేస్తాడు. వీధిలో ఎక్కడేనా కనపడ్డానంటే చిన్నన్నయ్య చావ గొట్టేస్తాడు. వాళ్లే పెద్ద మొనగాళ్లైనట్టు.

...ఒరేయ్. మరేం, మా చిన్నన్నయ్యా వాళ్లు ఇప్పుడేం చేస్తా ఉంటారో తెలుసా? ముత్యాలమ్మ గుడిదగ్గిర శేషయ్యగారి వకీలు బోర్డు భోగిమంటలో వేసి ఝూం అని తగలబెడుతూ ఉంటారులే.! అవాలిలే అలాటిశాస్తి... వాళ్ళ కూతురులేదూ—శేషయ్యగారి కూతురు సుభద్ర? అదేం చేసిందో తెలుసా? అయితే మన పట్టుగాడి అన్నయ్య మంచివాడు కాడనుకో. వాడసలే రౌడీ. పైగా రౌడీలతో స్నేహంచేసి, బీడీలు తాగుతాడు అప్పుఅసామి బత్తేవనకాతల. మొన్న పొద్దున్నేమో శేషయ్యగారి సుబ్బి గుమ్మంలో గొబ్బిళ్లు పెడుతోందట. వీడు సైకిలుమీద రయ్‌మని వచ్చేసి ఆ గొబ్బిళ్ళమీద నించి సైకిలు పోనిచ్చాడుట. అప్పుడు పారిపోయాడనుకో. మళ్లా నేమో, సాయంత్రం వాడూనూ మా చిన్నన్నయ్యానూ గోదారొడ్డున అరుగుమీద నించునిఉంటే ఈ సుబ్బి నీళ్ళకొచ్చి వీళ్ళని చూసి ఇలా మెటికలు విరిచేసుకుని “వెధవ చచ్చినాడా” అనేసి చక్కాపోయిందిట. అందుకనే ఇవాళ మా చిన్నన్నయ్యా వాడూ కలిసి శేషయ్యగారి వకీలుబోర్డు ఎత్తుకుపోయి



“భంభం భం...
హరహర మహా దేవ్”



"నాదే-యమ్మా ! నాది."

—ఫొటో : ఉప్పులూరి వెంకట శ్రీనివాసరావు.

★ భోగిమంట ★

భోగిమంట వేస్తున్నారు. రాత్రే బోర్డు తెచ్చేశారుట. మళ్ళీనేం, శేషయ్యగారింటికి బోర్డు లేకపోతే బోడిగా బోసిపోయినట్టుంటుంది కదా అని జాలిపడి, మంగలి వీరాసామి బోర్డు లేదూ? "సుకక్షవర భవనము, ఇక్కడ బ్యాండుమేళములు అద్దెకు రాబడును" అని ఉంటుంనీ, ఆ బోర్డు నేమో ఈ శేషయ్యగారింటికి తగిలిస్తారుటలే. పాపం వీరాసామి బీదవాడు గదా బోర్డులేక పోతే ఎలాఅని "ఇక్కడ శుచిగా భోజనము పెట్టబడును, బ్రాహ్మణ భోజనహోటలు" అని రాసిఉన్న బోర్డుని వీరాసామి దుకాణానికి తగిలిస్తారుట. మా చిన్నన్నయ్య మంచివాడు కాబట్టి మినపట్టుగాడి అన్నయ్యకి ఇంత సాయం చేస్తున్నాడు. ఒరేయ్ మా చిన్నన్నయ్య గ్యాంగు లీడరు తెలుసా?

...ఒరేయ్ బాబీ! మీ ఇంట్లోకి పరిగెట్టుకెళ్లి ఇంకో రెండు తాటాకుబుట్టలూ, నాలుగు బైండు బుక్కుల అట్టలూ పట్రారా. మంట అయిపోతోంది... వెధవది నేనే తెద్దును కాని మా యింట్లో బైండు బుక్కులు లేవు. పైగా మా పెద్దన్నయ్య తలంటిపోసుకుంటు న్నాడు. చూశాడంటే ఇప్పుడు నాకు తలంటి పారేస్తాడు. అందు కని నువ్వు పట్రా... పరవాలేదులే బైండుబుక్కు అట్టలేం సరస్వతి కాదులే...పాపం కాదు ఒట్టురా. మా చిన్నన్నయ్యకూడా చెప్పాడు అట్టలు సరస్వతికాదని. పట్రా. మంటారిపోతోంది. బాగా తెల్లారితే కాని మనని వీధిదాటి వెళ్లనియ్యరు. ఏహోయ్ సీపీ! నువ్వెళ్లి మీ పాక లోంచి కొంచెం గడ్డీ, రెండు తాటాకులూ పట్టుకురా—తెల్లారే దాకా సరిపోతాయి...

...ఒరేయ్. ఒక రహస్యంచెబు తాను. కాని ఎవరితో చెప్పనని ఒట్టెయ్యండి నలుగురూ. ఎంత ఒట్టుపడితే అంత ఒట్టుకదూ?... ఇదికనక మనంచేస్తే వందలకొద్దీ, లక్షలకొద్దీ, కోట్లకొద్దీ రూపాయలు, మనకెన్ని కావాలంటే అన్ని, ఎప్పుడు కావాలంటే అప్పుడు వచ్చేస్తాయి. దానికి ఒక చిన్నపని చెయ్యాలి. చాలా సులభంలే...ఏం చెప్పనా? ఎవరితో చెప్పనని ఒట్టేగా. ఇదివరకు కోదండంగాడికి చెబితే వాడు చెడగొట్టేశాడు. లేపోతే ఎపుడో మేం ధనవంతులం అయిపోయేవాళ్లం.

ఇదంతా ఎలా జరిగిందంటే—

ఒకరోజు నేమో సరిగ్గా క్రింద టేడు, సంక్రాంతికి రెండుమూడు రోజుల ముందన్నమాట. ఏం? ఆ వేళ నేనూ, కోదండం, బడి ఎగేసి గోదార్లో ఈతనేర్చుకొని వస్తు న్నాం. అక్కడ రాంపాదాల అరుగుమీద ఒక సాధువు కూర్చు న్నాడు. వాడేమో—కాదు ఆయ నేమో మమ్మల్ని పిలిచాడు. "అబ్బాయిలూ మీ జనార్దన స్వామికొండమీద గోపాలస్వామి గుడి ఉంది తెలుసా?" అన్నాడు. "తెలుసనండి" అన్నాం. "చీకటిగా ఉంటుంది కదూ?" అన్నాడు. "ఔనండి—"అది పాతాళలోకానికి సొరంగం అండి"అని మేం చెప్పాం. "కాదబ్బాయిలూ! అది కాశీకి వెళ్లే దారి, అందులో చాలాదూరంపోతే ఓ కొలనుంది. దాన్నిండా కోట్ల కొద్దీ రూపాయలున్నాయి, అవి ఎన్నితీసినా అయిపోవు, మళ్లా కొత్తవి పుడతాయి, మరి మీ క్కావాలా?"అనిఅడిగాడు."కావా లండి కావాల" న్నాం మేము. అప్పుడు ఆ సాధు వేం చెప్పాడంటే "అబ్బాయిలూ ఆ కొలనులో రూపాయిలు ఎవరన్నా ముట్టు కుంటే తల పగిలి చచ్చిపోతారు, అది ఒక భూతం తీసి ఇస్తే ఫరవా లేదు, ఆ భూతాన్ని వశపరచుకునే ఉపాయం చెబుతా నాకేమిస్తారూ?" అని అడిగాడు. "ఏదేనా సరేనండి" అన్నాం.

"అయితే సరే ఓ మరచెంబు, మీనాన్నగారి కంబళీ ఎవరూ చూడకుండా ఎవరికీ చెప్పకండా తే" అన్నాడు. అపుడు కోదండం గాణ్ణి మా యింటికి తీసుకొచ్చి పెరటిగుమ్మం గేటుమీాదనించి మర చెంబూ కంబళీ వాడికి అందిచ్చి, నేను వీధిగుమ్మంవెంట బయటి కొచ్చాను. సరే అపుడు ఆ సాధు వుకి అవి ఇచ్చేశాక ఆయన వెళ్తూ వెళ్తూ మాకు ఆ ఉపాయం చెప్పాడు. మంత్రాలూ అవీ ఏం లేవు తెలుసా? 'భూతం కనక అల్లరి చేస్తే ఆంజనేయదండకం చదువు కోం'డని చెప్పాడు...అదేమిటో తెలూసా? భోగినాడు సాయంత్రం చిన్నపిల్లలకి భోగిపళ్లు పోస్తారు కదా, అపుడు ఇంటింటికీ వెళ్ళి దమ్మిడీలు, అవీ దొరక్కపోతే



"సుబ్బి గొబ్బెమ్మ సుబ్బి నియ్యావే
చామంతి పువ్వంటి చెల్లెల్నియ్యావే"

—ఫొటో : ఉప్పులూరి వెంకట శ్రీనివాసరావు.

కానులూ పోగు చెయ్యాలి. ఆ డబ్బులు పెట్టి, ఒక బేడ వేరుశనగ కాయలు కొనాలి. భూతాన్ని ప్రత్యక్షం చేసుకోవాలనేవారు ఆ వేరుశనక్కాయ ఒక్క పప్పు తిన కూడదు. అంతా అవతల పారేయ్యాలి లేకపోతే ఎవరేనా సాధువులకి దానంచెయ్యాలి. వేరుశనగ డొలకలుంటాయి చూడండి. ఆ డొలకలన్నీ తీసుకుని ఓ కుంపటీ బొగ్గులూ పట్టుకుని అర్ధరాత్రివేళ, భయమేస్తే సాయంత్రం అయినా ఫరవాలేదుట. ఏం?... ఊరావీధ కెళ్లి నిప్పురాజేసి ఆ వేరుశనగ డొలకల్ని బాగా బొగ్గులయ్యేదాకా కాల్చి మాడ్చెయ్యాలి. అపుడు ఆమాడిపోయిన డొలకల్ని మెత్తగా చూర్ణంగా నూరాలి. అందులో కొంచెం నీళ్లుకలిపి రెండు చేతుల్లోనూ దూరంగా పట్టుకొని గుండ్రంచేసి వాటికేసి చూసి "ఓ భూతమా రమ్మ" అనాలి. అపుడు భూతం వచ్చి 'ఏమి స్వామీ' అంటుంది. 'నాకు ఓ పదిరూపాయలు తెమ్మ' అంటే తపీమని యిస్తుంది. క్రిందటిభోగిపండుగనాడు నేనూ, కోదండం ఇల్లిల్లూ తిరిగి దమ్మిడీలు పోగుచేసి చచ్చి చెడి తిప్పలుపడి మా డాబామీద అంతాచేశాం. నీళ్ళెక్కువైపోయి నందువల్ల ఉండలు కుదరలేదు. అపుడు మళ్లీ ఇంకొన్ని వేరుశనగ డొలకలు కొనితెచ్చి మాడ్చిచేశాం. భూతం ఎంతకీ రాలేదు. ఎన్నిసార్లు పిలిచినా కోదండంగాడు నవ్వేసి 'బైరాగాడు మనకి టోపీవేశాడురా. భూతంలేదు గీతంలేదురా' అని వెక్కిరించాడు. అయితే నాకు తపీమని జ్ఞాపకంవచ్చిందొకటి. వీడు లేడూ? ఈ కోదండంగాడు—వీడు శ్రీ ఆంజనేయస్వామివారికి పది వేల రెండొందల కొబ్బరికాయలు బాకీఉన్నాడు. ఎక్కాలు రాకండా బడికొచ్చినపుడల్లా చెవిటిపంతులు గారు కొట్టకుండా చేస్తే రెండొందల

★ భోగిమంట ★

కొబ్బరికాయలు కొడతాను స్వామీ అని దణ్ణంపెట్టుకునేవాడు. ఓసారి వాళ్లనాన్న జేబులో రెండుపావలా కాసులు కొట్టేసి హోంటరువాలీకీ చేటీకీ, ఖజాంచి సినిమాకీ వెళ్లాడు. సాయంత్రం దెబ్బలుతప్పిస్తే ఐదు కొబ్బరికాయలు కొడతానని శ్రీ ఆంజనేయస్వామివారికి మొక్కాడు. అవన్నీ ఎగేసినందుకు శ్రీ ఆంజనేయస్వామివారికి కోపంవచ్చింది. వచ్చి—మేం వేరుశనగ ఉండలు పట్టుకొని ఎంతపిలిచినా భూతాన్ని రాకుండా చేశాడు. కోదండంగాడి మూలానే అపుడంతా చెడిపోయింది. దొంగవెధవ ఇప్పుడింకా నవ్వుతాడు సిగ్గులేకండా. అన్నీ అబద్ధాలేనంటాడు...

ఒరేయ్ వాడు వచ్చి కేడీ నంబరు వన్ తెలుసా? వాళ్లింటోనే కాదు మా యింటో పుస్తకాలు కూడా చెక్కేస్తాడు. ఓసారి నేను వాడి పెనసలు దాచేశా. మళ్లా నాకు తెలీకుండా దాన్ని వాడు దొంగతనం చేశాడు. అప్పట్నించి వాడితో మాటాడ్డం మానేశా. మళ్ళా భోగి ఎప్పుడొస్తుందా! ఉండలుచేసి భూతాన్ని పిలుద్దామా అని కూచున్నా.

..."హోరి వెధవా! కిందటిభోగి ముందు కంబళీ, మరచెంబు కాజేసింది నువ్వేనట్రా!" అని వెనకాల నుంచి ఎవరో ఉరమడంతో డబ్బారేకుల సుబ్బారావు డబడబలు తపీమని ఆగిపోయాయి. గుండె గుభేల్‌మంది. ఇంకో క్షణంసేపట్లో వీపు ఫెడేల్ మంది.

'బాబోయ్' అంటూ డబ్బారేకుల సుబ్బారావు వెనక్కి తిరిగాడు. వెనకాల వాళ్ల పెద్దన్నయ్య నించున్నాడు 'హుం' అన్నాడు వాళ్ల పెద్దన్నయ్య కోపంగా. అమాంతం చలిమంట కాచుకుంటున్న శాస్త్రీ, సీ.వీ., బాబీ తోక ఝాడించి పరుగో పరుగు. "వెధవ కానా! ఇవాళ పండగకదా అని ఒక్క దెబ్బతో వదిలేశాను. లేపోతే పదిదెబ్బలు కొట్టేవాణ్ణి. నడు. లోపలికి నడు. నాన్నగారూ, అమ్మా భోగిపళ్లు పోస్తారు. నేను పేకావారమ్మాయి నిచ్చి పెళ్లి చేస్తా..." అన్నాడు పెద్దన్నయ్య.

"ఒద్దన్నయ్యా పేకావారమ్మాయిని పెళ్లి చెయ్యకు. ఇవాళ భోగేగా సాయంత్రం ఉండలుచేసి, భూతాన్నడిగి పధ్నాలుగు రూపాయిలు తెచ్చి కంబళీ, మరచెంబు మళ్లీ కొనేస్తానన్నయ్యా..." అన్నాడు డబ్బారేకుల సుబ్బారావు గునుస్తూ.

వాళ్ల పెద్దన్నయ్య పకపక నవ్వి, సుబ్బారావు నెత్తిమీద తేలికగా మొట్టికాయ వేశాడు. ★



టామ్‌సాయర్ ప్రపంచ యాత్ర

మూలం మార్క్‌ట్వేన్

ఈ సీరియల్ టామ్‌సాయర్, హకల్ బెరీఫిన్ నవలలకు తరువాత జరిగిన కథను తెలుపుతుంది. "హకల్ బెరీఫిన్" నవలలో మాదిరిగానే నవలలో కూడా హకల్ బెరీఫిన్ అనే కుర్రవాడే కథ చెబుతాడు. ఈ నవలలో టామ్‌సాయర్ అనే మరో కుర్రవాడూ, హకల్ బెరీఫిన్, వీళ్ళ స్నేహితుడైన జిమ్ అనే నీగ్రో ముఖ్యపాత్రలు. టామ్‌సాయర్‌కు ఎప్పుడూ ఏదో సాహసం చేస్తూనే వుండాలనీ, తన పేరు దేశదేశాల్లో మోగిపోతూ వుండాలనీ కోరిక. అంచేత ఇదివరకు చేసిన సాహసాలతో తృప్తిపడక, కొత్తవాటికోసం చాలా ప్లాను వేస్తాడు కాని మిగతా వాళ్ళిద్దరూ అతని ప్లాన్లు అన్నిటినీ తోసివేస్తారు. ఏంచేయడానికీ పాలుపోకుండా వున్న సమయంలో, ఒక ప్రొఫెసరు బెలూన్‌లో యూరప్ ఖండానికి బయలుదేరనున్నట్టు వాళ్ళకి తెలుస్తుంది. అది చూసివద్దామని వెళ్ళిన టామ్, హక్, జిమ్ ముగ్గుర్నీ ప్రొఫెసరు లోపలికి రానిచ్చి హఠాత్తుగా బెలూన్‌ను బయలుదేర దీస్తాడు. యూరప్ ప్రయాణమై పోతున్న విమానంలో ముగ్గురు మిత్రులు నిర్ఘాంతపోయి కూర్చున్నారు. మార్గమధ్యంలో ప్రొఫెసరు తెగ తాగి సముద్రంలో పడి మరణిస్తాడు. బెలూన్ నడపడం టామ్ నేర్చుకున్నందున ప్రయాణం క్షేమంగానే సాగింది. కాని విమానం యూరప్ పోవడానికి బదులు ఆఫ్రికాఖండంలో ప్రవేశించింది. మొదటవారి నెదుర్కొన్నవి సింహాలు. కాని చాకచక్యంగా వాటిని తప్పించుకున్నారు.

6

ఈ పరిగెత్తడాలతోనూ, నిచ్చెనపట్టుకుని వేళ్లాట్టాలతోనూ నాకు బడలిక కలిగి కాసేపు పడుకోవాలనిపించింది. నా పక్కమీద నడ్డివాల్చాను. కాని నిప్పులు చెరుగుతున్న ఆ వాతావరణంలో పడుకుంటే మాత్రం బడలిక పోతుందా? అందుచేత విమానాన్ని పైకి పోనివ్వమని టామ్ ఆజ్ఞాపించాడు. జిమ్ పైకి పోనిచ్చాడు. కాని అప్పటికి విమానంనిండా ఒక రకం జంతువులు, బహుశా మిణ్ణల్లులేమో దట్టంగా ముసిరాయి. అవి మాంచి ఆకలిమీద వుండి, దేన్ని పడితే దాన్ని తినెయ్యడానికి సిద్ధంగా వున్నట్టు కనిపించాయి. ఎక్కడ ఇసకవుంటే అక్కడ యీ మిణ్ణల్లులు తయారు. ఇసక ఎక్కువగా ఉన్నకొద్దీ వీటిజనాభా కూడా ఎక్కువౌతుంది. మేమున్నచోట ఇసకతప్ప

★ టామ్ సాయర్ ప్రపంచ యాత్ర ★

వేరేమీ లేదు. అందుచేత ఎన్నివేల మిణ్ణుళ్లు చేరాయో నేను చెప్పలేను అంతపెద్ద జనాభా ఉత్పత్తిని నేనెక్కడా చూడలేదు.

ఒకమైలు ఎత్తుకు పోతేగాని మాకు చల్లగాలి సోకలేదు. ఇంకోమైలు పైకెక్కితేగాని మిణ్ణుళ్లులబాధ పోలేదు. చలిగాలికి నిలవలేక అవి గుంపులు గుంపులుగా విమానంనుండి దూకేశాయి పీడవదిలిందనుకుని ఒకమైలు క్రిందికి దిగాము. గాలి హాయిగావుంది. కొద్దిసేపట్లో నేను సేదదీరాను. ఇంతసేపూ టామ్ ఏదో దీర్ఘాలోచనలో వున్నాడు.

"ఇప్పుడు తెలిసింది మన మెక్కడున్నామో," అని టామ్ ఒక్కసారిగ అన్నాడు "ఇది సహారా. ఇదే మహాసహారా. ఢంకామీద దెబ్బకొట్టి చెప్పగలను," అనికూడా అన్నాడు.

నాకిదేమంత నమ్మబుద్ధి కాలేదు.

"సహారా ఎక్కడుంది? ఇంగ్లండులోనా, స్కాట్లండులోనా?" అని అడిగాను.

"అక్కడెక్కడా కాదు. ఆఫ్రికాలో" అన్నాడు.

ఈమాట వినేటప్పటికి జిమ్ ముఖం చేటంతయింది. కళ్లు వికసించాయి. అదేపనిగా భూమిమీద వెదకసాగాడు. తన పూర్వీకులు ఆఫ్రికాఖండం వాళ్లే గదూ? ఆ బాపతుజనం ఎక్కడన్నా కనిపిస్తారేమోనని వెదికాడు.

కాని టామ్ తను కనిపెట్టిన విశేషంతో ఉబ్బితబ్బిబ్బు లవుతున్నాడు. ఆ సింహాలు, ఈ యిసకయిదంతా చూస్తుంటే ఇది తప్పక సహారాఎడారేనని పిస్తోందన్నాడు. అంతేకాక విమానంలో ఉన్నగడియారాలను చూపించి, వాటివల్ల కూడా ఆ సంగతి తెలుసుకో వచ్చునన్నాడు.

"ఈ గడియారాల్లో ఒకటి గ్రీన్‌విచ్ టైము చూపిస్తోంది. ఇంకొకటి నాగడియారం లాగానే మన వూరుటైము చూపిస్తోంది. మనం మనవూరినించి బయలుదేరినప్పుడు మనగడియారాల్లో సాయంత్రం నాలుగు గంటలయింది. గ్రీన్విచ్ గడియారంలో రాత్రి పది అయింది. ఈరోజుల్లో సూర్యుడు 7 గంటలప్పుడు అస్తమిస్తాడు. నిన్నసాయంత్రం సూర్యుడస్తమించినప్పుడు టైముచూశాను. గ్రీన్‌విచ్ గడియారంలో సాయంత్రం అయిదున్నర అయితే, మనగడియారాల్లో పొద్దున పదకొండున్నర మాత్రమే అయింది. మన వూళ్ళో మనగడియారంప్రకారమే సూర్యోదయం, అస్తమయం జరిగేవి. అప్పుడు గ్రీన్‌విచ్ గడియారం ఆరుగంటలు ముందు నడిచేది కాని ఇప్పుడు మనం బాగా తూర్పుగా రావడంమూలాన సూర్యాస్తమయానికి మన గడియారాలు నాలుగున్నర గంటలు వెనకబడ్డాయి. గ్రీన్‌విచ్‌గడియారం ఒకటిన్నరగంట మాత్రమే ముందుకున్నది. అంటే మనమిప్పుడు ఇంగ్లండు మధ్యాహ్నరేఖ దరిదాపుల్లో వున్నామన్నమాట. మనం సరియైన మార్గంలో ప్రయాణించి వుంటే ఇంకాసేపటికి ఇంగ్లండు మనకి తగిలేదే. కాని మనం తప్పదారిని పోతున్నాము ఆగ్నేయంగా పోతున్నాము. అందుచేత ఇది ఆఫ్రికాయేనని నావిశ్వాసం. ఈ పటం చూడు. ఆఫ్రికాఖండపు ఒకబుజం పడమటికి ఎలా పొడుచుకొచ్చిందో, మనం ఎంతవేగంగా ప్రయాణం చేశామో ఊహించు. తూర్పుగానే పోయినట్లయితే ఈపాటికి ఇంగ్లండు దాటిపోయివుండేవాళ్ళం. మిట్టమధ్యాహ్నం అయినప్పుడు, మన నీడలు మనమీదనే పడేవేళకి గనక మనంచూస్తే గ్రీన్‌విచ్ గడియారంలో దాదాపు పన్నెండు గంటలవుతుంది. జాగ్రత్తగా గమనించండి నేనుచెప్పేది రైటో కాదో. సందేహంలేదు. మనం ఆఫ్రికాలోనే వున్నాం. బలే, బలే."

జిమ్ దూరదర్శినితో ఇంకా నేలమీద చూస్తూనేవున్నాడు. తలకాయ అడ్డంగా ఆడించి ఇలా అన్నాడు:

"టామ్‌సాయర్ గారూ! ఎక్కడో పొరబాటు జరిగిందండీ. నాకెక్కడా నీగ్రోలు కనిపించడంలేదేం?"

"దానికేముంది? నీగ్రోలు ఎడారుల్లో వుంటారనుకున్నావేమిటి? అరె. అదేమిటి దూరంగా. ఆ అద్దా లిటివ్వు," అని టామ్ దూరదర్శిని తీసుకుని చూశాడు. దూరాన ఏదో నల్లటిగీత కనిపిస్తోందని, అదేమైందీ తెలియడం లేదనీఅన్నాడు.

(62-వ పేజీ చూడండి)

★ జ్యోతిష్యం ★

కృష్ణారావు స్కూల్ ఫైనలు చదువు తున్నాడు. అందరిచేత మంచి తెలివిగలవాడనిపించుకొన్నాడు. అన్నిట్లో అతనివే ఫస్టు మార్కులు. కృష్ణారావుకు అనేక బహుమతులు కూడ వచ్చినాయి.

కృష్ణారావు తండ్రి విశ్వనాథం గారికి జ్యోతిష్యం అంటే ఎంతో నమ్మకం. జ్యోతిష్యం చెప్పగలమనే వాళ్ళందరికీ ఆయనయిల్లు ఒక ధర్మ సత్రం లాగుండేది. తన ఆస్థిలో సగభాగాన్ని ఆయన జ్యోతిష్కుల సత్కారాల క్రింద ఖర్చుపెట్టాడు.

విశ్వనాథం గారికి కృష్ణారావు అంటే అమితమైన ప్రేమ. ఎప్పుడూ కొడుకును గురించే ఆలోచించేవాడు. వాడు ఎంతవరకు చదివేది, వాడికి ఎన్నోఏట పెండ్లి అయ్యేది, యిలాగ వాడి భవితవ్యాన్ని గురించి ప్రతివిషయం జ్యోతిష్కుల నడిగి తెలుసుకొనేవాడు. కృష్ణారావు జాతకం ఎప్పుడూ జ్యోతిష్కుల చేతిలోనే ఉండేది.

కృష్ణారావుకు జ్యోతిష్యం అంటే తలనొప్పి. జ్యోతిష్యంచెప్పే వాళ్లు బ్రతుకుతెరువు కోసం ప్రజలను మోసగిస్తారని కృష్ణారావు నమ్మకం. తన తండ్రి, వారి మాయలోపడి డబ్బంతా తగలేస్తుంటే చూచి సహించలేక పోయేవాడు. తండ్రితో ఎదురుపడి చెబుదామంటే తగనిభయం. అందుచేతఏమీ చేయలేక మధనపడేవాడు

ఒకనాడు కృష్ణారావు స్కూలు నుంచి తిరిగివచ్చేసరికి విశ్వనాథం గారు జ్యోతిష్కుడి ముందుకూర్చుని ఉన్నారు. జ్యోతిష్కుడు కాగితం మీద కృష్ణారావు భవిష్యత్తును గురించివ్రాసి విశ్వనాథం గారిచేతి కిచ్చాడు. జ్యోతిష్కుడు వెళ్ళిపోయినతరువాత "ఏం చెప్పాడు నాన్నా" అని కృష్ణారావు అడిగాడు. "నువ్వు ఈఏడు ఫస్టున పాసవుతావట" అంటూ విశ్వనాథం గారు గబాగబా లోనికి వెళ్ళారు.

కృష్ణారావుకి నవ్వు వచ్చింది. ఎలాగైనా తన తండ్రిని జ్యోతిష్యం అంటే అసహ్యించుకొనేటట్లు చేయాలనుకున్నాడు. ఆరాత్రంతా ఆలోచించాడు. ఒక ఉపాయం తట్టింది.

బండ్లమూడి సుబ్బారావు

రామం కృష్ణారావు స్నేహితుడు. స్కూలుఫైనలు చదువుతున్నాడు. కృష్ణారావు క్లాసులో ఎంతముందుంటాడో రామం అంత వెనక ఉంటాడు. "పరీక్షల్లో తన నంబరు రామం, రామం నంబరు తను వేసేటట్లయితే రామం ప్యాసయి తను తప్పుతాడు. అప్పుడు జ్యోతిష్కుడు చెప్పిన మాట అబద్ధమని ఋజువౌతుంది నాన్నకు జ్యోతిష్యం మీద నమ్మకం పోతుంది" అనుకున్నాడు కృష్ణారావు.

తెల్లవారిన తరువాత ఈవిషయం అంతా రామానికి చెప్పాడు. రామం సంతోషం పట్టలేక పోయినాడు తనుప్యాసౌతాను కదా అని. సరే అన్నాడు రామం. పరీక్షలు దగ్గర కొస్తున్నాయి. రామం దిగులు విచారం లేకుండా హాయిగా తిరుగుతున్నాడు.

పరీక్షలు రానేవచ్చినాయ్. కృష్ణారావు, రామం అనుకొన్న ప్రకారం ఒకళ్ళ నంబరు యింకొకళ్లు పరీక్ష పేపర్లమీద వేశారు.

పరీక్షలైనాయి. శలవలు వచ్చినాయి. కృష్ణారావు తన తండ్రిని మార్చబోతున్నా ననే సంతోషంతో ఉన్నాడు. రామం తను ప్యాసౌతాను అనే సంతోషంతో ఉన్నాడు ఇద్దరు ఇలా హాయిగా శలవులు గడిపారు.

తెల్లవారితే ఆదివారం. రిజల్ట్సు పడతాయని ఆత్రుతతో కృష్ణారావుకు ఆరాత్రి నిద్రపట్టలేదు.

ఎలాగైతేనేం తెల్లవారింది. రిజల్ట్సుపడ్డాయి. రామం ఫస్టున ప్యాసయినాడు కృష్ణారావు నంబరు లేదు. కృష్ణారావు సంతోషంతో పేపరు తీసికొచ్చి "ఏంనాన్నా. నేను ఫస్టున ప్యాసౌతానని ఆజ్యోతిష్కుడు చెప్పాడే మరి నేను ప్యాసు కాలేదే. వాళ్లు చెప్పేవన్నీ అబద్ధాలే" అని కృష్ణారావు ఇంకేదో చెప్ప బోతుండగా "ఏడ్చావులే. తప్పినందుకు ఏడవక పైగా జ్యోతిష్యాన్నే తిడుతున్నావా. వెధవ." అంటూ ఆరోజు జ్యోతిష్కుడు రాసియిచ్చిన కాగితాన్ని తిసుకొచ్చి కృష్ణారావుకిచ్చాడు. ఆ కాగితంలో యిలావుంది.

"మీఅబ్బాయికి కొంచెం శని పట్టివుంది. ఆ 'శని' మీ అబ్బాయిని యీఏడు ప్యాసుకానీయదు." కృష్ణారావుకు పూర్తిగా చదవక ముందే ఏడ్పువచ్చింది! ★

1954 సం॥ లో బొంబాయి సినిమాపరిశ్రమ సింహావలోకనం

(ఆంధ్రపత్రిక బొంబాయి సినిమావిలేఖరి)

భారతీయచలనచిత్రపరిశ్రమ కొత్త సంవత్సరంలో అడుగుపెట్టింది 1954 కంటె 1955 ఉజ్వలంగా, అభివృద్ధిదాయకంగా, ఉండే సూచనలు కనిపిస్తున్నాయి గడిచిన సంవత్సరం తీవ్రమైన ఆర్థికమాంద్యంతో ప్రారంభమైంది అంతంకావటం, బాక్సాఫీసువద్ద విజయం సాధించిన చిత్రాలపరంపరతో అంతమైంది అఖరులో వచ్చిన ఈ చిత్రాలు ప్రేక్షకులను సంతృప్తిపరచడమే కాక పరిశ్రమలోనివారికికూడా బాగా లాభాలుచేకూర్చాయి

1954 సం॥ లో బొంబాయిలో 90 పైగా హిందీచిత్రాలు విడుదలైనాయి వీటిలో పది చిత్రాలు బాక్సాఫీసు విజయం సాధించాయి 25 చిత్రాలు పెట్టుబడిదార్లకు బాగా లాభాలు చేకూర్చాయి 30 చిత్రాలు నిర్మాతలకు ఒకమోస్తరు విజయం సంపాదించి పెట్టాయి ఇక మిగిలినచిత్రాలు బాగా నష్టపడ్డాయి అయితే ఇలా నష్టపడిన చిత్రాల నిర్మాతలు వ్యాపారదృష్టితోగాని కళాదృష్టితోగాని సినిమారంగంలోకి వచ్చినవారుకారు వీరిలో కొందరు రంగంనుంచి పూర్తిగా నిష్క్రమించడమో, లేక చేసిన తప్పులు దిద్దుకుని కొత్త ఆశయాలతో పునః ప్రారంభించడమో జరిగింది.

చలన చిత్ర పునరుజ్జీవనం అని చెప్పదగిన గొప్పమార్పు గడిచిన ఏడాదిలో జరిగింది. బొంబాయి సినిమారంగంలో ఇంతకు పూర్వం ఎప్పుడూ లేని, ఒక క్రమపద్ధతి, ప్లానింగు ప్రవేశించాయి. ఫ్లోర్ మీద షూటింగ్ జరుగుతుండగా డైలాగులు రాయడం ఇక్కడి మామూలుపద్ధతి. చిత్రాన్ని సెన్సారువాళ్లు ఆమోదించిన తరువాత స్క్రిప్టుతప్పులు దిద్దుకోవటం ఇక్కడి ఆచారం. పెట్టుబడిదార్లను బుట్టలో వేసుకుని ఆషామాషీగా బయలుదేరిన నిర్మాతలు పరిశ్రమను పీడపురుగులవలె పట్టుకుని పీడించారు ప్రొడ్యూసరు కావటానికి, డైరెక్టరు కావటానికి అర్హతలంటూ ఏమీ లేకపోవటం వల్ల ఈ నిర్మాతలు తమకుచిత్తం వచ్చినట్టు చిత్రాలు నిర్మించారు యుద్ధానంతరం రోజుల్లో దర్జీలు, బంగళివాళ్లు, మోటారు డ్రైవర్లు, ఎక్స్ట్రాలు సప్లయి చేసేవాళ్లు, వ్యభిచారం వృత్తిగాగల స్త్రీలు, పురుషులు, అసాధారణ అభిమానం సంపాదించినవాళ్లు, వారి నౌకర్లు, ఓడీలు బీడీలు అమ్ముకునే వాళ్లు, ఒకరేమిటి రకరకాల వృత్తులవారు ఈ పరిశ్రమలోకి నిర్మాతలుగా డైరెక్టర్లుగా జొరబడ్డారు స్వాతంత్ర్యానంతరం కూడా వీరిజనాభా అభివృద్ధి కొనసాగింది. సినిమాలంటే ప్రజలలో ఉన్న సింహకొంత తీవ్రం ఈ మోజుగాళ్ల మాయలకు లొంగలేదు కాని రోజులు క్రమంగా మారాయి ప్రేక్షకులలో ఒక నూతన చైతన్యం కలిగింది జాతీయ ప్రభుత్వపు అన్యవయోగర కావ్యకళాపోషణ భావాలలో ఒకనూతన చైతన్యం వెల్లివిరిసింది ఈ కారణంవల్ల ప్రయోజనరహితమైన చిత్రాలు, పిచ్చిపిచ్చి గాలివాటు చెత్తచిత్రాలకు ఘోరపరాజయం సంభవించింది వరసగా అనేక



అశోక్‌కుమార్ ప్రొడక్షన్స్‌వారి "సమాజ్"లో తార శశికళ.



"మిస్సమ్మ"లో నాగేశ్వరరావు, బాలకృష్ణ, రేలంగి

*   *   *   *

సలీమ్ సముఖములో గుల్నార్ నృత్యం

అంజలీ వారి "అనార్కలీ"లో నాగేశ్వరరావు, పేకేటి, సురభి బాలసరస్వతి మున్నగువారు



1954 సం॥ లో బొంబాయి సినిమాపరిశ్రమ

చిత్రాలు నష్టపడడంతో పరిశ్రమ యావత్తూ అల్లకల్లోలమై పోయింది. చీడపురుగులుగా తయారైన నిర్మాతలు ఏరిపారవేయబడ్డారు. లక్ష్యశుద్ధి కలిగినవాళ్లు మాత్రమే నిలవదొక్కుకోగలిగారు.

ఇందాక పేర్కొన్న చలనచిత్ర పునరుజ్జీవనం ఇదే. ఈ పునరుజ్జీవనం 1954 లోనే వచ్చింది. ఈమార్పుమూలంగానే ప్రయోజనవంతమైన బాక్సాఫీస్ చిత్రాలనేకం తయారయ్యాయి. బూట్‌పాలిష్, ఔలాద్, టాక్సీడ్రైవర్, భాగ్యవాన్, ధర్మపత్ని, నాస్తిక్, మయూర్‌పంఖ్, పరిణీత, రాహీ, మున్నా, చైతన్యమహాప్రభు, మీర్జాగాలిబ్, మీనార్, గుజారా, వారిస్, నగీన్ మొదలైన చిత్రాలు ముఖ్యంగా పేర్కొనదగినవి.

ఈవిధంగా 1955 వ సంవత్సరం చాలా ఆశాజనకంగా ప్రారంభమైంది. చలనచిత్రానికి ప్రాణం అని చెప్పదగిన కథావస్తువుకు ఇదివరలో జరిగిన నిరాదరణ తొలగిపోయి, దాని ప్రాముఖ్యం హెచ్చింది. కథాప్రాముఖ్యం మూలంగా తారల రేట్లు బాగా పడిపోయాయి. దక్షిణభారత చిత్రనిర్మాతలు బొంబాయితారలకు అంతంత ధనం ధారపోయడం మానివేస్తే ఇప్పుడున్న కాస్త బ్లాక్‌మార్కెట్ కూడా పూర్తిగా సమసిపోయి, దేశాభివృద్ధిప్రణాళికలు అమలు చెయ్యడంలో సతమత మవుతున్న భారత ప్రభుత్వానికి న్యాయంగా ముట్టవలసిన డబ్బు ముట్టడంకూడా జరుగుతుంది.


ఇదివరకటిలాగా కంపెనీపేరుచూసి, తారలపేర్లు చూసి ప్రేక్షకులే కాక, కాస్త విద్యావివేకాలు కలిగిన డిస్ట్రిబ్యూటర్లు సైతం మోజుపడడం మానివేశారు. ప్రేక్షకులు తమ డబ్బుకుతగిన విలువ చిత్రంలో ఉండాలని కోరడం ప్రారంభించారు. డిస్ట్రిబ్యూటర్లు చిత్రంచూస్తేగాని డిస్ట్రిబ్యూషన్‌కు అంగీకరించబోమని పట్టుపట్టసాగారు. ఇది సమర్థించతగిన మార్పే. దీనివల్ల చిత్రంస్థాయి అభివృద్ధి కావడానికీ, చిత్రనిర్మాణం ఆషామాషీగా కాకుండా ఒక చక్కని క్రమపద్ధతిలో జరగడానికీ అవకాశం ఏర్పడింది. కథకు ప్రాముఖ్యం హెచ్చడంవల్ల వాస్తవికంగా జీవితాన్ని చిత్రించవలసిన అవసరం, సామాన్య మానవుని సమస్యలను చిత్రాల్లో ప్రతిబింబించవలసిన అవసరం ఏర్పడింది. బిమల్‌రాయ్ తీసిన "దోబిఘా జమీన్" చిత్రం కానిస్ చలనచిత్రోత్సవంలో యోగ్యతాపత్రం పొందడంతోనూ, భారత ప్రభుత్వపు యోగ్యతాపత్రం పొంగడంతోనూ వాస్తవికవాదానికి ఆదరం హెచ్చింది.

ఇవన్నీ మెచ్చుకోదగిన మంచి మార్పులే. కాని భారతీయ చలనచిత్రపరిశ్రమలో గృహకల్లోలాలు పూర్తిగా సమసిపోయాయనడానికి వీలులేదు. అతిప్రధానమైన విషయాలపై పరిశ్రమ నాయకులు పరస్పర విరుద్ధాభిప్రాయాలు ప్రకటించడం మానలేదు. నిర్మాతలలో ఒకరంటే ఒకరికి సరిపడదు. ఆఖరికి సెన్సార్‌షిప్‌సమస్యపై కూడా వారిలోవారికి ఏకీభావం లేదు. సినీమాల ఓనమాలు కూడా రాని నిర్మాతల అర్థరహిత స్వప్నాల కోసం అంతులేనిడబ్బు, కొన్ని సందర్భాల్లో 30 లక్షల రూపాయలదాకా వృథాచేయబడుతూనేవుంది. దీనికి ఒక చక్కని ఉదాహరణ "ముఘల్-ఇ-ఆజామ్." 1951లో ప్రారంభమైన ఈచిత్రం ఇంకా పూర్తికాలేదు. పోనీ రంగుల చిత్రమా అనుకుంటే అదీకాదు, మామూలు నలుపుతెలుపు చిత్రమే. అయినా దీనిసెట్లు బ్రహ్మాండమైన ప్రమాణంలో నిర్మించబడినవి. ఈసెట్లు, వాటి అలంకరణలు వెండి బంగారాలతో, వజ్రవైడూర్యాలతో నిర్మించబడినవి. దిలీప్‌కుమార్, మధుబాల, దుర్గాఖోటే, పృథ్వీరాజ్, నిగార్‌సుల్తానా, విజయలక్ష్మి, ఇంకా వందలాది పసుచుపిల్లలు ఈచిత్రంలో పాల్గొంటున్నారు. పగటిపూట షూటింగ్ జరపడం నిర్మాతకు నచ్చదుగనుక దాదాపు ప్రతిరాత్రీ షూటింగ్ జరుగుతూనే వుంది. ఎంతకాలం, ధనం, శ్రమా ఈచిత్రానికిగానూ వృథా అయిందో ఊహించండి. ఇంగ్లీషులో కూడా ఈ చిత్రం తయారవుతోంది. కాని దానిడైరెక్టరు అసీఫ్‌గారి ఇంగ్లీషు భాషాప్రవేశాన్ని దర్జీవాని క్యూబిజం పరిజ్ఞానంతో పోల్చవచ్చు.

ఇలాంటి విచిత్ర ఉదాహరణలను ఎదటపెట్టుకుని సినిమాపరిశ్రమనాయకులు 'మాకు ప్రభుత్వం సహాయం చెయ్యడం లేదరో!' అని గొంతెత్తి అరుస్తున్నారు. ప్రభుత్వ కోశాగారంలో ఉన్నది ప్రజలు చెమటోడ్చి సంపాదించిన డబ్బు. దేశదారిద్ర్యాన్ని తొలగించటానికే ఈ డబ్బు వినియోగపడాలని అభిలషించేవారెవరూ కె. అసీఫ్‌లాంటి చలనచిత్ర చక్రవర్తుల సినిమా స్వప్నాలమీద ఆడబ్బును దుర్వినియోగం చెయ్యాలని కోరరు. అసీఫ్‌ల పరిశ్రమలో ఏప్రభుత్వమూ ఒక్కదమ్మిడీ పెట్టుబడి పెట్టదు. అందులో జాతీయప్రభుత్వం అసలే అందుకు ఒప్పుకోదు. ఈపరిశ్రమ ముందు తన యిల్లు తాను చక్కపెట్టుకోవాలి. ముఘల్-ఇ-ఆజామ్‌లు చేసే వృథావ్యయాన్ని అరికట్టాలి.

ఫిబ్రవరిలో ఫిలింగోష్ఠి

ఈపారిశ్రామిక సమస్యలన్నిటినీ చర్చించేందుకు, సంగీతనాటక అకాడమీవారు వచ్చేనెల న్యూఢిల్లీలో చలనచిత్రగోష్ఠినొకదాన్ని ఏర్పాటుచేస్తున్నారు. భారతీయ నిర్మాతలలో ప్రముఖుడైన బి. ఎన్. సర్కార్ ఈగోష్ఠికి అధ్యక్షుడు. దేవికారాణి, పృథ్వీరాకపూర్ సంయుక్త కార్యదర్శులు. బొంబాయినుండి కె. ఎమ్. మోడీ, రాజ్ కపూర్, దిలీప్‌కుమార్, బిమల్‌రాయ్, అనిల్‌బిశ్వాస్, నర్గీస్, దుర్గాఖోటే, డేవిడ్, ఎమ్. ఎ. ఫజల్‌భాయ్ మున్నగువారు పాల్గొంటారు.



హాలీవుడ్, కొలంబియా పిక్చర్స్‌వారు తీస్తున్న ఒక చిత్రానికిగాను ఒక పెద్ద ఏనుగు కొచ్చిన్‌రేవునుండి లాస్ ఏంజెల్స్‌కు పంపబడింది.

కొత్తమార్కెట్ల అన్వేషణ

అమెరికాలో భారతీయచిత్రాలపై దిగ్బంధం ఉన్నందువల్ల, మన చిత్రాలను ఇంగ్లీషులో కూడా తీయాలనే సంబరం చాలవరకు తగ్గింది. ఈ కారణంవల్ల హిందీచిత్రాలకు కొత్తమార్కెట్లను సంపాదించడానికి పరిశ్రమ కృషిచేస్తున్నది. ప్రభుత్వంవారి వ్యాపార సౌహార్ద సంఘంలో సభ్యునిగా ప్రొడ్యూసర్ — డైరెక్టరు ఎ. ఆర్. కర్దార్ ఒక నెలరోజులపాటు పర్యటించడానికి ఇటీవలనే మధ్యప్రాచ్యదేశాలకు బయలుదేరి వెళ్లారు. సంఘటనలతో, సంగీతంతో కిక్కిరిసిన భారతీయచిత్రాలకు మధ్యప్రాచ్యంలో మంచిమార్కెట్ ఉన్నది. కాని ఈ సంగతి ఎవరూ గుర్తించలేదు. గుర్తించిన కొద్దిమందీ తమచిత్రాల విదేశీహక్కులను కారుచవగ్గా అమ్మేసుకుంటున్నారు. ఆప్రాంతంలో ఒక్కొక్క భారతీయ చిత్రంమీద లక్షరూపాయలపైగా నిర్మాతలకు రాగలదని అంచనా వేయబడింది. అరబ్బీభాషలోకి మన చిత్రాలను తర్జుమాచేస్తే ఈ రాబడి రెట్టింపుకూడా కాగలదు. అలాగే, ఇండోనీషియా కూడాను. అక్కడిభాష సంస్కృతానికి దగ్గరగా వుంటుంది. పైగా నూటికి 15 మంది భారతీయులు. అందుచేత ఇండోనీషియాలో మనచిత్రాలకు మంచిమార్కెట్ వున్నది.

కొత్త హిందీచిత్రాలసమీక్ష

క్రిస్మస్ పండగ రోజుల్లో బొంబాయిలో నాలుగు కొత్తచిత్రాలు విడుదలఅయినాయి.

సమాజ్

ఇది అశోక్‌కుమార్ ప్రొడక్షన్స్ వారి కొత్తచిత్రం. ఇందులో అశోక్‌కుమార్ కూడా నటించాడు. ఒక మోటార్ డ్రైవర్ కథానాయకుడు. పైకి ఎంత మొరటుగా వ్యవహరిస్తాడో హృదయం అంత ఆర్ద్రమైనది. అతని పేరు దాదా. దాదా పేరు చెబితే బొంబాయి కార్మికప్రాంతాల్లో హడలు. ఈచిత్రంలో కావలసినంతవినోదం చమత్కారంతో కూడిన సంభాషణలు ఉండడంవల్ల ఆఖరు తరగతి ప్రేక్షకులు విశేషంగా ఆకర్షింపబడవచ్చు. వారి కిది మంచి ఉత్సాహం కలిగించవచ్చును. కాని దర్శకత్వంలోని లోపాలవల్ల చిత్రం మొదట్లోనూ, చివరలోనూ తికమకలు ఏర్పడి ఎవడికీ బోధపడదు. దాదా పాత్రను అశోక్‌కుమార్ మంచి హుషారుగా నటించాడు. అతని గయ్యాళి ప్రేయసిగా శశికళకూడా చురుగ్గానే నటించింది. అతని చెల్లెలుగా ఉషాకిరణ్, ఇంకా జనాల్, నజీర్ హుస్సేన్, లీలామిశ్రా నటించారు. ఆగా ధరించినపాత్ర అతనికి తగినదికాదు. పైగా అతనికి సంబంధించినవరకూ దర్శకత్వం దారుణంగా వున్నది. సంగీతం ఒకమోస్తరుగా ఉంది. నృత్యాల్నిగూర్చి చెప్పుకోవడమే దండుగ. ఈచిత్రం స్వస్తిక్‌లో విడుదలయింది.

మీనార్

భారత్ భూషణ్ సోదరుడైన ఆర్. చంద్రా నిర్మించిన ఈచిత్రాన్ని హేమేన్ గుప్తా డైరెక్ట్ చేశాడు. సి. రామచంద్ర అద్భుతమైన సంగీతం కూర్చాడు. వి. ఎన్. రెడ్డి ఫోటోగ్రఫీ అత్యుత్తమంగా ఉన్నది. భారత్ భూషణ్, బీనారాయ్, ప్రాణ్, శ్రీరమణి, చంద్రశేఖర్ నటించారు. సినిమాటిక్‌గా "మీనార్" చాలా సంపన్నమైన చిత్రం. సంగీత దర్శకుడు సి. రామచంద్ర మంచినేర్పు చూపెను. దర్శకత్వంకూడా బాగానే వున్నది. కాని పునర్జన్మ వృత్తాంతం, పూర్వజన్మలో జరిగిన అన్యాయానికి తరువాతిజన్మలో పగ తీర్చుకోవడం మొదలైన అభూతకల్పనలవల్ల చిత్రం పాడైయింది. నటులందరూ బాగా నటించారు.

నగీన్

ఇది ఫిల్మిస్తాన్‌వారి చిత్రం. దర్శకుడు నందలాల్ జస్వంత్‌లాల్. నటీనటులు వైజయంతీమాల, ప్రదీప్‌కుమార్, ఎస్. ఎల్. పూరీ, జీవన్, ముబారక్ మున్నగువారు. ఫలీ మిస్త్రీ సుందరచ్ఛాయాగ్రహణం, హేమంతకుమార్ సంగీతదర్శకత్వం ఈ చిత్రానికి శోభకలిగించాయి. బాక్సాఫీస్ విజయం ఆశించి సంగీతమయంగా నిర్మించబడిన ఈచిత్రంలో కథ ఏమిటన్నా పట్టించుకోనక్కరలేదు. [illegible] ఘట్టంలో గెవాకలర్ సీక్వెన్సు సినిమాకళాదృష్ట్యా అద్వితీయంగా వున్నది. ఫోటోగ్రఫీ, కళాదర్శకుడు, కలర్ మిశ్రణాలు, టెక్నీషియన్లు సాధించిన సమష్టివిజయం. నటీనటులనుగూర్చి అంతగా చెప్పదగిందేమీ లేదు. వైజయంతీమాల, ప్రదీప్‌కుమార్ [illegible] నటించారు. సంగీతం బాగుంది. జయంతీమాలకు లతా పాడిన పాటలకంటె ప్రదీప్‌కుమార్‌కు హేమంతకుమార్ పాడినవే బాగున్నాయి. ఈచిత్రం [illegible]లో విడుదలయింది.

లైన నటీనటులతో ఈ చిత్రం తయారవుతున్నది.

ఆడబిడ్డ

వి. ఎస్. పి. పిక్చర్సు వారి "ఆడబిడ్డ" వై. అప్పారావు దర్శకత్వన చురుగ్గా తయారవుతున్నది. వాహినీలో షూటింగ్ జరుగుతోంది. రచన శ్రీశ్రీ, ఆరుద్ర. కాంచన, అమరనాథ్ మున్నగువారు నటిస్తున్నారు.

చైనీస్ కళాప్రదర్శనలు

భారతదేశ పర్యటనసందర్భంలో మద్రాసు వచ్చిన చైనీస్ కళాకారులు నాలుగు రోజులపాటు ప్రదర్శనలిచ్చి మద్రాసు ప్రజలను సమ్మోహితులను చేశారు. అన్నామలైమందిరంలో ఒక రోజు, ట్రిప్లికేన్ కళామంటపంలో మూడు రోజులు ప్రదర్శనలు జరిగాయి. వేలాది ప్రజలు హాజరై చైనీస్ కళావిశిష్టతను తిలకించి ఆనందించారు. చైనీస్ కవి యువాన్ షుయి - పో వ్రాసిన భారత ప్రశంసాగీతం (దీని అనువాదం గత వారం సంచికలో ప్రకటితమైనది.) తోనూ, హారీన్ చట్టో వ్రాసిన "హిందీ చీనీ భాయ్ భాయ్" గీతంతోనూ ప్రారంభించి, అనూచానంగా వస్తున్న చైనీస్ 'సాంప్రదాయికనృత్యాలను, సంగీత నాటకాలను ప్రదర్శించారు.

మొదటగా పద్మనృత్యం. సరస్సులో తేలియాడుతున్న తామరపువ్వులను అనుకరిస్తూ కొందరు యువతులు నృత్యం చేశారు. వారి వేషధారణం, అంగవిన్యాసం బహు మనోజ్ఞంగా వుండి నిరలంకృతమైన రంగస్థలాన్ని ఆకాసేపూ పద్మాలతో నిండిన సరోవరంగా మార్చివేశాయి. టీఆకులను సేకరించడం, సీతాకోక చిలుకను తరమడం వస్తువుగా కలిగిన మరొక బృందనృత్యం ప్రేక్షకులను తన్మయులను చేసింది వానరరాజు నృత్యం, నౌకావిహార నృత్యం, ప్రాచీన చైనాకథా వాఙ్మయంనుండి సృజించిన 'ఓపెరా' నృత్యాలు, కత్తియుద్ధ ప్రదర్శనాలు ఇంకా మరికొన్ని అంశాలు చూపబడ్డాయి వీటిలో ప్రతి ఒక్కటీ అహ్లాదకరంగా ఉండి చైనీస్ కళను కొద్ది కొద్దిగా మచ్చి చూపించాయి ముఖ్యంగా ఎన్నదగినది చైనీస్ వాద్యం పోనా మీదచేసిన గానం. ఈ వాద్యం మన సన్నాయిలాంటిదే వాద్యగాడు దానిమీద పక్షుల కూజితాలను అనుకరిస్తూ ఆలపించడం అద్భుతంగా వున్నది

ఈ ప్రదర్శనాలమీద వసూలైన ధనమంతా భారతప్రధానినిధికి పోతుంది ఒకరిమీద ఒకరు దుమ్మెత్తి పోసుకునే



భారతీయఫిలిమ్ ప్రతినిధులతో ఆమధ్య రష్యా వెళ్లివచ్చిన, సంగీత దర్శకుడు అనిల్ బిశ్వాస్. ఈయన ఢిల్లీఫిలింగోష్ఠిలో పాల్గొంటారు

సాధనా వారి చిత్రంలో లతా సంగీతం

సాధనావారు తమ "సంతానం"-చిత్రంలో లతామంగేష్కర్ చేత పాట పాడిస్తున్నారు. లతా తెలుగులో పాట పాడడానికి ఇదే మొదటిపర్యాయం మొన్న 4 వ తేదీన రేవతీలో పాట రికార్డ్ చేశారు "నిదురపో తమ్ముడా!" అనేపాట లతా పాడింది ఆమె తెలుగుఉచ్చారణ స్వచ్ఛంగా ఉండి ఆమెశ్రద్ధకు నిదర్శనంగా ఉంది పాట వ్రాసినవారు అనిసెట్టి సంగీత దర్శకుడు దక్షిణామూర్తి చిత్ర నిర్మాత రంగనాథదాసు

సారథీ చిత్రం

సారథీవారు తీస్తున్న సమాజ విమర్శనాత్మకచిత్రం "రోజులు మారాయి" చాల వరకు అయిందనీ, ఫిబ్రవరి అంతంలోగా విడుదల కావచ్చుననీ వినవస్తున్నది సమర్థ

ఒకరు: అమెరికాలో కార్మికులతోసహా అందరు మనుషులూ కార్లమీదే పోతారట.

మరొక్కరు: అవును. అన్ని కార్లూ మనుషులమీదే పోతాయిట కూడాను.

* * *

పొరుగింటిఆయన తమ ఇంటికి వస్తూఉండటం భార్యాభర్తలు చూశారు. ఆయన ఎప్పుడువచ్చినా ఏదో అరువు తీసుకుపోవటానికే. భార్య గుసగుసలాడుతూ ఈసారి ఏమీ అరువు ఇవ్వటానికి వీలు లేదని ఏదో సాకుచెప్పి పంపించి వెయ్యమని భర్తను హెచ్చరించింది. ఆయన వచ్చాడు.

"మీ పార ఒకసారి ఇస్తారా?"

"అయ్యో, ఈవాళే మీకు అవసరమైందా? నాకీరోజు ఉన్న పనంతా పారతోటే ఉన్నది. ఎలా?"

"ఫరవాలేదు లెండి. అయితే మీగొడ్డలి ఖాళీగానే ఉంటుందిగా అది ఇప్పించండి."

ఈరోజుల్లో భారత చైనాదేశాల సఖ్యానికి సాంస్కృతిక ప్రతినిధివర్గపర్యటనం ఎంతైనా తోడ్పడుతుంది.

నాస్తిక్

ఐ. యస్. జోహార్ దర్శకత్వంక్రింద ఫిల్మిస్థాన్‌వారు నిర్మించిన ఈ చిత్రంలో నళినీజయవంత్, అజిత్, ఉల్లాస్, లీలామిశ్రా మున్నగువారు నటించారు.

దేశవిభజనానంతరం జరిగిన మతకలహా సంక్షోభానికి గురియై భగవంతునిపై విశ్వాసం కోల్పోయిన ఒక యువకుడు తిరిగి ఆస్తికుడు కావటం ఈ చిత్రంలోని ప్రధాన ఇతివృత్తం. అజిత్ ఈ పాత్రను సమర్థతతో నిర్వహించాడు.

మొట్టమొదట మతకలహ బాధితులు



మధ్యప్రాచ్యంలో భారతీయ చిత్రాల మార్కెట్‌ను విస్తరింపజేయడానికి నిర్మాత దర్శకుడు ఎ. ఆర్. కర్దార్ ఇటీవల భారతప్రభుత్వపు వ్యాపార సౌహార్ద సంఘంతో కలిసి వెళ్లారు. అనార్కలీ, షాజహాన్, బూట్‌పాలిష్, తీన్‌బత్తీ చార్‌రస్తా చిత్రాలను వెంట బెట్టుకుని వెళ్లారు. ఆయనప్రక్కన వున్నది భార్య శ్రీమతి బహార్ కర్దార్.

ఆ సందర్భంలోని నేపథ్యగీతం, చాలా హృదయంగమంగా ఉన్నాయి. భగవంతుని పేరిట జరుగుతున్న అన్యాయాలను గర్హించే ఆ యువకుడు అనిల్ ఒక హత్యాప్రయత్న నేరంలో పోలీసులు తన్ను వెంటాడగా, సన్యాసి వేషంలో అజ్ఞాతంగా ఉండవలసి వస్తుంది. ఏ అన్యాయాలను తాను గర్హించాడో, ఆ పనులే తాను చేయవలసివస్తుంది. అడుగడుగున, అనుక్షణం ప్రతిఒక్కరు, భగవంతుని విశ్వసిస్తూ స్మరిస్తూ ఉండటం అనిల్‌కు కొంత చిరాకు కలిగిస్తుంది. కాని క్రమంగా అటువంటి భగవంతుడు ఉన్నాడేమోనని ఊహ స్ఫురించటం, చిట్టచివరకు ఒక నిస్సహాయస్థితిలో భగవన్నామం జపించి తరించటం జరుగుతుంది అయితే ఈ మానసిక పరిణామానికి సంబంధించిన సన్నివేశాలలో విరుద్ధభావసంఘర్షణ ఉండవలసినంత బలీయంగా నిరూపించబడలేదు

మొత్తంమీద చిత్రం బాగానే ఉన్నది సి. రామచంద్ర సంగీతరచన వినసొంపుగా ఉన్నది ఈ చిత్రం మద్రాస్, ప్లాజా థియేటర్లో

పహిలీ ఝలక్

వైజయంతీమాల కిశోర్‌కుమార్, ప్రాణ్, ఓంప్రకాష్, జవహార్ కౌల్, పమ్మి మున్నగువారు నటించిన ఈ చిత్రాన్ని జగత్ పిక్చర్స్‌వారు నిర్మించారు. యం. వి. రామన్ దర్శకులు. ఈ చిత్రంలో ఆరంభంనుంచి అంతంవరకు ప్రధానమైనది కథానాయిక పాత్ర. వైజయంతిమాల నటించింది. పెద్దపెద్ద సెట్టింగులు కల డాన్సులు ఉన్నాయి. సి. రామచంద్ర సంగీతం ఆహ్లాదకరంగా ఉన్నది. ఓంప్రకాష్ కావలసినంత వినోదం కలిగించాడు. ఓంప్రకాష్, దారాసింగుల మల్లయుద్ధంకూడా చేర్పబడింది కథానాయిక పెండ్లి కాబోతుండగా పెండ్లికొడుకును తిరస్కరించి ఇంట్లోనుంచి వెళ్లిపోతుంది ప్రేమించి పెళ్లిచేసుకున్న వానితో ఇంటికి వస్తుంది ఈమధ్యన ఆమెచేసే అద్భుత కృత్యాలే ఈ చిత్రం ఇతివృత్తం ఇందులో కథానాయకుని పాత్ర ధరించిన కిశోర్ కుమార్ బాగా నటించాడు మొత్తంమీద ఈ చిత్రం ప్రేక్షకుల వినోద కాలక్షేపానికి ఉపకరిస్తుంది

★ టామ్‌సాయర్ ప్రపంచయాత్ర ★

(54-వ పేజీ తరువాయి)

నేనిలా అన్నాను:

"నల్లటిగీతా? అయితే టామ్, మనం ఎక్కడున్నదీ సరిగ్గా తెలుసుకోవాలంటే ఆ గీతమీద అంకె చూస్తే తెలుస్తుందనుకుంటాను భూగోళ పటాల్లో మధ్యాహ్న రేఖలుంటాయిగా. ఆ కనిపించే గీత వాటిల్లో ఒకటై వుండవచ్చును."

టామ్ విసుక్కుని "హాక్‌ఫిన్! నీకెప్పటికి తెలివి తేటలొస్తాయి? పటాల్లోవుండే గీతలు భూమిమీద కూడా వుంటాయనుకుంటున్నావా?" అన్నాడు.

"నీవుద్దేశ్యం ఏమిటి టామ్‌సాయర్? ఈ పటంలో గీతలున్నాయా లేవా, చూడు సరిగ్గా కళ్లు పెట్టుకుని."

"పటంలోవుంటే నేలమీదకూడా వుండాలా?"

"ఉండవంటావా?"

"ఉండవు."

"అయితే ఈభూగోళపటాలన్నీ శుద్ధదండగ."

టామ్‌కుమండుకొచ్చింది. కాని నేను వాదనకు తయారుగావున్నాను జిమ్‌కూడా తయారయ్యాడు. మరునిమిషంలో పెద్దవాదోపవాదాలు జరిగేవే. ఇంతలో టామ్‌దూరదర్శిని దింపివేసి చప్పట్లు చరిచి "ఒంటెలు, ఒంటెలు, అవిగో!" అని అరిచాడు.

వెంటనే నేనూ, జిమ్ చెరొక దూరదర్శిని తీసుకుని చూశాము. ఎంత తీక్షణంగా చూసినా ఒంటెలు కనబడలేదు.

"ఏం తాతమ్మా, ఒంటెలన్నావు! ఎక్కడున్నాయి ఒంటెలు, అవి సాలెపురుగులు," అన్నాను.

"సాలెపురుగులా అమ్మమ్మా? సాలెపురుగులు ఎడారుల్లో వుంటాయా? పైగా అంత లైనుగా నడుస్తాయా? హాక్‌ఫిన్! నీకు ఆలోచించడం చేతకాదు. అసలు ఆలోచించడానికి నీకు బుర్ర వుంటేగా? మనం మైలుఎత్తున వున్నాం. ఆ ఒంటెలు రెండుమూడు మైళ్లదూరాన వున్నాయి. అవి సాలె పురుగులా? పెద్దదున్నపోతుల్లా కనిపిస్తుంటే అవి సాలె పురుగులంటావా? అవి ఒంటెలు. అది ఒక బిడారం. మైలు పొడుగున్న బిడారం," అన్నాడు టామ్.

"సరే, కిందికి పద, చూద్దాం. నా సొంతకళ్లతో చూసినదాకా నేను ఒప్పుకోను" అన్నాను.

"సరేపద. జిమ్. కిందికి పోనియ్యి."

కిందికి రాగానే ఒంటెలు స్పష్టంగా కనిపించాయి వాటిమూపులమీద పెద్దపెద్ద మూటలున్నాయి. కొన్ని వందలమనుషులు తెల్లటిబట్టలు ధరించినవాళ్లు కూడా కనిపించారు. తెల్లటి తలపాగాలు చుట్టుకున్నారు. కొందరు ఒంటెలమీద ఎక్కి, కొందరు నడిచి పోతున్నారు. ఎండ మలమల మాడ్చేస్తోంది. అబ్బ, ఎంత నెమ్మదిగా పోతున్నారు! మేము బాగా కిందికి వచ్చి వాళ్ళనెత్తిమీద ఒకవంద అడుగులఎత్తున ఆగాము.

మా విమానం చూడగానే, కిందమనుషులు గొల్లున గోలగా అరిచారు. కొందరు భయంతో బోర్లా పడిపోయారు. కొందరు మాపై తుపాకులు పేల్చసాగారు. మిగతావారు నలుదిక్కులా చెదిరిపోయారు. ఒంటెలుకూడా ఎటుపడితే అటు చెల్లాచెదరయ్యాయి

పాపం వాళ్ళె ఇబ్బందిపెట్టడమెందుకని మళ్ళీ ఒక మైలు పైకి పోయి అక్కడ ఆగి చూస్తున్నాము. చెదరిపోయిన మనుషులు, ఒంటెలు యధాస్థానానికి రావడానికి కొంతకాలం పట్టింది. మళ్లీ బయలుదేరారు కాని మావంకే చూస్తూపోతున్నారు నేము వాళ్ళని అనుసరించుతూ పోతున్నాము. ఇంతలో ఒకచోట ఒక పెద్దఇసకగుట్ట కనిపించింది దానికవతల కొందరు మనుషులు కనిపించారు. గుట్టమీద ఒకమనిషి పడుకుని, ఉండుండి తలఎత్తి అటూఇటూ చూస్తున్నాడు బిడారం కొంత దగ్గిరికి రాగానే వాడు గబగబ గుట్టదిగి అవతలివైపునవున్న తనవాళ్ళ దగ్గిరికి పరిగెత్తాడు. వెంటనే వాళ్లు త్వరగా గుర్రాలెక్కి గుట్టఎక్కి ఇవతలివైపు వచ్చి బిడారంమీద యుద్ధానికి సిద్ధపడ్డారు. వాళ్ల చేతుల్లో ఈటెలు, తుపాకులు ఉన్నాయి

కొద్దిసేపట్లో రెండు పక్షాలూ ఘోరయుద్ధంలో మునిగిపోయాయి. తుపాకుల మోతతో అప్పటిదాకా నిశ్శబ్దంగా వున్నఎడారి హోరెత్తిపోయింది. పొగ కూడా దట్టంగా అలుముకుంది. రెండుపక్షాల్లోనూ ఏ ఆరువందలమందో జనం వుండివుంటారు. కొంత


సేపట్లో గుంపులుగా చీలిపోయి భయంకరంగా యుద్ధం చేయసాగారు. పొడవడం, పేల్చడం, నరకడం, అబ్బ! ఆ దృశ్యం వర్ణనాతీతం. పొగ విచ్చినప్పుడల్లా మృత కళేబరాలూ, క్షతగాత్రుల శరీరాలూ కనిపించాయి. ఒంటెలు పారిపోయాయి.

చివరికి గుర్రాలమీద వచ్చినదొంగలు తాము గెలవలేమని గ్రహించారు. వాళ్లనాయకుడు వెనక్కి పారిపొండని ఆజ్ఞాపించాడు. చావగా మిగిలినదొంగలు వెంటనే వెనక్కితిరిగి దౌడుతీశారు. ఆఖర్న పారిపోతున్న ఒకఆశ్వికుడు ఒక స్త్రీచేతులోంచి బిడ్డను లాక్కుని చంకలో యిరికించుకుని పోతున్నాడు. వాడివెనక హృదయభేదకంగా రోదిస్తూ ఆబిడ్డతల్లి పరుగెత్తుతోంది. తనబిడ్డను తనకిమ్మని గోలపెడుతోంది. ఆమె అలా పరుగెత్తిపరుగెత్తి, తనవారినుండి చాల దూరం వచ్చేసింది. ఆమె ఎంతవేడుకున్నా ఆ నిర్దయుడు వినిపించుకోకుండా పోతున్నాడు. చివరకు నిరాశ చేసుకుని ఆతల్లి నేలమీద కూలబడి చేతుల్తో ముఖం కప్పుకుని విలపించసాగింది.

ఇదంతా మేము చూస్తూనేవున్నాము. తక్షణమే టామ్ విమానాన్ని ఆశ్వికుని దిక్కుగా కిందికి పోనిచ్చాడు. రయ్యినబాణంలా వచ్చి ఆశ్వికుణ్ణి వాడి చేతిలో శిశువుతోసహా కింద పడవేశాము. వాడికి బాగా దెబ్బ తగిలింది. శిశువుమాత్రం కసుగందకుండా సురక్షితంగా నేలమీద పడింది. ఆశ్వికుడు లేచి వళ్లు దులుపుకుని, ఇంకా పరుగెత్తుతున్న తన గుర్రాన్ని పట్టుకునేందుకు తూలుకుంటూ పోయాడు. వాణ్ణి పడవేసిందేమిటో వాడికి తెలియలేదు. ఎందుకంటే మేము వెంటనే నాలుగువందల అడుగుల పైకివెళ్లిపోయాము.

ఆ స్త్రీ పోయి తన శిశువును తెచ్చుకుంటుందని భావించాము. కాని ఆమె ఇంకా కళ్లు మూసుకుని రోదిస్తూనేవుంది. జరిగినదేమీ చూడనే లేదల్లేవుంది. తనశిశువుపై నిరాశచేసుకున్నట్లుంది. తన వారినుండి అరమైలు దూరంలోవుంది. ఆమెనూ శిశువునూ ఎలాగైనా ఒకచోటికి చేర్చాలనుకున్నాము. శిశువు ఆమెకు పావుమైలు దూరంలోవుంది. బిడారం మనుషులు దూరంగా ఉండగానే శిశువును తల్లిదగ్గిరికి తీసుకుపోవాలనుకున్నాము. సాహసించి కిందికి వచ్చాము. జిమ్ నిచ్చెనమీదుగా నేలమీదికి దిగి శిశువును ఎత్తుకున్నాడు. శిశువు బొద్దుగావుండి నవ్వుతూ తుళ్లుతూ వున్నది. అంతయుద్ధంలోనుంచి బయటపడినా సంతోషంగా వుండడం ఆశ్చర్యం కలిగించింది. తరవాత తల్లి దగ్గిరికి విమానాన్ని పోనిచ్చాము కొంతదూరంలో ఆపాము. జిమ్ మళ్లీ దిగి మెల్లిగా ఆమెను సమీపించాడు. చంకలోవున్న శిశువు తల్లినిచూసి సంతోషంతో కేరింతలు కొట్టింది. ఆ ధ్వని విని తలఎత్తిచూసి, గంతువేసివచ్చి బిడ్డను అందుకున్నది. గుండెలకు హత్తుకుని ముద్దుపెట్టుకుని కిందికి దింపింది. తన బిడ్డను తనకి తెచ్చియిచ్చిన జిమ్‌నుకూడా సంతోషంపట్టలేక కావిలించుకుంది. తరవాత తన మెళ్లోవున్న బంగారు గొలుసు తీసి జిమ్‌మెళ్లో వేసింది. మళ్ళీ అతన్ని కావిలించుకుంది. అప్పుడు బిడ్డనెత్తుకుని ముద్దులుకురిపించింది. ఏడుస్తూ, నవ్వుతూ దేవుణ్ణి ప్రార్థించింది. జిమ్ వెనక్కి వచ్చి నిచ్చెనఎక్కి విమానంలోకి వచ్చాడు. మరునిమిషంలో మేము ఆకాశంలోకి ఎగిరిపోయాము. ఆ స్త్రీ కళ్లుపెద్దవిచేసి ఆశ్చర్యంతో మాకేసే చూస్తోంది. అలాగే ఎంతో సేపు మమ్మల్ని చూస్తూ నుంచుండిపోయింది.

(ఇంకా వుంది)



ఎగవుకోమని భర్తను బతిమాలుతోంది పత్ని

వాగిణీవారి "అర్ధాంగి'లో సావిత్రి, నాగేశ్వరరావు

విజ్ఞాన వీధులు

పుత్తూరి లక్ష్మీనారాయణ—ఏలూరు

—మనము త్రాగే సోడా నీళ్లలో ఉట్టి నీరు కాదు అంగారామ్ల వాయువు అనే-మున్నపురాయి కాల్చినప్పుడు వచ్చే వాయువు - వాయువును నీటిలో కరగించిన ద్రావకము ఇది తీవ్రమైన ద్రావకము కాదు దీనిని త్రాగినప్పుడు సోడాబుడ్డిలో ఉండినప్పుడు ఈ ద్రావకముమీద ఉండిన ఒత్తిడి మన కడుపులో దీనిమీద లేకపోవుట వలన, ఈ ద్రావకములో కరిగిన అంగారామ్ల వాయువు త్రేనుపుగా బయటికి వచ్చును మంచి నీరు త్రాగినప్పుడు త్రేనుపు రావడానికి మంచినీటిలో అటువంటి కరిగించిన వాయువు ఏదివున్నది?

* * *

టి వి. రామచంద్రరావు — రామభద్రపురం

—*Flying Saucers* గురించి ఇంత వరకూ "అదిగో పులి అంటే ఇదుగో తోక" అనే వివరాలేకాని నమ్మతగిన తఫసీళ్ళు ఏవి తెలియుటలేదు ఒకదానిలోనుంచి ఇద్దరు మనుష్యులు దిగినారని ఒకడూ, అది తన తోటలో దిగినప్పుడు దానిలోనుంచి ఏవో మాటలు వినబడ్డాయని మరొకడూ ఇలాగ అనేకవార్తలు చెప్తున్నారు ఫ్రాన్సులో ఒక మహానుభావుడు తుపాకి తీసి ఒక *Flying Saucer* ని కొట్టేసెట చెప్పిన వాడు *Flyteng Saucer* లోని మనిషి కాడు ఈ మహానుభావుని గురించి యజమాని మరేం చెప్పుతుంటారు చెప్పండీ?

* * *

జి సత్యనారాయణ—గొల్లప్రోలు.

—ఉత్తర దక్షిణ ధ్రువాంతవారికి ఆరు నెలలు పగలూ ఆరునెలలు చీకటీ అన్నది నిజమే! మొదటి ఆరునెలలలోనూ ఒక దినము కాలము సూర్యుని గమనమును పరిశీలించినచో సూర్యుడు ఆకాశములో ఒక చోటనుండి బయలుదేరి ఒక సున్నా చుట్టి తిరిగి బయలుదేరిన చోటికి వచ్చినట్లుగా కనబడును ఆ ఆరునెలలకాలమూ సూర్యుడు ఆకాశములో కనబడుతునే వుండును

మనకు వేసవికాలములో సూర్యుడు తెల్లవారగట్ల 5½ నుండి సాయంకాలము 6½ వరకూ కనబడుతునే యుండును ఈ సంగతి మీరు గుర్తించే వుంటారు ఇంగ్లండులో తెల్లవారగట్ల 4½ నుండి సాయంకాలము 9½ వరకూ సూర్యుడు కనబడతాడు వేసవికాలములో ధ్రువాంతవగ్గర వున్నవారికి రోజల్లా కనబడుతునే వుంటాడు ★

గ్రంథస్వీకారం

బాలవీరులు.

బాల నాటికలు

రచన శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి 53 పేజీలు వెల రు1-0-0

చిన్నపిల్లల కోసం రచించిన ఈ పుస్తకంలో బాలవీరులు, [illegible], పటాటోపము, బొమ్మలపెళ్లి, అంతాదేవుని మహిమే అనే అయిదు నాటకలున్నాయి పిల్లలకు ఆకర్షణీయంగా ఉండేటట్లు ముద్రించబడింది

Edited, Printed & Published by S Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras



గంగిరెద్దు

Regd. No. M. 4479.

